తెలంగాణ
తెలుగు జాతీయ దినపత్రిక
# తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం

సంపుటి :03, సంచిక :12 హైదరాబాద్: సంపాదకులు: గున్నాల అనిల్ రెడ్డి, సోమవారం జులై 07, 2025, పేజీలు -12, వెల -5/-

Published from: Hyderabad, Rangareddy, Nizamabad, Adilabad, And Bhadradri Kothagudem, Vijayavada, Vishakapatnam, Kurnool, Anantapur






## నేడు మరోసారి ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి

- కేంద్ర మంత్రులతో భేటీ
- ఏఐసీసీ పెద్దలతో సమావేశం


**హైదరాబాద్,జులై 06(తెలుగు వెలుగు):**రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు, సమాలోచనలు జరిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం మరోసారి ఢిల్లి వెళ్లనున్నారు. అలాగే పార్టీ సంస్థాగత అభివృద్ధి అంశాలపై చర్చించేందుకు ఏఐసీసీ పెద్దలతోనూ సమావేశమై చర్చించను న్నారు. ప్రభుత్వ పదవులకు సంబంధించి ఇటీవల తీసుకున్న మంత్రిమండలి నిర్ణయాలు, తదనంతర చర్యలు, పార్టీ పదవుల నియామకాల జాబితాపై ఈ సందర్భంగా అగ్రనేత రాహుల్ గాంధీ, అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సమాలోచనలు జరిపి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రెండు రోజుల పాటు ఢిల్లీలోనే ఉండనున్నారు.

# బీజేపీ, నితీశ్‌కుమార్ బీహార్‌ను నేరాలకు అడ్డాగా మార్చారు

- రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ,జులై 06(తెలుగు వెలుగు):** బీజేపీ పైనా, బీహార్‌లోని నితీశ్ కుమార్ ప్రభుత్వంపైనా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీఆగ్రహం వ్యక్తంచేశారు. బీహార్ రాజధాని పట్నాలో ప్రముఖ వ్యాపారవేత్త గోపాల్ ఖేమ్కా హత్యపై రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. నితీశ్ కుమార్, బీజేపీ కలిసి రాష్ట్రాన్ని గూండాల రాజ్యంగా మార్చాయని మండి పడ్డారు. ఇప్పుడు బీహార్ దోపిడీ, కాల్పులు, హత్యల నీడలో ఉందని, రాష్ట్రంలో నేరాలు జరగడమ నేది సాధారణంగా మారిపోయిందని రాహుల్‌గాంధీ విమర్శిం చారు. నేరాలను నిర్మూలిం చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. రాష్ట్ర పౌరులను రక్షించలేని పార్టీకి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలెవరూ ఓటు వేయొద్దని సూచించారు. దారుణాలను, దోపిడీలను పూర్తిగా నిర్మూలించి, పురోగతివైపు అడుగులు వేసే సమయం బీహార్‌కు వచ్చిందని రాహుల్ గాంధీ అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వేసే ఓట్లు కేవలం ప్రభుత్వ మార్పు కోసమేగాక రాష్ట్రాన్ని రక్షించడానికి ఉపయోగపడతాయనే విషయాన్ని ప్రజలు దృష్టిలో పెట్టుకోవాలని పిలుపునిచ్చారు.కాగా పట్నాలోని గాంధీమైదాన్ ఠాణా పరిధిలోగల రామ్‌గులాం చౌక్ పనాష్ హోటల్ సమీపంలో గోపాల్ ఖేమ్కా దారుణహత్యకు గురయ్యారు. శు క్రవారం రాత్రి 11.40 గంటల సమయంలో తన ఇంటికి చేరుకున్న ఆయన కారు దిగుతుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో ఖేమ్కా అక్కడికక్కడే మృతిచెందాడు.ఈ హత్య బీహార్ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపింది. దీనిపై ఆర్జేడీ కీలక నేత తేజస్వి యాదవ్ స్పందించారు. దుండగులు గోపాల్ ఖేమ్కాను పట్నా నడిబొడ్డున హత్యచేస్తే.. అక్కడికి పోలీసులు చేరుకోవడానికి రెండు గంటల సమయం పట్టిందని విమర్శించారు. ఆరేళ్ల క్రితం వ్యాపారవేత్త ఖేమ్కా కుమారుడిని ఇదేవిధంగా హత్యచేస్తే ఇప్పటికీ ఆ హంతకులను అరెస్టు చేయలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు.



## సూపర్ పవర్ దేశాల నియంతృత్వంతో ఘర్షణ వాతావరణం


- నితిన్ గడ్కరీ


**న్యూఢిల్లీ,జులై 06(తెలుగు వెలుగు):**రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధాలు ప్రపంచంలో ఘర్షణ వాతావరణాన్ని సృష్టించాయని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ప్రస్తుతం ఏ సమయంలోనైనా యుద్ధానికి దారి తీసే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. నాగ్‌పూర్‌లో ఆదివారం జరిగిన 'బియాండ్ బోర్డర్స్' అనే పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పెద్ద అగ్రరాజ్యాల నియం తృత్వం, నిరంకుశత్వం కారణంగా సమన్వయం, సామరస్యం, ప్రేమ కనుమరుగవుతున్నాయన్నారు. నేడు మొత్తం ప్రపంచవ్యాప్తంగా ఘర్షణపూరిత వాతావరణ ఉందన్నారు. రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య

మిగతావి 2లో

## డేంజర్‌లో శ్రీశైలం ప్రాజెక్ట్ గేట్లు

- కొత్తవి ఏర్పాటు చేయకుంటే తుంగభద్ర గతే : కన్నయ్య నాయుడు





## ప్రభుత్వ విద్యకు బ్రాండ్ అంబాసిడర్స్

- మా'స్టార్స్'.. మీకు హేట్సాఫ్

**విజయవాడ జులై 06(తెలుగు వెలుగు):** ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక వసతులు కల్పిస్తూ.. కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చుదిద్దుతోంది ఏపీ ప్రభుత్వం. అయితే కొందరు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తూ అక్కడే క్వాలిటీ ఎడ్యుకేషన్

మిగతావి 2లో

## పేదల ఇంటి కలకు బాసటగా ఇందిరమ్మ ఇళ్లు

- లబ్ధిదారులకు పత్రాలు అందజేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**హైదరాబాద్,జులై 06(తెలుగు వెలుగు):**తెలంగాణ రాష్ట్ర ప్రజలకు గృహ హక్కును హామీగా ఇచ్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ఖమ్మం జిల్లా మధిరలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అర్హులైన లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. దశాబ్దాలుగా గృహావసరానికి ఎదురుచూసిన పేదల కలలకూ ఈ రోజు ఆరంభమైందని ఆయన చెప్పారు.ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గత పాలకులు పేదల అభ్యున్నతిని పదే పదే వాయిదా వేసినప్పటికీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వారి బలహీనతలను గుర్తించి న్యాయం చేయడానికి ముందుకు వచ్చిందన్నారు. పేదలకు ఇంటి ఆశ ఎక్కువ కాదని భావించిన గత పాలకుల వైఖరికి విరుద్ధంగా, తమ ప్రభుత్వం నిజమైన మార్పును తీసుకొచ్చిందని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల కోసం మొదటి ఏడాదిలోనే రూ.22,500 కోట్లు వెచ్చించడం దేశ వ్యాప్తంగా ఒక మైలురాయిగా నిలుస్తుందని భట్టి వివరించారు. మొదటి దశలో నాలుగు లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టా మని, ఇందులో మధిర నియోజకవర్గం పెద్ద స్థాయిలో లబ్ధి పొందు తుందని తెలిపారు. ఇది ప్రజల జీవితాల్లో గౌరవభరితమైన మార్పు ను తీసుకువస్తుందన్నారు.భట్టి విక్రమార్క తమ ప్రభుత్వ సంక్షేమ శ్రేణి గురించి మాట్లాడుతూ, రేషన్ బియ్యం, రూ.500 గ్యాస్ సబ్సిడీ, ఉచిత విద్యుత్, పెన్షన్లు, ఉపాధి హామీ,

మిగతావి 2లో

## రైతులపై బావబామర్దుల కపట ప్రేమ

- వరి వేస్తే ఉరి అన్నది ఎవరు?
- పంట నష్టపరిహారం ఎప్పుడైనా చెల్లించారా?:మంత్రి తుమ్మల
- మాజీ మంత్రులు కెటిఆర్, హరీష్ రావులను నిలదీసిన మంత్రి తుమ్మల



**హైదరాబాద్,జులై 06(తెలుగు వెలుగు):** బిఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రులు కెటిఆర్, హరీష్‌రావులు రైతుల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. వరి వేస్తే ఉరి అన్నది ఎవరు ? పంటనష్ట పరిహారం ఎప్పుడైనా చెల్లించారా? అని మంత్రి తుమ్మల ఆదివారం ఒక ప్రకటనలో నిలదీశారు. బావబామర్దుల తీరు చూస్తే వారు తీవ్ర నిరాశ నిస్పృహాలో ఉన్నట్లు స్పష్టమవు తుందన్నారు. నిరాధారమైన ఆరోపణలతో వారు రైతాంగాన్ని తప్పుదోవపట్టించే చర్యలను రైతన్నలు ఎప్పటికీ గుర్తించరని మంత్రి తుమ్మల తెలిపారు. రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ మొట్టమొదటి ప్రాధాన్యత అని, దేశ చరిత్రలోనే ఎక్కడ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం

మిగతావి 2లో




## రేవంత్ పాలనలో ఎరువులకూ కరవే.. కెటిఆర్



## తెలంగాణలో భారీ నుంచి అతిభారీ వర్షాలు..

## గురుదక్షిణగా చంద్రబాబుకు 65 టిఎంసిలు..

- రేవంత్ రెడ్డిపై హరీష్ రావు ఫైర్
- ప్రభుత్వం స్పందించకపోతే రైతులతో వెళ్లి మోటార్లు ఆన్ చేస్తాం
- తక్షణమే కన్నెపల్లి పంప్‌హౌస్ మోటర్లు ఆన్ చేసి రైతులకు నీళ్లు ఇవ్వాలి
- పరిస్థితి తీవ్రస్థాయికి చేరకముందే కళ్లు తెరిచి రైతులకు సాగునీరు
- ఇవ్వాలి మాజీ మంత్రి హరీష్ రావు



**హైదరాబాద్,06(తెలుగు వెలుగు):** కన్నెపల్లి, కల్వకుర్తి వద్ద మోటార్లను ఆన్ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఏ హరీష్ రావు విమర్శించారు. నీటి విలువ తెలియని వాళ్లు పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. కెసిఆర్ మీద, బిఆర్ఎస్ మీద కోపంతో రైతులను ఇబ్బందికి గురి చేస్తున్నారని ఆరోపించారు. కన్నెపల్లి పంప్ హౌస్ ప్రారంభించి లక్షలాది ఎకరాలకు నీళ్లు అందించాలని డిమాండ్ చేశారు. వారం పది రోజుల్లో ప్రభుత్వం మోటార్లు ఆన్ చేయకపోతే రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. వెంటనే కన్నెపల్లి పంప్ హౌస్ మోటార్లు ఆన్ చేయాలని, కాళేశ్వరం కింద లక్షలాది ఎకరాలకు నీరు అందించాలని చెప్పారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే కెసిఆర్ నాయకత్వంలో కదులుతామని, అన్ని జిల్లాల రైతులతో వెళ్లి

మిగతావి 2లో

తెలంగాణ తెలుగు-వెలుగు
తెలుగు జాతీయ దినపత్రిక
ప్రతిక్షణం ప్రజల పక్షం

### సూపర్ పవర్ దేశాల నియంతృత్వంతో

## ఘర్షణ వాతావరణం

(మొదటి పేజీ తరువాయి)

యుద్ధాలు జరుగుతున్నాయని.. ఏ సమయంలోనైనా యుద్ధం లాంటి పరిస్థితి తలెత్తే పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. భారతదేశ సాంస్కృతిక వారసత్వాన్ని ఆయన ప్రశంసించారు. భారత్ బుద్ధుడి భూమి అని, ఇది ప్రపంచానికి సత్యం, అహింస, శాంతి సందేశాన్ని అందించిందని పేర్కొన్నారు. యుద్ధ సాంకేతికత ఇప్పుడు పూర్తిగా మారిపోయిందని నితిన్ గడ్కరీ తెలిపారు. ఇప్పుడు ట్యాంకులు, సాంప్రదాయ విమానాలు ఉపయోగం తక్కువగా ఉందని.. అయితే మిస్సైల్స్, డ్రోన్‌ల వంటి ఆధునిక ఆయుధాలు ఎక్కువగా ఉపయోగపడుతు న్నాయని తెలిపారు. ఇప్పుడు మిస్సైల్స్‌ను జనవాసాలపై వేస్తున్నారని.. దాంతో మానవాళి రక్షించడం కష్టమవుతుంద న్నారు. ఇది ప్రపంచ స్థాయిలో చర్చించాల్సిన తీవ్రమైన సమస్యగా పేర్కొన్నారు.

## ప్రభుత్వ విద్యకు బ్రాండ్ అంబాసిడర్స్

(మొదటి పేజీ తరువాయి)

లభిస్తుందని భావిస్తున్నారు. ఇలాంటి అనుమానాలను పటాపంచలు చేస్తూ ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి ఆదర్శంగా నిలిచారు. టీచర్ల చొరవపై ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశాడు.ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించాలని కోరే మీరు, మీ పిల్లల్ని కూడా అదే పాఠశాలల్లో చేర్పించడం ఆదర్శనీయం అని లోకేష్ అన్నారు. ప్రభుత్వ విద్యాలయాలు, ప్రైవేటు విద్యాసంస్థల కంటే మెరుగైనవని గవర్నమెంట్ స్కూళ్లలో చదివిన మీ పిల్లలు సాధించిన ఫలితాలే ప్రత్యక్ష ఉదాహరణలు. పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్న పశ్చిమ గోదావరి జిల్లా పోడూరు మండలం జిన్నూరు జడ్పీ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ బొంతు మధుబాబు, పంగిడిగూడెం ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు బాబూ రాజేంద్రప్రసాద్, సోమరాజుచెరువు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వీరవాసరపు బాలకరుణాకరరావులకుఅభినందనలుతెలియజేస్తున్నాను అని వెల్లడించారు.


## పేదల ఇంటి కలకు బాసటగా ఇందిరమ్మ ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

ఆరోగ్యశ్రీ, రైతు రుణమాఫీ, మహిళల కోసం వడ్డీ లేని రుణాలు వంటి పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నామని చెప్పారు. రాష్ట్రంలోని కోటి పది లక్షల కుటుంబాల్లో ఇప్పటికే 93 లక్షల కుటుంబాలకు ఈ పథకాలు అందిస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు.

## డేంజర్‌లో శ్రీశైలం ప్రాజెక్ట్ గేట్లు

### - కొత్తవి ఏర్పాటు చేయకుంటే తుంగభద్ర గతే : కన్నయ్య నాయుడు



**శ్రీశైలం,జులై 06(తెలుగు వెలుగు):** శ్రీశైలం ) పదో గేటు నుంచి నీరు లీకేజ్ అవుతున్న నేపథ్యంలో నేడు శ్రీశైలం ప్రాజెక్ట్ ను గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు పరిశీలించారు. . ఆనకట్ట రేడియల్ క్రస్ట్‌గేట్ల పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన పదో నంబర్ గేట్ ద్వారా వచ్చే లీకేజీ వల్ల ఇబ్బందేమీ లేదన్నారు. గేటు నుంచి నీటి లీకేజీ 10శాతం కంటే తక్కువగా ఉందని తెలిపారు. రేడియల్ క్రస్ట్ గేట్లకు క్రమం తప్పకుండా పెయింటింగ్ వేయాలని సూచించారు.మరో ఐదేళ్లకైనా రేడియల్ క్రస్ట్ గేట్లు కొత్తవి ఏర్పాటు చేయాల్సిన అవసరముందన్నారు. కొత్త గేట్లు ఏర్పాటు చేయకపోతే తుంగభద్ర పరిస్థితి ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు గేట్ల నిర్వహణకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు. ఆనకట్ట నుంచి 60 మీటర్ల దూరంలో ప్లంజ్‌పూల్ ఉందని, దాని వల్ల శ్రీశైలం ఆనకట్టకు ప్రమాదం లేదన్నారు. అయినప్పటికీ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ మరమ్మతులు చేయాలని సూచించారు. ప్రాజెక్ట్ ల భద్రత విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని ఆయన అధికారులకు సూచించారు.

## ప్రయాణికులకు శుభవార్త.. ద.మ. రైల్వే కీలక నిర్ణయం

**హైదరాబాద్,జులై 06(తెలుగు వెలుగు):** ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్తను అందించింది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు ప్రాంతాలకు 48 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు ప్రకటించింది. జూలై 9వ తేదీ నుంచి సెప్టెంబర్ 25 వరకూ వివిధ రోజుల్లో ఈ రైళ్లు అందుబాటులో ఉంటాయి. తిరుపతి నుంచి హిసార్ మధ్య బుధ, ఆదివారాల్లో 12 ప్రత్యేక రైళ్లు, కాచిగూడ నుంచి తిరుపతి మధ్య ప్రతి గురు, శుక్రవారాల్లో 8 ప్రత్యేక రైళ్లు, నరసాపూర్ నుంచి తిరువణ్ణమలైకి మధ్య బుధ, గురువారాల్లో 16 ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. ఈ రైళ్లకు అడ్వాన్స్ రిజర్వేషన్ సదుపాయం కూడా కల్పించినున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ రైళ్ల వివరాలను దక్షిణ మధ్య రైల్వే వెబ్‌సైట్‌లో పొందుపరిచామని తెలిపారు.

### రైతులపై బావబామర్దుల

## కపట ప్రేమ

(మొదటి పేజీ తరువాయి)

కేవలం ఒకటిన్నర సంవత్సర కాలంలనే కోటి మూడు లక్షల కోట్ల రూపాయలు రైతు సంక్షేమా నికి ఖర్చు చేసి మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచామని ఆయన వివరించారు. తమ ప్రభుత్వంలో రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు అందుతున్నాయని, పల్లెల్లో సంతోషం వెల్లివిరుస్తుంటే బిఆర్ఎస్ నాయకుల కళ్ళల్లో కారం కొట్టినట్లుగా ఉందన్నారు.**నాడు రైతుబంధు లేదు రుణమాఫీ లేదు** ధనిక రాష్ట్రంగా ఉన్న కాలంలో కూడా బిఆర్ఎస్ ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీని నాలుగు దఫాలుగా, రుణమాఫీ 2018 మొత్తాన్ని ఆఖరి సంవత్సరంలో ఎన్నికల ముందు సగం మందికి చేసి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని మంత్రి తుమ్మల ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.21 వేల కోట్లు ఒకేదఫా రుణమాఫీ చేసి 25 లక్షల మంది రైతులను రుణ విముక్తులను చేసిందని తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఎగ్గొట్టిన రైతు బంధు తో పాటు గత రెండు పంట కాలాలలో రూ.13,500 కోట్ల రైతు భరోసా నిధులు జమ చేశామని తెలిపారు. ఇటీవల తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్లు రైతుభరోసా నిధులు జమ చేసిన విషయాన్ని మంత్రి తుమ్మల గుర్తుచేశారు.**పోర్టల్‌లో ఎరువుల నిల్వలు** రాష్ట్రంలో ఎరువుల కొరత ఉందంటూ అబద్దాలు చెప్పడంలో బిఆర్ఎస్ నేతలు ఆరితేరారని, కేంద్ర ప్రభుత్వం పోర్టల్‌లో ఎరువుల నిల్వల వివరాలు చూసుకుని మాట్లాడాలని మంత్రి తుమ్మల సూచించారు. ఆగస్టు మాసానికి సరిపడా ఎరువులను ముందుగానే సరఫరా చేయాలని తాము కేంద్రాన్ని కోరుతున్నట్లు తెలిపారు. రానున్న రోజులలో అంటే ఎరువుల వినియోగము అధికంగా ఉండే పంటకాలంలో రైతులకు సకాలంలో ఎరువులు అందించలేమన్న ఒకే ఒక్క కారణం తో ముందు జాగ్రత్తగా కేంద్రం రాష్ట్రానికి కేటాయించిన ఎరువులను సకాలం లో సరఫరా చేయమని అడుగుతున్నామని వివరించారు.**ఆర్థిక ఇబ్బందులున్న రైతు ప్రాధాన్యత** రైతులకు సంబంధించిన ప్రతి విషయానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి తుమ్మల తెలిపారు. ఆర్థికపరంగా ఎన్ని సమస్యలున్నప్పటికీ హామీలన్నిటిని నిర్దిష్ట సమయంలోనే అమలు చేస్తూ ముందుకెళ్తున్నట్లు తెలిపారు.**కేంద్ర పథకాల మోకాలడ్డింది ఎవరు** కేంద్ర ప్రభుత్వ పథకాలకు బిఆర్ఎస్ ప్రభుత్వ పదేండ్లలో రాష్ట్రం వాటా చెల్లించకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వ నిధులు రాకుండా అడ్డుకున్నది ఎవరని మంత్రి తుమ్మల ప్రశ్నించారు. మీరు చేసిన అరకొర రుణమాఫీ వల్ల రైతులకు ప్రయోజనమైన చేకూరిందా ? రైతు బంధు డబ్బులను రెండున్నర నెలల లోపు ఎప్పుడైనా ఇచ్చారా ? రైతుబంధు పేరుతో మీరు ఎగొట్టిన పథకాలు ఎన్ని ? గత ఐదు సంవత్సరాలలో పంట నష్టపరిహారం రైతులకు ఎప్పుడైనా చెల్లించారా ? యాంత్రికరణ పథకానికి తూట్లు పొడిచింది మీరు కాదా ? పచ్చి రొట్ట విత్తనాల సబ్సిడీలను కూడా బకాయిలు పెట్టింది మీరు కాదా ? అని మంత్రి తుమ్మల మాజీ మంత్రులు కెటిఆర్, హరీష్‌రావును నిలదీశారు.

### గురుదక్షిణగా చంద్రబాబుకు

## 65 టిఎంసిలు..

(మొదటి పేజీ తరువాయి)

కన్నెపల్లి మోటార్లు ఆన్ చేస్తామని హెచ్చరించారు. పరిస్థితి తీవ్రస్థాయికి చేరకముందే కళ్లు తెరిచి రైతులకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నీళ్లు ఇస్తే మంచిది.. మోటార్లు ఆన్ చేసి నీళ్లు ఎత్తిపోయకుంటే రైతులతో కదులుతాం..వారి ప్రయోజనాల కోసం ఎంతవరకైనా పోరాడతామని ఉద్ఘాటించారు. రాష్ట్ర, రైతుల ప్రయోజనాల కోసం పోరాటం చేస్తామని కెసిఆర్ చెప్పారని తెలిపారు. ఈ ప్రభుత్వాన్ని విడిచిపెట్టం అని, ప్రజాశక్తిలో ఉన్న బలం ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ నేతలతో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ,నీళ్ల విలువ తెలిసిన నాయకుడు ముఖ్యమంత్రిగా ఉంటే ఆ నీళ్లను మలుపుకునే ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకుంటారని, నీళ్ల విలువ తెలియని నాయకులు పాలకులుగా ఉండటం వల్ల తెలంగాణ ఇబ్బందులను ఎదుర్కొంటున్నదని అన్నారు.**ఈసారి కూడా ఆంధ్రకు నీళ్ళొదిలే ప్రయత్నం** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కృష్ణాలో అతి తక్కువ నీళ్లు వాడుతుంది రేవంత్ రెడ్డి ప్రభుత్వమే అని హరీష్‌రావు తెలిపారు. చంద్రబాబుకు గురుదక్షిణ కింద 65 టిఎంసిలను రేవంత్ రెడ్డి ఎపికి ధారా దత్తం చేశారని ఆరోపించారు. కృష్ణ నీళ్లను ఆంధ్రకు వదిలిపెట్టడమే ఈ ప్రభుత్వ లక్ష్యం అని విమర్శించారు. చంద్రబాబుతో రేవంత్‌కు ఉన్న చీకటి ఒప్పందం ఏంటి..? అని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో క్రాప్ హాలిడే ప్రకటించి ఆంధ్రలో మూడో పంటకు నీళ్లు వదిలారని, ఈసారి కూడా ఆంధ్రకు నీళ్ళొదిలే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లాలో కల్వకుర్తి ప్రాజెక్టు మోటర్లు ప్రారంభించక పోతే వేలాదిమంది రైతులతో ప్రాజెక్టు వద్దకి వెళ్లి మోటర్లు ఆన్ చేసే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి పదే పదే పాలమూరు బిడ్డ అని పెద్ద మాటలు మాట్లాడుతున్నారని, కానీ పాలమూరు రైతుల కడుపు కొడుతున్నారని విమర్శించారు. శ్రీశైలంలో వరద 36 రోజుల కిందనే శ్రీశైలంలో వరద వచ్చిందని, ఇన్ని రోజులైనా ఇప్పటివరకు కల్వకుర్తి మోటర్లు ఆన్ చేయలేదని పేర్కొన్నారు.**రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు** కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో మంచి వర్షాలు పడుతున్నాయని, మన రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని, సగటు కంటే తక్కువ వర్షపాతం నమోదయిందని చెప్పారు. రాష్ట్రంలో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు విత్తనాలు వేసే పరిస్థితి లేదని, వేసిన విత్తనాలు మొలకెత్తే పరిస్థితి లేదని తెలిపారు. చాలాచోట్ల ప్రాజెక్టుల కింద నారుమడ్లు పొయ్యాలా..వద్దా..అని ఆలోచిస్తున్నారని అన్నారు. భూగర్భ జలాలు రోజురోజుకీ అడుగంటుతున్నాయని, వర్షాభావ పరిస్థితులు ఇలాగే కొనసాగితే సాగునీటికే కాదు పలు జిల్లాల్లో త్రాగునీటికి కూడా ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో మంచి వర్షాలు కురవడం వల్ల కృష్ణ, గోదావరి నదుల్లో మే నెలలోనే వరదలు వచ్చాయని, ఈ వరదను ఒడిసి పట్టి రిజర్వాయర్లు, చెరువులు, చెక్ డ్యాములు నింపుకోవాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తున్నదని విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం స్విచ్చాఫ్ మోడ్‌లో ఉందని, నీళ్లను ఒడిసిపట్టడంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కాలం కాకపోయినా, వర్షం పడకపోయినా కృష్ణ, గోదావరి వరద నీళ్లను ఒడిసి పట్టుకుంటే రెండు పంటలకు నీరందించే అవకాశం ఉందని తెలిపారు. ఎక్కడికక్కడ ప్రాజెక్టులలో మోటర్లు ఆన్ చేసి రిజర్వాయర్లు, చెక్ డాములు, చెరువులు నింపుకునే అవకాశం ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి, మంత్రులు బిఆర్ఎస్‌పై బురద జల్లడంలో పోటీపడుతున్నారని, తమపై నీలాప నిందలు వేయడంలో బిజీగా ఉన్నారని మండిపడ్డారు.రిజర్వాయర్లు ఉన్నాయని పేర్కొన్నారు. నీళ్లు ఎత్తుకోవడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏమిటి..? అని ప్రశ్నించారు. ఈ రిజర్వాయర్లలో నీళ్లు నింపి పెట్టుకుంటే లక్షల ఎకరాల్లో రెండు పంటలు పండే అవకాశం ఉంటుందని తెలిపారు.**ఎన్‌డిఎస్‌ఎ ఒక కాళేశ్వరం పైనే పనిచేస్తుందా?** మేడిగడ్డ నుంచి 73,600 క్యూసెక్కుల ప్రవాహం ఉందని, నీటిని తీసుకునే అవకాశం ఉన్నా.. ఎందుకు తీసుకోవట్లేదని హరీష్‌రావు ప్రశ్నించారు. నీటిని ఎత్తిపోసేందుకు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని అడిగారు. ఇప్పుడు కాళేశ్వరం మోటర్లు ప్రారంభిస్తే 15 జిల్లాలకు నీళ్లు ఇచ్చే అవకాశం ఉందని చెప్పారు. వెంటనే కాళేశ్వరం మోటర్లు ప్రారంభించి రిజర్వాయర్లు నింపి రైతులకు మొదటి పంటకు నీళు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం కింద రైతులు నారుమళు పోయాలా.. వద్దా అనే అయోమయంలో ఉన్నారని పేర్కొన్నారు. మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులు చేయడానికి ప్రభుత్వం ఎందుకు ఆలోచిస్తోందని నిలదీశారు. కుంగిన రెండు పిల్లర్లకు మరమ్మత్తులు చేయమంటే ప్రభుత్వం 19 నెలల నుంచి కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. మేడిగడ్డకి మరమ్మత్తులు చేయాలని, కన్నెపల్లి పంప్ హౌస్ ప్రారంభించి నీళ్లు ఎత్తిపోసి రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలని కోరారు. ఎన్‌డిఎస్‌ఎ దేశం మొత్తం పనిచేస్తుందా.. ఒక కాళేశ్వరం పైనే పనిచేస్తుందా? అని ప్రశ్నించారు. పోలవరంలో డయాఫ్రంవాల్ కొట్టుకుపోతే అక్కడికి ఎన్‌డిఎస్‌ఎ ఎందుకు పోలేదని ప్రశ్నించారు.ఐదు రోజుల్లో తెలంగాణకు వచ్చి నివేదికలు ఇస్తారు కానీ ఐదు సంవత్సరాలైనా పోలవరం విషయంలో స్పందించరని అన్నారు. కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి బంధానికి ఇది నిదర్శనం అని ఆరోపించారు. బిజెపి, కాంగ్రెస్ కలవకపోతే ఎస్ఎల్‌బిసి కుప్పకూలి దాని భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారితే ఎందుకు ఎన్‌డిఎస్‌ఎ వెళ్లలేదని నిలదీశారు. ఎన్‌డిఎస్‌ఎ పేరుతో కాళేశ్వరం విషయంలో ఎందుకు కాలయాపన చేస్తున్నారని అడిగారు. ఎస్ఎల్‌బిసికి ఒక న్యాయం కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు ఒక న్యాయమా..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సగటు రైతుగా ఆలోచించి మేడిగడ్డతో సంబంధం లేకుండా మోటార్లు ఆన్ చేసి నీళ్లు ఇవ్వాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు అక్షయ పాత్ర లాంటిదని, దాన్ని తక్కువ చేసి చూపించడం, కాళేశ్వరాన్ని పక్కకు పెట్టి రాజకీయాలు చేయాలని మీరు అనుకుంటే రైతులు క్షమించరని హరీష్‌రావు అన్నారు.**కెటిఆర్ చర్చకు రమ్మంటే.. రేవంత్ ఢిల్లీకి వెళుతున్నారు** రైతుల సంక్షేమంపై మంగళవారం(జులై 8) కెటిఆర్ సిఎం రేవంత్‌రెడ్డిని చర్చకు రమ్మన్నారని ఆయన ఢిల్లీకి వెళుతున్నారని హరీష్‌రావు ఆరోపించారు. తన సవాల్ గురించి ఏమైనా అంటే ఢిల్లీలో ఉన్నా చెప్పొచ్చని అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

## రేవంత్ పాలనలో ఎరువులకూ కరవే.. కెటిఆర్



**హైదరాబాద్,జులై 06(తెలుగు వెలుగు):** కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతు భరోసా, రైతు రుణమాఫీ లేదని మండిపడ్డారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు . రైతు సమస్యలను పరిష్కరించడంలో రేవంత్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. . కనీసం అప్పు తెచ్చి వ్యవసాయం చేద్దామంటే ఆఖరికి ఎరువులకు కూడా కరవు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా రైతు సమస్యలపై కేటీఆర్ ట్విట్ చేశారు.ప్రభుత్వం అడిగినట్లుగా రైతులు ఆధార్ కార్డులు ఇచ్చినా, వారికి కనీసం బస్తా ఎరువు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఈ ప్రభుత్వం ఎందుకుందని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 1.94 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల లోటు ఎందుకుందో రైతులకు రేవంత్ ప్రభుత్వం వివరించాలని కోరారు. రూ.266.50 ఉండాల్సిన బస్తా యూరియా ధర ఇప్పుడు రూ.325 ఎలా అయ్యిందో రైతులకే కాదు, రాష్ట్ర ప్రజలకు మొత్తం తెలియాలని నిలదీశారు. ఈ బ్లాక్ మార్కెట్ దందాను దగ్గరుండి నడిపిస్తోంది ఎవరని ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ కృత్రిమ కొరత ఎవరివల్ల ఏర్పడుతుందో చెప్పాలని అన్నారు. ఆఖరికి ఎరువులను కూడా బుక్కేస్తున్న మెతన్నలు ఎవరో వెంటనే రేవంత్ ప్రభుత్వం విచారణ జరిపించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## సిగాచీ పేలుడు ఘటనలో మరొకరు కన్నుమూత

### ● 41కి చేరిన మృతుల సంఖ్య



**పటాన్ చెరు,జులై 06(తెలుగు వెలుగు):** సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ధ్రువ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జితేందర్ ఆదివారం మృతి చెందారు. దీంతో ఈ దుర్ఘటనలో మరణించిన వారి సంఖ్య 41కి చేరినట్లు అధికారులు తెలిపారు.కాగా, మరోవైపు, శిథిలాల కింద లభించిన మరో మృతదేహం వివరాలను అధికారులు గుర్తించారు. ఈ ప్రమాదంలో గల్లంతైన మరో తొమ్మిది మంది ఆచూకీ ఇప్పటికీ లభించకపోవడం కుటుంబ సభ్యులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. పేలుడు ధాటికి కుప్పకూలిన భవన శిథిలాలను తొలగించే పనులు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయని అధికారులు వెల్లడించారు. తమ వారి జాడ తెలియకపోవడంతో కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి.

## తెలంగాణలో భారీ నుంచి అతిభారీ వర్షాలు..

### ● హెచ్చరించిన ఐఎండీ



**హైదరాబాద్,జులై 06(తెలుగు వెలుగు):** తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఆదివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది.సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయని పేర్కొంది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే ఛాన్స్ ఉందని వెల్లడించింది. ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఇక నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయని చెప్పింది. పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే సూచనలున్నాయని వాతావరణ విభాగం పేర్కొంది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వానలు పడే సూచనలున్నాయని తెలిపింది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని వివరించింది. ఇదిలా ఉండగా.. గడిచి 24గంటల్లో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, సిరిసిల్ల, వికారాబాద్ సహా పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదైందని టీజీడీపీఎస్ వివరించింది.

## భీమ్ ఆర్మీ ఆజాద్ సమాజ్ పార్టీ ఆజాద్ సమాజ్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన షేక్ అస్లాం నియామకం



**శేర్లింగంపల్లి:** భీమ్ ఆర్మీ ఆజాద్ సమాజ్ పార్టీ శేర్లింగంపల్లి నియో జకవర్గం ఇన్చార్జిగా ఉన్న షేక్ అస్లాం గారిని బీమార్మి రాష్ట్ర అధ్యక్షులు వనం మహేందర్ గారు అస్లాం సేవలను గుర్తించి నియోజకవర్గ ఇన్చార్జి. మరియు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా నియమించడం జరిగింది. షేక్ అస్లాం మాట్లా డుతూ అంబేద్కర్ ఆశయ సాధనలో పాటుపడతానని అంబేద్కర్ భావజాలాన్ని ఇంటింటికి తీసుకువెళ్తానని చెప్పాడు. నాపై నమ్మకంతో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా నియమించినందుకు జాతీయ అధ్యక్షులు. చంద్రశేఖర్ ఆజాద్‌కి. మరియు రాష్ట్ర అధ్య క్షులు వనం మహేందర్ గారికి ధన్యవాదాలు తెలియజేశారు

## జనార్ధన స్వామి ప్రత్యేక అలంకరణ



**తెలుగు - వెలుగు, తూ.గో.జిల్లా బ్యూరో (అనపర్తి):** తొలి ఏకాదశి విష్ణుమూర్తికి అత్యంత ప్రీతికరమైన రోజు. ఒక ఏడాది మొత్తం 24 ఏకాదశులు వస్తాయి అందులో ఆషాడ శుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశి(పేలాల పండగ) అంటారు.ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా అనపర్తి పాత ఊర్లో గల శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయా నికి విచ్చేసి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## సమాచార హక్కు చట్టం వికారాబాద్ జిల్లా సెక్రటరీగా ఏకగ్రీవ ఎన్నిక: గుజ్జరి మహేందర్



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి జులై 6 తెలుగు వెలుగు:**సమాచార హక్కు చట్టం వికారాబాద్ జిల్లా సెక్రటరీగా గుజ్జరి మహేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ ఎన్నిక ఆర్.టి.ఐ జాతీయ అధ్యక్షులు చంటి ముదిరాజ్ ఆధ్వర్యంలో ఎన్నిక చేయడం జరిగింది.ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ అవినీతి జరిగిన బయటకు తీసి ప్రజలకు మేలు జరిగే విధంగా పనిచేస్తానని ఆయన విలేకరుల సమావేశంలో తెలిపారు. రాష్ట్రంలో చాలా అవినీతి జరుగుతుందని ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి అంతం నా పంతం అనే విధంగా పనిచేస్తానని మహేందర్ తెలిపారు అలాగే ఎక్కడ అవినీతి జరిగిన తమకు సమాచారం ఇస్తే వెంటనే దానికి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.ఈ సందర్భంగా తన ఎన్నికకు సహకరించిన జాతీయ అధ్యక్షులు చంటి ముదిరాజ్,స్రవంతి వెంకటేశం షేక్ గౌస్, తెలంగాణ రాష్ట్ర ఆర్.టి.ఐ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆర్‌టిసి బస్సులో ప్రయాణించిన ఎమ్మెల్యే జారె

● ప్రభుత్వ పథకాలపై ఆరా తీసిన జారె





**తెలుగు వెలుగు ప్రతినిధి, అశ్వారావుపేట:** ఆదివారం ఆర్‌టిసి బస్సులో అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రయాణించి మహిళ ప్రయాణీకులతో ఆత్మీయ పలకరింపులు నిర్వహి ంచారు. దమ్మపేట మండల పరిదిలోని ముష్టిబండ గ్రామం నుంచి అశ్వారావుపేట వరకు ప్రజలతో కలిసి ఎమ్మెల్యే జారె ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ ప్రయాణంలో ప్రజలతో ఆత్మీయంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు వారికి ఎలా అందుతున్నాయో ఏవైనా సమస్యలు ఎదురవుతున్నాయా అని ఆరా తీశారు. ప్రజలు స్వేచ్ఛగా భయపడకుండా తమ సమస్యలు తెలిపేం దుకు ప్రోత్సహించారు. ప్రభుత్వం అందించే ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, విద్య, ఆరోగ్య పథకాలు వంటి అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలతో నేరుగా మమేకమవుతూ సమస్యలను అర్థం చేసుకునేందుకు ఇలాంటి కార్యక్రమం ఎంతో ఉపయో గకరంగా నిలుస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పేటలో ఎమ్మెల్యే జారె పర్యటన






**తెలుగు వెలుగు ప్రతినిధి, అశ్వారావుపేట:** మండల కేంద్రం అశ్వారావుపేటలో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పర్యటించారు. ఈ నేపధ్యంలో ప్రభుత్వ అనుమతులు పొందిన ఎకోపార్క్ నిర్మాణానికి మండల నాయకులతో కలసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. వర్షాకాలం నేపధ్యంలో చోటుచేసుకునే సీజనల్ వ్యాధులకు సంబంధించి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. అక్కడి వైద్యులచే అందిస్తున్న చికిత్సల గురించి వివరాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు. తర్వాత కెమిలాయిడ్స్ గెస్ట్‌హౌస్ లో లయన్స్ క్లబ్ 40వ వార్షికోత్సవ వేడుకలు, నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులకు అభినందనలు తెలుపుతూ సమాజంలో సేవా కార్యక్రమాలకు ప్రజాప్రతినిధుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# తొర్రూరు డిపోలో ఇద్దరు డ్రైవర్లకు బహుమతి అందజేసిన డిఎం



**తొర్రూరు,జులై 6:**టీజీఎస్ ఆర్టీసీ బస్సు డిపో అంటేనే వరంగల్ రీజినల్ లో మంచి పేరు ఉన్నది. బస్సు డిపోలో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లు,కండక్టర్లపై డిఎం విధుల రీత్యా మందలింపులు చేసినప్పటికీ వారిపై ప్రేమను కనబరుస్తూ డిపో అభివృద్ధికి ఎలా కృషి చేయాలని వారికి సూచనలు ఇస్తూ డిపోను మంచి అభివృద్ధి దిశలో నడిచే విధంగా డి ఎం పద్మావతి వారిపై ప్రేమను రాగాలతో పనులు చేయించుకుంటున్నారు. విధి నిర్వహణలో ఎవరైనా సరే ఎక్కడైనా సరే మందలింపులు అనేది సహజమే.డీఎంకు కూడా పై అధికారుల నుండి ఒత్తిడి వస్తూ ఉంటుంది. డిపోలో నడుస్తున్న ఆర్టీసీ బస్సులు బస్సు డిజిల్ ట్యాంక్ లో డీజిల్ నింపిన తర్వాత ఎన్ని కిలోమీటర్లకు ఎంత డీజిల్ రావాలనేది ముందుగానే నిర్ణయించబడుతుంది. ఇప్పుడున్న రోడ్ల పరిస్థితిని బట్టి కే ఎం పి ఎల్ తీసుకురావటం సాధ్యపడకుండా ఉన్నది. అయినప్పటికీ తోరూర్ టీ జి ఎస్ ఆర్టీసీ బస్ డిపోలో ఇద్దరు డ్రైవర్లు బస్సు డిపో పేరు నిలబెట్టి కె ఎంపి లను తీసుకురావడం హర్షించదగ్గ విషయం అని అంటున్నారు. జూన్ నెలలో అత్యధికంగా కేఎంపిఎల్ తీసుకు వచ్చిన డ్రైవర్ డి రామచందర్ మొదటి స్థానాన్ని సాధించుకున్నారు. రెండవ స్థానంలో డ్రైవర్ వి నరసయ్య నిలిచారు. వీరిద్దరికీ డిపో మేనేజర్ పద్మావతి ప్రోత్సాహ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని డిఎం పద్మావతి ప్రసంగిస్తూ డిపోలో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరు కూడా వారు చేసే వీధులలో ఏదో ఒక రూపకంగా బహుమతులు అందుకోవాలని ఆశిస్తున్నామని అన్నారు. ఇది కేవలం వారి ఒక్కరికే కాదు డిపో పేరుతో సహా అందరికీ మంచి పేరు నిలుస్తుందని అన్నారు. ప్రస్తుతం ఇది వర్షాకాలం ప్రతి డ్రైవర్ తగిన జాగ్రత్తలు తీసుకొని బస్సులను నడుపుతూ కేఎంపిఎల్ తీసుకొచ్చే విధంగా డిపోకు సహకరించాలని కోరారు. ఎస్టిఐ రజిత రెడ్డి, ఎం ఎఫ్ విజయ్ కుమార్, ఎంసీ గోపాల్ రెడ్డి, డిపోలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# దుష్కర్మ ఫలితాలను తారుమారు చేసే శక్తి ఒక్క హరేకృష్ణ మహా మంత్రం








**జహీరాబాద్, తెలుగు వెలుగు ప్రతినిధి జూలై 6:** దుష్కర్మ ఫలితాలను తారుమారు చేసే శక్తి ఒక్క హరేకృష్ణ మహా మంత్రానికే ఉన్నదని సంగారెడ్డి జిల్లా కంది హరేకృష్ణ టెంపుల్ ప్రతినిధి విభిషణ్ ప్రభు వెల్లడించారు. జహీరాబాద్ హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీరామ మందిర ప్రాంగణంలో ఆదివారం నాడు 162 వ నగర సంకీర్తన కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సత్సంగ సమావేశంలో ఆయన ప్రవచించారు. కర్మ ఫలం అనుభవించి తీరాలని అన్ని గ్రంథాలు చెబుతున్నాయని అయితే అనునిత్యం హరినామ జపం చేయడం ద్వారా దుష్కర్మ ఫలితాలను దూరం చేసుకోవచ్చునని పేర్కొన్నారు.అందమైన వెన్నెల చంద్రుడిని చూడడం ద్వారా భగవంతుడి అందం, భగ భగ మండే సూర్యుడిని చూడడం ద్వారా భగవంతుడి శక్తి, అదే అద్దం ముందు తన ప్రతిబింబం తాను చూసుకోవడం ద్వారా భగవంతుని సృష్టి కనిపిస్తుందన్నారు. అందుకే మనిషి ఇతరులపై ఆధారపడకుండా ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని హితవు పలికారు. జగన్నాథ్, బలదేవ్, సుభద్ర ల తో కూడిన రథయాత్రలు ఈ ఆషాడం మాసం పొడవునా జరుగుతూనే ఉంటాయని, వీటిని దర్శించుకోవడం ద్వారా వేయి జన్మల పుణ్య ఫలం లభిస్తుందన్నారు. ఆషాడ ఏకాదశి, ద్వాదశి రోజులను అత్యంత పవిత్రంగా భావిస్తూ ఈ రెండు రోజులపాటు పాండురంగని సన్నిధిలో గడపాలని ఆయన భక్తులను సూచించారు. అంతకు ముందు శ్రీ రామ్ మందిర్, ఆర్యనగర్ ప్రాంతాలలోకీర్తనలు ఆలపిస్తూ శోభాయాత్ర జరిపారు. భజనలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ భక్తులు భక్తి పారావశ్యంలో మునిగిపోయారు. ఇదిలా ఉండగా జహీరాబాద్ మండలం హుగ్గెల్లి గ్రామంలోనూ 127 వ పల్లె సంకీర్తన అట్టహాసంగా జరిగింది. గ్రామ నలుమూలల నుండి వచ్చిన భక్తులు ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో సంకీర్తన జరిపారు. ఈ సందర్భంగా పూరి జగన్నాథ్, పండరిపూర్ పాండురంగ క్షేత్రాల విశేషాలను వక్తలు వివరించారు. వందలాది భక్తులు పాల్గొన్న ఈ కార్యక్రమం లో ప్రధానంగా చిన్నారులు చేసిన భక్తిరస విన్యాసాలు ఆహుతులను ఆకట్టుకొన్నాయి.

# క్రీడా సామాగ్రి అందజేసిన ఎమ్మెల్యేకి అభినందనలు...

● సంక్షేమ సంఘం అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి...



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పి ఎస్ సి చైర్మన్ రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ వారికి క్రీడా సామాగ్రి అందజేశారు. ఎమ్మెల్యే ఆదేశం మేరకు రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాలనీలో యూత్ పిల్లలకు క్రీడా సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పురేందర్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలకు క్రీడలు ఎంతో ముఖ్యమని వారి అవసరాలకు క్రీడా సామాగ్రి ఎమ్మెల్యే ఇవ్వటం చాలా సంతోషకరంగా ఉందని అధ్యక్షుల ఎమ్మెల్యే కి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సూర్యనారాయణ శ్రీధర్ లక్ష్మీనారాయణ శ్రీనివాసరావు జి ప్రసాద్ యూత్ కమిటీ సభ్యులు భార్గవ్ నందు రిత్విక్ సాయి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఎంసీ నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యే "నల్లమిల్లి" శుభాకాంక్షలు



**తెలుగు - వెలుగు, తూ. గో. జిల్లా బ్యూరో (అనపర్తి):** ఎమ్మెల్యే వెంకట రాజు గోపాలపురం నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేసి ప్రజల మన్ననలు పొందారని ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేసి నియోజకవర్గ ప్రజల అభిమానం చూరగొన్నారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం గోపాలపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా నల్లజర్లలో ప్రమాణ స్వీకారం చేసిన యద్దనపూడి బ్రహ్మరాజు, కమిటీ సభ్యులను అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సత్కరించి, శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు (గోపాలపురం), వీరాంజనేయులు, బంగారు రాజు, వలవల బాబ్జి, రుడా చైర్మన్ బొట్టు వెంకటరమణ చౌదరి, జిల్లా బిజెపి అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర పాల్గొన్నారు.

# ఘనంగా మొహరం సంబరాలు

**● డిఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వివేక్**





**డోర్నకల్ జూలై 6:** డోర్నకల్ మండల పరిధిలో వెన్నారం గ్రామంలో మొహరం పర్వదినాన్ని గ్రామస్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే పీరీల ఉత్సవాలకుడిఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వివేక్ హాజరయ్యారు.పీరీల సావడి నూతనంగా నిర్మించడంతో గ్రామస్తుల కోరిక మేరకు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పీరీల ముజావర్, గ్రామస్తులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు జరిపారు.ఈ సందర్భంగా సావిడి చివరి దశ సిమెంట్ పనులకు తన వంతు సహాయం అందించనున్నట్లు డాక్టర్ వివేక్ హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా డాక్టర్ వివేక్ మాట్లాడుతూ. స్థానిక ప్రజానీకానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని తెలిపారు.ప్రజలందరికీ మొహరం పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారుతొలుత గ్రామ శివారులో స్థానికులు డప్పు సప్పులు పేరీలతో డాక్టర్ వివేక్ ఘన స్వాగతం పలికారు.ఈ క్రమంలో స్థానికుడు కొప్పుల సత్యనారాయణ(జర్నలిస్టు) కుటుంబ సభ్యులు పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలతో పాటు తదితరులు పాల్గొన్నారు

# కొమ్ములవంచ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ శంకుస్థాపన

**● మరిపెడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజశేఖర్**



**నరసింహులపేట జూలై 6:** నరసింహులపేట మండలం లోని కొమ్ములవంచ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు భూమి పూజ శంకుస్థాపన కార్యక్రమాలు మరియు మంజూరు పత్రాలు అందించిన మరిపెడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దాసరోజు రాజశేఖర్ తెలిపారు అనంతరం ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కంటే 10 రెట్లు అభివృద్ధిని 15 నెలలలోనే అందించిన ఘనత మన కాంగ్రెస్ ప్రభుత్వానికి చెందుతుంది. పేదల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాల వల్ల ప్రజలు ఎంతో సంతృప్తిగా ఉన్నారు.బీసీలకు 42% రిజర్వేషన్లు, ఎస్సీల వర్గీకరణ వంటి కీలక నిర్ణయాలు ప్రభుత్వం తీసుకున్నట్లు తెలిపారు.ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉంది 2029 వరకు కేంద్రంగా ఉన్న అబ్జర్వర్లు ప్రతి కార్యకలాపంలో భాగస్వామ్యులవుతారని స్పష్టం చేశారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధోనికని రామ్మూర్తి, మైదం వీరయ్య, ఉంగరాల మధు, డొనికెని ఉపేందర్, దేనికని రామారావు, కృష్ణ,రాంపల్లి శ్రావణ్ , చీర శ్యామ్, వీరయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.

# చెరువు కట్ట మరమ్మత్తు పనుల ప్రారంభం

**● నర్సంపేట పిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి**



**నెక్కొండ జూలై 6:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంకానిపేట గ్రామంలో చెరువు కట్ట మరమ్మత్తు పనులను ప్రారంభించిన నర్సంపేట పిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భక్కి అశోక్,నర్సంపేట కోర్టు ఏజీపీ అడ్వకేట్ బండి శివకుమార్,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కుసుమ చేన్నకేశవులు, ఈదునూరి సాయి కృష్ణ,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సింగం ప్రశాంత్, నెక్కొండ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రావుల మహిపాల్ రెడ్డి, బొమ్మెర బోయిన రమేష్, అలంకానిపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాంపల్లి శ్రవణ్, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు సముద్రాల కనకయ్య,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఎడంపాక ప్రకాశం,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎడ్ల కిష్టయ్య, కోలా నరేష్,ఇదంపాక అన్వేష్,సముద్రాల మల్లయ్య,పూచేరి యాకయ్య,కొమ్ము దయాకర్, మాజీ ఎంపీటీసీ రామ్మూర్తి, గాజుల కృష్ణ, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


# చిన్నారిని ఆశీర్వదించిన నర్సంపేట పీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి



**నెక్కొండ జూలై 6:** వరంగల్ జిల్లా నెక్కొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్, సోదరుడు పెండ్యాల శ్రీనివాస్ అర్చన దంపతుల కుమార్తె సారీ ఫంక్షన్ కి హాజరై చిన్నారిని ఆశీర్వదించిన నర్సంపేట రెడ్డి రంజిత్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్, నర్సంపేట కోర్టు ఏజీపీ అడ్వకేట్ బండి శివకుమార్, రామాలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, ఓబిసిఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కుసుమ చెన్నకేశవులు, ఈదునూరి సాయికృష్ణ, కెవి సుబ్బారెడ్డి,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సింగం ప్రశాంత్, ఎస్ టి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు లావుడియా తిరుమల్ చౌహన్ వరంగల్ జిల్లా ఎన్ ఎస్ యు ఐ ప్రెసిడెంట్ బోడ శ్రీకాంత్ నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొమ్మరబోయిన రమేష్, మాంకల రత్నం, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బోడా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ పార్టీ మండల సంఘటన పర్వ్ సంస్థగత నిర్మాణ సమావేశం

**● మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు భాస్కరచారి ఆధ్వర్యంలో...**




**పెద్దవంగర జూలై 6 :** మండల కేంద్రంలో మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు కట్టోజు భాస్కరాచారి ఆధ్వర్యంలో నిర్వహించన మండల సంఘటన పర్వ్-సంస్థగత నిర్మాణం 2025 సమావేశనికి ముఖ్య అతిథులుగా జనగామ జిల్లా అధ్యక్షులు సౌడ రమేష్ విచ్చేసి మండల సంస్థ గహక్త నిర్వహణ కార్యక్రమం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లేగ రామ్మోహన్ రెడ్డి బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ పి. శ్రీమాన్, మాజీ ఎంపిటిసి సభ్యురాలు సాయిని ఝాన్సీ, ఎం డి రహీం , తొర్రూరు అర్బన్, రాయపర్తి కొడకండ్ల మండలాల అధ్యక్షులు పైండ్ల రాజేష్ నూనె అనీల్ పులిగిల్ల ఉపేందర్ , జిల్లా నాయకులు నవీన్,తలారి సోమన్న,బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి గణేష్,ఎస్టీ మోర్చ నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శులు ముద్రరబోయిన రాము, కొయ్యడీ ముఖేశ్ గౌడ్,మండల ఉపాధ్యక్షులు జలగం ఆనంద్ ,పరికర యాకయ్య, జాటోత్ వెంకన్న,బీజే వై ఎం మండల అధ్యక్షుడు మెరుగు సందీప్ కుమార్,బాత్ అధ్యక్షులు కిరణ్ కుమార్ , గణేష్,వీరస్వామి, రంజిత్,హరీష్,అన్వేష్, వెంకటనారాయణ. దాసు,కార్యకర్తలు వంశీ,సాయిరాం, వివేక్, సంతోష్ ,ప్రశాంత్ ,శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు

# లక్ష రూపాయల విలువ గల 4 ఫోన్లు బాధితులకు అప్పగించిన ఎస్ఐ సురేష్



**నర్సింహులపేట జులై 6:** కొన్ని రోజుల నుండి వివిధ రూపాల్లో పోగొట్టుకున్న సుమారు 1,00,000/- రూపాయల విలువ గల 4 ఫోన్ల ను గుర్తించి రికవరీ చేసి సంబంధిత మొబైల్ ఫోన్ల యజమానులకు భాదితులకు అందజేసినట్లు స్థానిక. ఎస్సై సురేష్ తెలిపారు. అనంతరం ఆదివారం సమావేశంలో ఆయన మాట్లాడుతూప్రస్తుత రోజుల్లో మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరికీ నిత్యవసరమైనది, దీనిని కమ్యూనికేషన్ కోసం, ఆన్లైన్ విద్య కోసం వినియోగిస్తున్నాం, మన యొక్క విలువైన సమాచారం బ్యాంక్ అకౌంట్స్, పాస్ వర్డ్స్, సోషల్ మీడియా అకౌంట్స్, వ్యక్తిగత ఫోటోలు మొదలైన వంటివి ఫోన్ లో నిక్షిప్తం చేసుకుంటున్నాము అన్నారు, మొబైల్ చోరికి గురైనా, పోగొట్టుకున్నా అందులో ఉన్న సమాచారం పోతుంది. నేరగాళ్లు మొబైల్ దొంగిలించి, వీక్ పాస్ వర్డ్స లను బ్రేక్ చేసి ఫోన్ పే, గూగుల్ పే తదితర మద్యమాల ద్వారా డబ్బులు కాజేస్తున్నారన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు కేవలం మొబైల్ ఫోన్ మాత్రమే కాకుండా తమ వ్యక్తిగత సమాచారంతో సహ డబ్బులను కూడా కోల్పోవడం జరుగుతుందన్నారు. సెల్ ఫోన్ దొంగతనాల నుండి విముక్తి కల్పించడానికై DOT (డిపార్ట్మెంట్ ఆఫ్ టెలీ-కమ్యూనికేషన్) CEIR పోర్టల్ ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, ఈపోర్టల్ ద్వారా మంచి ఫలితాలు రాబట్టడం జరుగుతుందని SI సురేష్ వివరించారు. ఎవరైన మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన వెంటనే CEIR పోర్టల్ (https://www.ceir.gov.in) నందు నమోదు చేసుకోవాలి, మొబైల్ ను బ్లాక్ చేసి, మీ సేవా ద్వారా ధరఖాస్తు సంభందిత పోలీసు స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజలు, వినియోగదారులు ఎవరైనా సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్ లను కొనుగోలు చేసినట్లైతే అట్టి షాప్ యజమాని నుండి రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. సెల్ ఫోన్ దొంగలు దొంగిలించిన ఫోన్ లను మొబైల్ షాప్ లలో అమ్ముతున్నారని, తక్కువ ధరకు వస్తుందని దొంగిలి ంచబడిన ఫోన్ అని తెలియక కొనుగోలు చేసి అమాయక ప్రజలు మోసాలకు గురి అవుతున్నారని అన్నారు. ఎవరైన దొంగిలించబడిన ఫోన్ అని తెలిసి కూడా కొనుగోలు చేసినట్లైతే అట్టి వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ మొబైల్స్ రికవరీ చేయడం కోసం పోలీసు శాఖ కృత నిచ్చయంతో పని చేసినారు, ఒక్కో ఫోన్ రికవరీ కోసం చాలా కృషి చేశారు, ప్రజల కోసం పోలీసు ఎప్పుడు అందుబాటులో ఉంటా0 సమస్యలు వస్తె పోలీసు సేవలు వినియోగించు కోవాలి, పోలీసులు మనకోసంఅని భావన ప్రతి ఒక్కరిలో ఉండాలి అన్నారు.పోయిన మొబైల్ ఫోన్లు మళ్లీ దొరకదనుకున్న బాధితులు పోలీస్ టెక్నాలజీ ఉపయోగించి ఫోన్ రికవరీ చేసి అందించినందుకు సంభందిత బాధితులు ఎస్సై సురేష్ పోలీస్ సిబ్బందికి మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# పాత విద్యార్థులు కలుసుకున్నారు... పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు

**● 2006-09 డిగ్రీ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం**

**షాద్ నగర్, జులై 06:** షాద్ నగర్ పట్టణంలోని సర్దార్ వల్లభ భాయ్ పటేల్ డిగ్రీ కళాశాలలో 2006-09 బి.ఎస్.సి.(ఎం.పి.సి) విద్యార్థులు అపూర్వ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. కళాశాల ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు. 15 సంవత్సరాల తర్వాత ఇలాంటి కార్యక్రమా న్ని నిర్వహించి అనుభవాలను పంచుకోవడం, ఆత్మీయంగా కలవడం బాగుందని ఉపాధ్యాయులు అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేస్తూ అందరూ కలిసి మెలిసి ముందుకు సాగాలని కోరారు.




# ఘనంగా తొలి ఏకాదశి పూజలు

**- అమ్మవారికి బోనాలు సమర్పణ**



**తెలుగు వెలుగు ప్రతినిధి, అశ్వారావుపేట:** ఆదివారం మండల కేంద్రం అశ్వారావుపేటలో తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున వాసవి కన్యకా పరమే శ్వరి దేవాలయంలోఆలయానికి బోనాలు తీసుకువచ్చి అమ్మవా రికి బోనాలు సమర్పించారు. మేళతాళాలతో డప్పువాయిద్యాలతో మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలతో ఊరేగింపు జరపడం జరిగింది. బోనాలు అమ్మవారికి సమర్పించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లకు కుంకుమపూజలు చేసి, అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

# మొహరం పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఎర్రబెల్లి సతీష్ రావు...




**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** మొహరం పండుగ సందర్భంగా దీనబందు కాలనీలో పీర్ల పండుగ ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కాలనీలో ఏర్పాటు చేసుకున్న పీరు లను శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో రజియా బేగం, చందు పాషా, లలాన్, చాంద్, ఇబ్రహీం, హైదర్, పాషా, హైదర్ తదితరులు పాల్గొన్నారు

# శ్యామ ప్రసాద్ ముఖర్జీ జీవిత చరిత్ర భారతదేశ పౌరులకు ఆదర్శం

**చిట్యాల, జులై 6:** శ్యామ ప్రసాద్ ముఖర్జీ జీవిత చరిత్ర భారత దేశ ప్రజలకు ఆదర్శమని చిట్యాల మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ చిట్యాల మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో శ్యామ ప్రసాద్ ముఖర్జీ 124వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల చేసిన అనంతరం వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ ఆయన జీవితం దేశం కోసం పరితపించేదని దేశాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలి ముందుకు నడవాలి అనే ఆలోచన నుండి పుట్టినటువంటి జనసంఘ్ స్థాపించి భారతీయ జనతా పార్టీ గా అవతరించి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నటువంటి నరేంద్ర మోడీ ఆయన ఆలోచనలకు తగ్గట్టుగా ఆనాడు 370 ఆర్టికల్ ను రద్దు చేయాలని ఉద్యమాలు చేసి ప్రాణ త్యాగం చేసినటువంటి గొప్ప మహానీయుడని దేశంలో ఒకే ప్రధాని ఉండాలని దేశభక్తుడని ఒక రాజకీయ రాజనీతిజ్ఞుడుగా ఒక విద్యావేత్తగా అనేక సంఘసంస్కరణలో పాల్గొని దేశం ఒక ముఖ చిత్రాన్ని మార్చేయాలని కలలుగన్న మహనీయుడని ఆయనను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని వెంకటేష్ గౌడ్ అన్నారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మైదం శ్రీకాంత్ బిజెపి సీనియర్ నాయకులు గుండ సురేష్ సాదా సదానందం రమేష్ రాయని శ్రీనివాస్ అనుపమహేష్ గుర్రపు రవి వెంకటేశ్వర్లు కలచర్ల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి సంక్షేమం టిడిపికి రెండు కళ్ళు: గాజుల ఖాదర్బాషా




**రాయచోటి జులై 06:-** రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచన మేరకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందని గాజుల ఖాదర్బాషా పేర్కొన్నారు. ఆదివారం నాడు రామాపురం కొత్తపేట వార్డుల్లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆయన కూటమి ప్రభుత్వం అమలు చేసిన పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించారు ఐదేళ్ల వైసిపి పాలనలో ప్రజల్లో ఉన్న భయం అశాంతి పోయి ఒక భరోసా ప్రశాంతత వచ్చింది అన్నారు రామాపురం నందు గత ప్రభుత్వంలో సక్రమమైన రోడ్లు లేక ఇబ్బందులు పడుతుంటే వెంటనే మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి. తీసుకురాగా ఆయన రోడ్డు వేయించడం జరిగిందని తెలిపారు గత ప్రభుత్వంలో అమలు చేసిన అమ్మ ఒడి అరకొర ఇచ్చి మోసం చేస్తే చంద్రబాబు నాయుడు ఇంట్లో ఎంతమంది ఉన్న అందరికీ తల్లికి వందనం కింద 15000 రూపాయలు ఇవ్వడం జరిగిందని చెప్పారు గత ప్రభుత్వంలో పెన్షన్ కేవలం 250 రూపాయలు పెంచితే చంద్రబాబు నాయుడు ఏకంగా వెయ్యి రూపాయలు పెంచి ఇవ్వడం జరిగింది అని చెప్పారు కూటమి ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ప్రజలకు స్వేచ్ఛ ప్రశాంతత కలిగి మంచి ప్రభుత్వం వచ్చిందని ప్రజల నోట వినిపిస్తున్న మాట ఇదే అన్నారు ధాన్యం రైతులకు గత ప్రభుత్వం పెట్టిన 1600 కోట్ల బకాయిలను తెలుగుదేశం ప్రభుత్వం తీర్చిందన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకుల బలరాం మల్లికార్జున తబ్రేస్ రోఫా రామాపురం నందుగుల తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# రాష్ట్ర ప్రజలందరూ చల్లగా ఉండాలి




**రాయచోటి జులై 06:-** తొలి ఏకాదశి సందర్భంగా వైసీపీ సీనియర్ నాయకులు తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం జరిగినది రాష్ట్రంలో రాష్ట్రంలో పాడి పంటలు పుష్కలంగా పండి అందరూ ఆయురారోగ్యాలతో ఐశ్వర్యాలతో యువత మంచి చదువులు చదివి మంచి ఉద్యోగాల్లో ఉన్నత స్థాయికి చేరాలని వ్యాపారులకు వ్యాపారం సంసిద్ధంగా జరిగి మంచి లాభాలను చేకూరాలని కోరుకోవడం జరిగింది వైయస్సార్సీపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సిబ్యాల విజయభాస్కర్. రామాపురం మండల జడ్పిటిసి రమణ. వైసిపి రాష్ట్ర కార్యదర్శి సురం వెంకట సుబ్బారెడ్డి. జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సుగవాసి శ్యామ్ కుమార్. జిల్లా టూరిజం కౌన్సిలర్ నెంబర్ కొత్తిమీర ప్రసాద్. మాజీ ఎంపీటీసీ శివకుమార్. స్కూల్ పేరెంట్స్ కమిటీ మాజీ చైర్మన్ సురేష్ కుమార్ రెడ్డి పలువురు శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం జరిగినది...

# ఘనంగా పాండురంగ స్వామికి తొలి ఏకాదశి పూజలు



**బొమ్మనహాల్ జులై 06:-**ఆషాఢమాసం తొలి ఏకాదశి వేడుకలను,శుభ సందర్భంగా బొమ్మనహాల్ మండలంలోని, ఉంతకల్లు గ్రామంలో,అత్యంత ప్రసిద్ధిగాంచిన,శ్రీ.శ్రీ, పాండురంగస్వామి,ఆలయాల్లో స్వామికి,పెద్ద ఎత్తున ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు,ఆలయ అర్చకులు,వేకువజామునే స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవలు,పలు అభిషేకాలు,విశేష అలంకరణలు చేశారు,అనంతరం ప్రత్యేకపూజల్ని చేపట్టి మహామంగళహారతి ఇచ్చారు,భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి,స్వామి వారిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు,అర్చనలు చేయించి,భక్తదులందరికీ తీర్థ ప్రసాదాలు స్వీకరించారు,

# అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుల దాడులు

- జూదమాడుతున్న 159 మందిని అరెస్టు
- రూ. 2,85,645 నగదు స్వాధీనం, 22 కేసులు నమోదు



**కడప జులై 06:-** అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్.పి శ్రీ ఇ.జి అశోక్ కుమార్ ఐ.పి.ఎస్ గారు హెచ్చరించారు. జిల్లాలో గత 15 రోజుల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై జిల్లా పోలీస్ శాఖ జరిపిన దాడుల వివరాలను జిల్లా ఎస్.పి వివరించారు. **మట్కా గ్యాంబ్లింగ్ పై ముమ్మర దాడులు:** జిల్లాలో గత 15 రోజుల్లో జూదమాడుతున్న మొత్తం 159 మందిని అరెస్టు చేసి రూ. 2,85,645 నగదు స్వాధీనం చేసుకుని 22 కేసులు నమోదు చేయడం జరిగిందని ఎస్.పి తెలిపారు. 9 మట్కా కేసులు నమోదు చేసి మొత్తం 16 మంది అరెస్టు చేసి రూ. 50,570 నగదు స్వాధీనం చేసుకున్నారు. **1.4 కిలోల గంజాయి స్వాధీనం, రెండు కేసుల్లో 4 మంది అరెస్టు:**గంజాయి విక్రయిస్తున్న 4 మందిని అరెస్టు చేసి 1.4 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని రెండు కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్.పి తెలిపారు.**బహిరంగ మద్యపానం పై దాడులు:**బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై పోలీస్ సిబ్బంది గస్తీ తిరుగుతూ ముమ్మర దాడులు నిర్వహించి 986 మందిపై కేసులు నమోదు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 57 మందిపై కేసులు నమోదు చేశారు. కోడి **పందేలపై దాడులు:** కోడి పందెం కేసు నమోదు చేసి 6 మందిని అరెస్టు చేసి రూ. 5,050 నగదు స్వాధీనం చేసుకోవడం జరిగింది.అక్రమ మద్యంపై దాడులు అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి మొత్తం 3 కేసులు నమోదు చేసి 13.24 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు.అసాంఘిక కార్యక్రమాల నిర్మూలనకు పోలీస్ శాఖకు ప్రజలు సహకరించాలని, మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, ఇతర నేరాలకు సంబంధించిన సమాచారాన్ని డయల్ 112 కు తెలియచేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని జిల్లా ఎస్.పి ఇ.జి అశోక్ కుమార్ తెలిపారు.

# నేడు తహసిల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ(ఎంఎల్)లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా



**రాయచోటి జులై 06:-** అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇంటి పట్టాలు ఇవ్వడంతో పాటు ఇండ్లు నిర్మించి ఇవ్వాలనే డిమాండ్ తో నేడు రాయచోటి తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు సిపిఐ(ఎంఎల్ )లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఉదయ్ కిరణ్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ్ లు తెలిపారు.ఆదివారం దూదేకుల పల్లి, సరస్వతి నగర్, తది తర వీధులలో వారు పర్యటించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇల్లులేని నిరుపేదలు వందల సంఖ్యలో ఈ ప్రాంతంలో ఉన్నారన్నారు.ప్రతిసారి ఏ ప్రభుత్వం వచ్చినా వేలమంది నిరుపేదలకు ఇండ్లు ఇచ్చామని గొప్పలు చెప్పుతున్నారే తప్ప ఆచరణలో మాత్రం శూన్యం అన్నారు.కూలి పనులు చేసుకుంటూ ప్రతి నెల వేల కు వేల రూపాయల చొప్పున ఇండ్లు అద్దెకు తీసుకొని అద్దె కట్టలేక నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు.కూటమి ప్రభుత్వం వచ్చి 13 నెలలు పూర్తి అవుతున్న ఇంతవరకు రాష్ట్రంలో ఎక్కడ కూడా పేదలకు స్థలాలు ఇవ్వలేదన్నారు. నాడు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పేదలకు మూడు సెంట్లు చొప్పున స్థలం ఇచ్చి ఇండ్లు కట్టించాలన్నారు.అలాగే పట్టణ,నగర ప్రాంతాలలో రెండు సెంట్లు చొప్పున స్థలం ఇచ్చి,ఇండ్లు కట్టించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.అలాగే ఉపాధి హామీ పథకం అమలులో అవకతవకలు లేకుండా జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు.అధిక వడ్డీలతో పేదల నడ్డి విరుస్తున్న ప్రైవేట్ మైక్రో ఫైనాన్స్ కంపెనీల లైసెన్స్ లను ప్రజల రుణాలను రద్దు చేయాలని కోరారు.నిరుద్యోగ యువతకు అర్హత కు తగిన ఉపాధి అవకాశాలు కల్పించాలని,ఉపాధి కల్పించే వరకు ప్రతి నెల నిరుద్యోగ భృతి అందించాలనీ,అలాగే విద్య హక్కు చట్టం ప్రకారం దారిద్ర్య దిగువన ఉన్న విద్యార్థులకు ప్రైవేట్ స్కూలు కాలేజీలలో 25 శాతం సీట్లు కేటాయించాలని,కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు పేరుతో అధికారంలోకి వచ్చిన తర్వాత అరకొర తప్ప సూపర్ సిక్స్ హామీలను పక్కదారి మళ్లించి కక్ష సాధింప చర్యలకు పాల్పడుతోందన్నారు. కావున ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కనులు తెరిచి నాడు ఇచ్చిన మాట ప్రకారం ఇండ్లు లేని పేదలను ఆదుకోవాలని వారి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ,సిపిఐ(ఎంఎల్)లిబరేషన్ పార్టీ అన్నమయ్య జిల్లా కమిటీ సభ్యులు రమణ,ఏఐఎస్ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల లవకుమార్ పార్టీ నాయకులు సతీష్,శ్రీనివాస్ నాయుడు,సుబ్బమ్మ,తదితరులు పాల్గొన్నారు.

# పాత పాఠశాల ప్రాంగణంలో స్నేహసంధి వాల్మీకిపురం 1980 బ్యాచ్ షష్టిపూర్తి వేడుక




**రాయచోటి జులై 06:-** ఆదివారం ఉదయం వాల్మీకిపురం పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో 1980 బ్యాచ్ పూర్వ విద్యార్థుల మధుర సమ్మేళనం ఘనంగా జరిగింది. నలభై అయిదేళ్ళ క్రితం ఈ పాఠశాలలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు దేశం నలుమూలల నుంచి వచ్చి, బాల్య స్నేహితులతో మళ్లీ కలుసుకుని, ఆ పాత రోజులను మళ్లీ గుర్తుతెచ్చుకున్నారు.పాత క్లాస్‌రూములు, ఆడిన ఆటలు, గురువుల సాన్నిధ్యం, పాఠశాల పరిసరాలు – ఇవన్నీ మళ్లీ ఒకసారి వారి మధుర జ్ఞాపకాల్లోకి నెట్టాయి. నలభై అయిదేళ్ల తర్వాత అందరూ ఒకే చోట కలవడం, అనుభూతులను పంచుకోవడం, ఆనందాన్ని పంచుకోవడం అందరికీ ప్రత్యేక అనుభూతిని కలిగించింది.ఈ బ్యాచ్‌కు చెందిన వారు జీవితంలో ప్రగతి సాధించి, వివిధ రంగాల్లో తమ ప్రతిభను చాటుకున్నారు. కొందరు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉన్నత ఉద్యోగాల్లో కొనసాగుతుండగా, మరికొందరు వైద్యులు, ఉపాధ్యాయులు, వ్యాపారవేత్తలు, సేవా రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్నారు. తమ పిల్లలను కూడా ఉన్నత విద్యలో స్థిరపరిచి, సమాజానికి ఆదర్శంగా తీర్చిదిద్దారు.ఈ సంవత్సరం 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా "షష్టిపూర్తి" వేడుకగా ప్రత్యేక కేక్ కట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీవిత ప్రయాణం, విజయాలు, ఎదురైన సవాళ్లు, నేర్చుకున్న పాఠాలు పరస్పరంగా పంచుకున్నారు. యువతకు ఆదర్శంగా నిలవాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు.అంతటితో ఆగకుండా, అందరూ కలిసి గ్రూప్ ఫోటో దిగారు. ఇది పాఠశాల చరిత్రలో మరో చిరస్థాయిగా నిలిచిపోయే సంఘటనగా మారింది.ఈ కార్యక్రమంలో మాకం సుదర్శన్ (అప్పల్లు), కర్రె రఘురాం, రామిశెట్టి మనోహర్, డాక్టర్ జానం గంగిరెడ్డి, సుబ్రహ్మణ్యం (గొల్ల), చింతల విజయ్ రెడ్డి, మెంటా ప్రకాష్, మాజీ ఎంపీపీ ర, కురబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, ఉపసర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, ఇస్రో హరినాధ శర్మ, చెక్కపని సత్యనారాయణ, పద్మలత, శైలజ, శోభారాణి, విజయ, వేణి, శ్రీలక్ష్మి, సుజాత, విద్యావతి తదితర ప్రముఖులు పాల్గొని వేడుకను మరింత వైభవంగా తీర్చిదిద్దారు.ఇలాంటి మధుర సంఘటనలు పాఠశాల జీవితం పట్ల గల మమకారాన్ని, స్నేహ బంధాలను, జీవిత ప్రయాణానికి ఇచ్చిన ప్రేరణను మరోసారి గుర్తు చేశాయి. ప్రతి ఒక్కరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయే మధుర జ్ఞాపకంగా మిగిలింది.

# లయన్స్ క్లబ్ ఆఫ్ టౌన్ రాయచోటి నూతన కార్యవర్గం







**రాయచోటి జులై 06:-** ఆదివారం స్థానిక పిసిఆర్ గ్రాండ్ ఫంక్షన్ హాల్ నందు లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం వైభవంగా జరిగింది ఈ కార్యక్రమానికి రాష్ట్రరవాణ,యువజన,క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పేద ప్రజల కోసం లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ వారు అందిస్తున్న సేవలు అమూల్యమని తెలిపారు.లయన్స్ క్లబ్ వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున సహాయసహకారాలు అందిస్తామని తెలిపారు.అనంతరం పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్స్ లయన్ యం.గౌతమ్,లయన్ కె.చిన్నప్పరెడ్డి, లయన్ యం.సుధాకర్ రెడ్డి,లయన్ జె.చంద్రప్రకాష్ రావ్ మరియు డా.కె.బయారెడ్డి,డా.పి.నారాయణ రెడ్డి,మానవతా జిల్లాధ్యక్షుడు ఏ.శివగంగిరెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ నాలుగు జిల్లాల్లో మొదటి స్థానంలో సేవ కార్యక్రమాలు చేస్తూ ఈ సంవత్సరం అధ్యక్షుడు లయన్ పి.శివారెడ్డి ఆధ్వర్యంలో 460 కార్యక్రమాలు చేయడం చాలా గొప్ప విషయమని అలాగే రాబోయే రోజులలో కూడా నూతన అధ్యక్షుడు లయన్ శ్యామ్ కూడా ఇంకా మంచి కార్యక్రమాలు చేసి రాయచోటి ప్రజల మన్ననలు పొందాలని తెలియజేశారు.అనంతరం 2024- 2025 అధ్యక్షుడు లయన్ పి.శివారెడ్డి మాట్లాడుతూ నాకు ఇంత గొప్ప అవకాశం కల్పించిన క్లబ్బు సభ్యులందరికీ ధన్యవాదాలు ఈ సంవత్సరం దాదాపు 460 క్యాంపులతో దాదాపు 3410900 రూ.ఖర్చుతో సేవ చేసినందుకు చాలా సంతోషంగా ఉందని అలాగే రాబోయే రోజుల్లో కూడా నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేశారు అనంతరం నూతన అధ్యక్షులు లయన్ శ్యామ్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ వారు నాకు ఇంత గొప్ప అవకాశం కల్పించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు.ఈ సంవత్సరం రాయచోటి ప్రజలకు నా వంతు శక్తివంచన లేకుండా పేద ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తానని అలాగే దాతలు క్లబ్ సభ్యులు సహాయ శసహకారాలు అందించాలని కోరారు.అనంతరం పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ యం. సుధాకర్ రెడ్డి అధ్యక్షులుగా లయన్ పి.శ్యామ్, కార్యదర్శిగా లయన్ షేక్ ఇందాద్ అహమ్మద్, కోశాధికారిగా లయం. కె.మనోహర్ రాజు ,మరియు కొత్త సభ్యులచేత ప్రమాణ స్వీకారం చేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ క్విస్ట్ చైర్మన్ లయన్ పి.ఎస్.హరినాథ్ రెడ్డి, రీజినల్ ఛైర్మన్ లయన్ షేక్ మహమ్మద్ ,జోన్ చైర్మన్ లయన్ వెంకట సుబ్బయ్య, లయన్స్ కుటుంబ సభ్యులు అందరూ పాల్గొన్నారు.

# అహోబిలేసునికి నవ కలశ పంచామృతాభిషేకం

- రత్నాంగి కవచంలో ప్రత్యేక దర్శనం ఇచ్చిన అహోబిలేసుడు



**ఆళ్లగడ్డ జులై 06:** ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో జైష్ఠాభిషేక తిరుమంజనం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు ఉత్సవమూర్తులైన శ్రీ భూ నీలా సమేత శ్రీ ప్రహ్లాద వరద స్వామికి నవ కలశ పంచామృతాభిషేకం (తిరుమంజనం)చూడముచ్చటగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానార్చకులు వేణుగోపాలాచార్యులు మాట్లాడుతూ వైష్ణవ పుణ్యక్షేత్రమైన అహోబిల క్షేత్రాల్లో జేష్ఠ మాసంలో భాగంగా రెండవ రోజు జేష్ఠభిషేకం లో శ్రీ భూమి నీలా సమేత శ్రీ ప్రహ్లాద వరద స్వామికి నవ కలశ పంచామృతాభిషేకం నిర్వహించామన్నారు.సాయంత్రం స్వామి వారు తొలి ఏకాదశి సందర్భంగా భక్తులకు రత్నాంగికవచంలో దర్శనమిచ్చారు. అనంతరం ఆలయ మాడ వీధులగుండా గ్రామోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## తెదేపా కార్యకర్తకు మేడా విజయ శేఖర్ రెడ్డి 20 వేలు ఆర్థిక సాయం

### - అన్ని విధాలు ఆదుకుంటామని భరోసా

**నందలూరు జూలై 06:-** మండలం ఆడుపూరు హరిజనవాడలో నివాసం ఉంటున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్త కుప్పాల వెంకటసుబ్బయ్య అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయ శేఖర్ రెడ్డి బాధితుల ఇంటికి చేరుకొని పరామర్శించారు. ఆదివారం వెంకటసుబ్బయ్య స్వగృహానికి చేరుకొన్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయ శేఖర్ రెడ్డి తక్షణ సహాయం కింద ?20 వేల రూపాయలను ఫోన్ పే ద్వారా అందజేశారు. బాధితుని కుటుంబంతో మాట్లాడుతూ అన్ని విధాల ఆదుకుంటామని ఆసుపత్రి అవసరాల నిమిత్తం కూడా ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. భగవంతుని దయవల్ల వెంకటసుబ్బయ్య వెంటనే కోలుకోవాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.నాగిరెడ్డిపల్లి లేబా క ఆడపూరు సర్పంచులు జంబు సూర్యనారాయణ లంకాయ గారి నరసయ్య భాస్కర్ రెడ్డి తెలుగుదేశం నాయకులు రమేష్ బాబు.బెస్త సుబ్రహ్మణ్యం గ్రామస్తులు పాల్గొన్నారు.

## చనిపోయిన గొర్రెలు, పొట్టేళ్ళు పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు



**వేంపల్లి జూలై 06:-** ఆదివారం ఉదయం పులివెందుల నియోజక వర్గం,వేంపల్లి మండలం లో కత్తులూరు, తాళ్ళపల్లి గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదం లో ట్రాక్టర్ కింద పడి 19జీవాలుచనిపోయాయి,12జీవాలు తీవ్రంగా గాయపడ్డాయి.ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి,పులివెందుల నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త ధృవకుమార్ రెడ్డి,ఉత్తన్న, నాగరాజు హుటా హుటిన సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. జీవాలు తాటిమాకుల పల్లె గ్రామానికి చెందిన గోనమాకుల పల్లె గంగులయ్య కు చెందినవి. గంగులయ్య పేదవాడు,దళితుడు.ట్రాక్టర్ పులివెందుల కు చెందిన ఆనంద్ ది.గంగులయ్యకు తగిన నష్ట పరిహారం అందేటట్లు చర్యలు తీసుకోవాలనితులసి రెడ్డి ఎస్సై తిరుపేల నాయక్‌కు సూచించారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

**తిరుపతి జూలై 06:-** ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఐఏఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో జూలై 7వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ ఎన్.మౌర్య తెలియజేశారు



## జంతు ప్రేమికులు తప్పనిసరిగా యాంటీ రేబీస్ టీకాలు వేయించాలి

### ● జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**కడప జులై 06:-** జంతు ప్రేమికులు తమ పెంపుడు శునకాలకు తప్పనిసరిగా యాంటీ రేబీస్ టీకాలు వేయించి జంతు సంక్రమిత వ్యాధులను నివారించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఉచిత రాబిస్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని స్థానిక పశుసంవర్ధక శాఖ పాలీ క్లినిక్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ముఖ్యఅతిథిగా హాజరై యాంటీ రేబిస్ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు జూనొసిస్ (జంతు సంక్రమిత) వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. లూయిపాశ్చర్ శాస్త్రవేత్త మొదటిసారిగా 1885 జులై 6న కుక్క కాటుకు గురైన బాలుడికి రాబిస్ వ్యాధి రాకుండా టీకాను విజయవంతంగా కనుగొనడం జరిగిందన్నారు.దీంతో నాటి నుంచి రోజును జునొసిస్ డేగా జరుపుకొంటూ పెంపుడు శునకాలకు యాంటి రేబిస్ టీకాలు వేస్తున్నారన్నారు. అందులో భాగంగా జిల్లాలో ఉచిత రేబిస్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. జిల్లాలో దాదాపు 17వేల డోసులు అందుబాటులో ఉన్నాయని పెంపుడు జంతువుల ప్రేమికులందరూ వ్యాక్సినేషన్ వేయించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల వారీగా మండలాల్లో గ్రామాల్లో పశు వైద్యశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచిత రేబిస్ టీకాలను వేస్తున్నట్లు తెలిపారు. పెంపుడు జంతువులు నేటి ప్రస్తుత కాలంలో కుటుంబాల్లో భాగాలుగా ఉన్నాయని వాటి సంరక్షణ తోపాటు వాటి నుంచి మనం కూడా సురక్షితంగా ఉండాల్సిన బాధ్యత ఉందన్నారు. జంతు ప్రేమికులందరూ జంతు సంక్రమిత దినోత్సవాన్ని గుర్తుంచుకొని యాంటి రేబిస్ వ్యాక్సినేషన్ చేయించుకోవాలని కోరారు. జంతువుల మధ్య ఉండే పశు వైద్య డాక్టర్లు జాగ్రత్తలు పాటిస్తూ సురక్షితంగా వ్యాక్సినేషన్ నిర్వహించాలని అన్నారు. జులై 7 నుంచి జూలై 14 వరకు నిర్వహించే పశుగ్రాస వారోత్సవాల గోడపత్రుల ను పశు సంవర్ధక శాఖ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.పశుసంవర్ధక శాఖ జెడి శారదమ్మ, డిడి రంగస్వామి, ఇన్చార్జి డిడి శ్రీనివాసరెడ్డి,ఏడి డాక్టర్ సుబ్బరాయుడు, ఏడి డా. నేతాజీ, ఏడి డా.మాధవి, డా. సంధ్యారాణి, డా.చాంద్ బాషా, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, పాల్గొన్నారు.

## పిడియస్‌యు ఆధ్వర్యంలో గోడ పత్రికలు ఆవిష్కరణ



**కడప జూలై 06:-** రాష్ట్ర వ్యాప్తంగా కేజీ నుండి పీజీ వరకు విద్యారంగ సమస్యల పరిష్కరించాలని జూలై 10వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ నందు జరుగు మహాధర్నాను జయప్రదం చేయాలని పిడియస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న పిలుపునిచ్చారు. ఆదివారం కడప నగరంలో సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో గోడ పత్రికలు ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తయింది విద్యారంగ సమస్యలు అపరిస్కృతంగానే మిగిలి ఉన్నాయి. రాష్ట్రంలో పాఠశాల విలీన ప్రక్రియ వలన వేలాది పాఠశాలలో మూతపడుతున్నాయి రాష్ట్రవ్యాప్తంగా 6,400 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలు పెండింగ్ లో ఉన్నాయి. జీవో నెంబర్ 77వలన పేద బడుగు బలహీనవర్గాల విద్యార్థులు పీజీ విద్యకు దూరమవుతున్నారు. తల్లికి వందనం పథకాన్ని 2024- 25 విద్యా సంవత్సరంలో అమలు చేయకుండా ఈ విద్యా సంవత్సరంలో అనేక షరతలు విధించారు. దీనివలన లక్ష మంది విద్యార్థులు తల్లికి వందనం పథకానికి దూరమవుతున్నారు. మెడికల్ కళాశాలలో ప్రైవేట్ పరం చేస్తా ఉన్నారు, మెడికల్ కళాశాల భూములు కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెడుతున్నారు. మెడికల్ విద్య ప్రైవేటీకరణ చేసే జీవో నెంబర్ 108,109 రద్దు చేయాలి, సంక్షేమ హాస్టల్ లు సంక్షోభంలో ఉన్నాయి. నిత్యవసర వస్తువు ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. గత ఏడాది కాలంగా రాష్ట్రవ్యాప్తంగా అనేక సంక్షేమ హాస్టల్స్, కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ఫుడ్ పాయిజన్ అయి విద్యార్థులు అస్తవ్యస్తకు గురవుతున్నారు.ఈ సమస్యల పరిష్కారానికి జూలై 7న అన్ని జిల్లా కేంద్రాల్లో, జూలై 10న విజయవాడలో జరుగు మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిడియస్ యు జిల్లా నగర నాయకులు యశ్వంత్,రమణ,నరేష్,రాజేష్,చంద్రశేఖర్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ బాబు జగజీవన్ రామ్ 39వ వర్ధంతి వేడుకలు

**పులివెందుల జూలై 05:-** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీఆధ్వర్యంలో పులివెందుల లో పాత ఎమ్మెల్యే ఆఫీసులో శ్రీ బాబు జగజీవన్ రామ్ చిత్ర పటానికి వైయస్ మనోహర్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కేంద్ర, రైల్వే శాఖ,కార్మిక శాఖ రవాణా శాఖ మంత్రిగా , ఉప ప్రధానిగా, పని చేశారు 50 సంవత్సరాలు పార్లమెంట్ సభ్యునిగా , బడుగు బలహీన వర్గాలకు ఎంతో మేలు చేశారు.కార్మిక చట్టాలను కూడా తీసుకొచ్చిన నాయకులు.ఓటమి లేకుండా తిరుగులేని నాయకునిగా ఎదగారు. ఈ కార్యక్రమంలో, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్. గోటూరు చిన్నప్ప, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గంగాధర్ రెడ్డి.నూర్ భాషా సంఘం రాష్ట్ర అధ్యక్షులు రసూల్.మున్సిపల్ వైస్ చైర్మన్ ఆఫీజ్, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీరాష్ట్ర ఎస్సి సెల్ రాష్ట్ర కార్యదర్శికాళ్ళ భాస్కర్, పులివెందుల మున్సిపల్ కౌన్సిలర్లు కోడి రమణ. దాసరి చంద్రమౌళి. నాగభూషణం డేనియల్. ఖాదర్. బాల అశ్విత్ రెడ్డి.అంకాలమ్మ దేవస్థానం చైర్మన్ ప్రసాద్. వైస్సార్సీపీ తాలూకా అధ్యక్షులు అగ్రహారం రవి, పులివెందుల వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తాలూకా దివ్యాంగుల అధ్యక్షులు చాగలేటి భాస్కర్, వైఎస్ఆర్సిపి నాయకులు సూరి, కృష్ణ మూర్తి,అంజి, వీరయ్య. సోపాల వీర జహంగీర్. హరి. కనక. వెంకటసుబ్బయ్య వెంకటస్వామి, సాయి, సురేష్ పార్టీనాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



## మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

### ● డీఆర్వో విశ్వేశ్వర నాయుడు

**కడప జులై 06:-** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని డిఆర్వో కోరారు.**సభాభవన్‌లో పిజిఆర్ఎస్ నిర్వహణ** ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ను ఈ సోమవారం సభాభవన్ లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారుఅర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునన్నారు**డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం**డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు జరుగుతుందన్నారు.ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారుప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ 115వ వర్ధంతి

### ● దళిత చిహ్నం డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్
### ● స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు



**పులివెందుల జూలై 06:-** అణగారిన వర్గాల శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేసి ఆయన జీవితాన్ని అంకితం చేసిన మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగజ్జీవన్ రామ్ దళిత చిహ్నం అని స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు పేర్కొన్నారు.మాజీ ఉప ప్రధాని డాక్టర్ జగ్జీవన్ రామ్ 115 వ వర్ధంతి సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీ రాజా కళానిలయం లో నృత్య చిన్నారుల నడుమ స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, శ్రీ రాజా కళా నిలయం నృత్య శిక్షకుడు రాజా లు డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాబూ జగజ్జీవన్ రామ్ ఒక సామాన్య రైతు కుటుంబంలో 1908 ఏప్రిల్ 5న బాబూ జగ్జీవన్ రామ్ జన్మించారు. ఆయన తండ్రి శోబీరామ్, తల్లి వసంతిదేవి. బీహార్‌లోని షాహాబాద్ (ఇప్పుడు భోజ్‌పూర్) జిల్లాలోని చంద్వా అనే చిన్న గ్రామంలో జన్మించారు. ఆయనకు అన్నయ్య సంత్ లాల్ తోపాటు ముగ్గురు అక్కచెల్లెళ్లు ఉన్నారు. జగ్జీవన్ రామ్ అర్రా టౌన్ స్కూల్ నుండి మెట్రిక్యులేషన్ మొదటి విభాగంలో ఉత్తీర్ణుడయ్యాడు."అణగారిన వర్గాల అభివృద్ధి కోసం అలుపెరుగని కృషి చేసిన మహనీయుడు, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్. స్వాతంత్ర్య సమర యోధుడిగాను, సంఘసంస్కర్తగాను రాజకీయ నాయకుడిగాను దేశానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం.జగ్జీవన్ రామ్ అంటరానివారి శ్రేయస్సు కోసం తన జీవితాన్ని అంకితం చేసిన దళిత చిహ్నంగా అభివర్ణించారు. ఈ కార్యక్రమం లో సేవాసమితి పట్టణ అధ్యక్షులు మహమ్మద్ రఫీ, సభ్యులు బండారు రాజు,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 7, 8వ తేదీలలో ఇంచార్జ్ మంత్రి జిల్లాకు రాక




**కడప జూలై 06:-** జిల్లా ఇంచార్జ్ మంత్రి మరియు జిల్లా వెనుకబడిన తరగతుల మరియు చేనేత మరియు జౌళి శాఖల మంత్రి ఎస్ సవిత ఈ నెల 7 మరియు 8వ తేదీలలో జిల్లా పర్యటనకు విచ్చేయుచున్నారని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తేదీ ఉ.7.00 గంటలకు కడప ఆర్ అండ్ బి అతిథి గృహం నుండి పులివెందులకు బయలు దేరి ఉ.8.00 గంటలకు పులివెందుల టిడిపి పార్టీ ఆఫీస్ చేరుకొని పార్టీ ఆఫీస్ కార్యాలయం నందు ఉ. 8 నుండి 9 గంటల వరకు స్థానిక ప్రజాప్రతినిధులతో ఇంటరాక్షన్ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం లింగాల మండలానికి బయలుదేరి వెళ్లి ఉ.9:30 నుండి మ.1.00 గంటల వరకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమానంతరం మధ్యాహ్నం ఒంటి గంటకి కడప ఆర్ అండ్ బి అతిథి గృహముకు బయలుదేరి మ.2.30 గంటలకు చేరుకుంటారు.విరామానంతరం మధ్యాహ్నం 2.55 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయమునకు చేరుకొని సా.4.00 గంటల వరకు పిజిఆర్ ఎస్ హాలు నందు విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.సమావేశం ముగిసిన తర్వాత సా 4.00 గంటలకి కడప ఆర్ అండ్ బి అతిథి గృహము చేరుకొని సా.5.00 గంటల నుండి 6.30 గంటల వరకు కడప నగరం నందు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమం ముగిసిన అనంతరం తిరిగి కడప ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ కు చేరుకొని స్థానిక ప్రజా ప్రతి నిధులతో సమావేశమై రాత్రికి బస చేస్తారని తెలిపారు. 8వ తేది ఉ.7:35 గంటలకు కడప ఆర్ అండ్ బి అతిథి గృహం నుండి కమలాపురం నియోజకవర్గం చెన్నూరు మండలానికి ఉ.8 గంటలకు చేరుకొని, ఉ.9:35 గంటల వరకు చెన్నూరు గ్రామం నందు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమానంతరం ఉ.10 గంటలకు కడప జిల్లా కలెక్టర్ వారి కార్యాలయమునకు బయలుదేరి, అక్కడికి చేరుకొని ఉ.10:30 నుండి మ.3:30 వరకు పి జి ఆర్ ఎస్ హాలు నందు జిల్లా సమీక్షా సమావేశం నందు పాల్గొంటారని.అనంతరం మ.3.35 గంటలకు కడప ఆర్ అండ్ బి అతిథి గృహము నుండి బయలుదేరి సా.4.00 గంటలకు రోడ్డు మార్గాన గుంటూరులోని మంత్రి నివాసానికి బయలుదేరి వెళ్తారని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.



# ఘనంగా మొహరం పండుగ పెద్ద సరిగెత్తు వేడుకలు



**పత్తికొండ జులై 06:–** మొహరం పండుగ పెద్ద సరిగెత్తు వేడుకలు పత్తికొండలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుండి పీర్ల చావిళ్లలో భక్తులు మొక్కలను తీర్చుకున్నారు. మరి కొంతమంది భక్తులు స్వామివారికి మొక్కుకున్నవారు వివిధ రకాల వేషాలు ధరించి పీర్లచావిళ్ల ముందు పులి వేషాలు ప్రదర్శించారు. సాయంత్రం పత్తికొండ కొత్తపేట, పాతపేట ప్రాంతాల్లో పీర్లచావిళ్లలో భక్తులు పోటెత్తారు. పీర్లచావిళ్ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

# వేంపల్లెలో తొలి ఏకాదశి పూజలు



**వేంపల్లి జూలై 06:–**వేంపల్లెలోని కడప రోడ్డులో వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం తొలి ఏకాదశి పురస్కరించుకుని శ్రీ వెంకటేశ్వర స్వామివారికి విశేష పూజలు నిర్వహించామని ఆలయ ఈఓ హనుమంతరావు తెలిపారు.ఆలయ ప్రధాన అర్చకులు హరిప్రవీణ్ నేతృత్వంలో ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం, అర్చన,నివేదన, మహా మంగళ హారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించామన్నారు.అనంతరం వెండి శంకు చక్రాలు, కిరీటంతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు .స్వామివారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# సామాజిక విప్లవ యోధుడు హరిత విప్లవ పితామహుడు బాబు జగజ్జీవన్ రామ్

**- రాష్ట్ర అధ్యక్షులు డి. ఎం. ఓబులేసు యాదవ్**

**కడప టౌన్ జూలై 06:–** ఆర్ఎస్ఎఫ్జాతి అభ్యుదయం కోసం అహర్నిశలు కృషిచేస్తూనే చదువుకుంటున్న విద్యార్థి దశలోనే అనేక వివక్షతలకు అంటరానితనాని అవమానాలను ఎదిరించి పోరాడిన సామాజిక విప్లవ యోధుడు హరిత విప్లవ పితామహుడు బాబు జగజ్జీవన్ రామ్ అని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి. ఎం. ఓబులేసు యాదవ్,దళిత మిత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు కైపు రామాంజనేయులు కొనియాడారు ఈ సందర్భంగా ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి. ఎం. ఓబులేసు యాదవ్ మాట్లాడుతూ ఒక వైపు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే, మరోవైపు సామాజిక సమానత్వం కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరగని సమరం సాగించిన రాజకీయ సవ్యసాచి, సామాజిక విప్లవ యోధుడు బాబూ జగ్జీవన్ రామ్. జాతి జనులను విద్యావంతులుగా, ఆత్మాభిమానం కలవారిగా చేయాలన్నదే తన లక్ష్యం అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రెడ్డి సాయి, ప్రకాష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు



# సిపిఐ ఆలూరు నియోజకవర్గ 12వ మహాసభలు జయప్రదం చేయండి



**దేవనకొండ జులై 06:–** సిపిఐ ఆలూరు నియోజకవర్గ 12వ మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె. మద్దిలేటి శెట్టి, మండల కార్యదర్శి ఎం.నరసరావు లు పిలుపునిచ్చారు. ఆదివారం దేవనకొండలో సిపిఐ మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో అత్యంత వెనుకబడిన ఆలూరు ప్రాంత అభివృద్ధికై సిపిఐ అనేక ఉద్యమాలు చేపట్టి చేపట్టిందన్నారు. కరువు ప్రాంత అభివృద్ధి కోసం, పెండింగ్ లో వేదవతి ప్రాజెక్టు పూర్తిచేసే పూర్తి చేసి ఈ ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించాలని,జింకల పార్కులు ఏర్పాటు చేయాలని పోరాటం నిర్వహిస్తుందన్నారు. ఆలూరు ప్రాంత సమగ్ర అభివృద్ధికై ఈ మహాసభలలో పలు తీర్మానాలు చేసి ఈ ప్రాంత వెనుకబాటుతనం పట్ల నిర్లక్ష్య వైఖరి పై పాలక ప్రభుత్వాలపై పోరాటాలు చేయనున్నట్లు వారు తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 11వ తేదీ జరిగే ఆలూరులో జరిగే ఆలూరు నియోజకవర్గ మహాసభలను జయప్రదం చేయాలని దేవనకొండలో మండల ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేస్తూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు బజారి, రైతు సంఘం నాయకులు నగిరి శేఖర్, కోమేష్, మహేష్, రాజశేఖర్, వెంకటరాముడు, మధు, సుబ్బయ్య, శ్రీనివాసులు శెట్టి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# కొండపేటలో ఘనంగా పీర్ల ఊరేగింపు

**● మత సామరక్షానికి పీర్ల పండగ**



**చెన్నూరు జూలై 06:–** హిందువులు ముస్లింలు కలసి జరుపుకునే పీర్ల పండుగ మత సామ్రక్షానికి పీర్ల పండగ జరుపుకుంటారు. ప్రతి ఏడాది జరుపుకునే మొహరం పండుగ ప్రతి ఏడాది లాగానే ఈ ఏడాది కూడా ఘనంగా జరుపుకున్నారు. చెన్నూరు మండలం కొండపేట గ్రామంలో పవిత్ర మొహరం పండుగను పురస్కరించుకొని ఆదివారం గ్రామ ప్రజలు ఇతర గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వారం రోజులపాటు కొండపేట గ్రామంలోని పీర్ల సావిడిలో కొలువుతీరగా అగ్నిగుండం ప్రవేశము గ్రామంలో పీర్ల ఊరేగింపు జరిపారు. ఆదివారం సాయంత్రం మూడు గంటల నుంచి పురవీధుల గుండా పీర్ల ఊరేగింపు పెన్నా నది వరకు కొనసాగింది. చివరి రోజు పీర్ల ఊరేగింపు సందర్భంగా పేర్లను సందర్శించేందుకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. సాయంత్రం కొండపేట పెన్నా నదిలో పిర్లను నిమగ్నం చేశారు. మేళ తాళాలు తప్పెట్లు మధ్య చిందులు వేస్తూ కరసాలు చేసుకుంటూ రంగులు వెదజల్లుకుంటూ ఊరేగింపు కొనసాగింది. పీర్ల పండుగ పురస్కరించుకొని గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా చెన్నూరు సిఐ కృష్ణారెడ్డి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# పీ.ఆర్.సీ అమలు చేయాలి

**● డి. ఎ, ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలి: యూటీఎఫ్**



**రాయచోటి జులై 06:–** రాయచోటిలో పట్టణంలోని డిగ్రీ కళాశాల నందు ఆదివారం యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహిం చారు . ఈ సమావేశంలో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్,జాబిర్ లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఫ్రెండ్లీ ప్రభుత్వం అనీ ,మేము అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లిస్తామని, పీఆర్సీ ని వెంటనే అమలు చేస్తామని ప్రగల్భాలు పలికి ఇప్పటికి సంవత్సరం గడిచినా ఉద్యోగ ఉపాధ్యాయుల పట్ల పూర్తి గా నిర్లక్ష్య ధోరణి తో ఉందనీ వారు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ వారిని పాత పెన్షన్ విధానంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధనేతర పనులకు ఉపయోగించుకోబోమని ఒకవైపు చెబుతూనే మరొక వైపు రకరకాల యాప్ లతో మరియు వివిధ రకాల శిక్షణలు మరియు ఇతరత్రా కార్యక్రమాలతో ఉపాధ్యాయులను మానసిక క్షోభకు గురి చేస్తున్నారని తెలిపారు .

# వేంపల్లె మానవత సంస్థ అధ్యక్షులుగా డా.యోగీశ్వర బాబు

**● వేంపల్లె మండల శాఖ శాశ్వత చైర్మన్ చక్రపాణి రెడ్డి**

**● మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం**



**వేంపల్లి జులై 06:–**వేంపల్లె మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం అట్టహాసంగా నిర్వహించినట్లు వేంపల్లె మండల శాఖ శాశ్వత చైర్మన్ చక్రపాణి రెడ్డి తెలిపారు.ఆదివారం వేంపల్లె పట్టణంలో 2025-2026 సంవత్సరం నూతన కార్యవర్గ సభ్యులతో జిల్లా అధ్యక్షులు సుబ్బారెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు.నూతన అధ్యక్షులుగా డా.యోగీశ్వర బాబు,ఉపాధ్యక్షులుగా తేజ, కార్యదర్శిగా చైతన్య, కోశాధికారిగా శుభాష్ లతో పాటు తదితర విభాగాల కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. నూతన అధ్యక్షులు యోగీశ్వర బాబు మాట్లాడుతూ మానవుల పట్ల ప్రేమ,దయ మరియు సహాయ భావనతో సమాజానికి సేవ చేయడమే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు.మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రా రెడ్డి ఆశయాల మేరకు సంస్థ అభివృద్ధికి, సేవా కార్యక్రమాలకు కార్యవర్గ సభ్యులు సహకరించాలని కోరారు.నూతన అధ్యక్షుడిని సంస్థ ఆధ్వర్యంలో పూలమాల వేసి శాలువతో సత్కరించారు. సలహాదారుల బోర్డు సభ్యులుగా డా.రంగయ్య,డా.రాజారామ్, కవి ప్రసాద్,తిరుమల రెడ్డి,భాస్కర్ రెడ్డి తదితరులను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో మానవత సంస్థ జిల్లా సంయుక్త కార్యదర్శి కావలి కృష్ణతేజ,రీజనల్ చైర్మన్ చల్లా బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

# ఓటమి ఎరుగని నాయకుడు బాబు జగ్జీవన్ రామ్



**కర్నూలు జూలై 06:–** సామాన్య మధ్యతరగతి కుటుంబంలో జన్మించి అంచెలంచెలుగా ఎదిగి ఎన్నో ఉన్నత పదవులు చేపట్టిన ఓటమి ఎరుగని నాయకుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని మాజీ ఎమ్మెల్సీ , మాజీ డిసిసి అధ్యక్షులు, ఎఐసిసి సభ్యులు ఎం సుధాకర్ బాబు ఆయన సేవలను కొనియాడారు. బాబు జగ్జీవన్ రామ్ బీహార్ రాష్ట్రం చాంద్వా జిల్లాలో జన్మించారని, ఆయన స్వాతంత్ర్య సమరయోధుడు మరియు సంఘ సంస్కర్త, భారత పార్లమెంటులో సుమారు 40 ఏళ్ళ పాటు వివిధ మంత్రి పదవులు నిర్వహించారని మరియు ఉప ప్రధానిగా వ్యవహరించారని, కాంగ్రెస్ పార్టీ ఆయనకు పూర్తి స్వేచ్ఛనిచ్చిందని, బాబు జగ్జీవన్ రామ్ గారు విద్యార్థి దశ నుండి గాంధీజీ అహింసా వాదానికి ఆకర్షితులై 1930 లో జరిగిన సత్యాగ్రహోద్యమంలో పాల్గొని లాఠీ దెబ్బలు తిన్నారని జగ్జీవన్ రామ్ అనతి కాలంలోనే తన పరిపాలనా దక్షత ప్రజల పట్ల ఎనలేని ప్రేమ నిస్వార్థ సేవతో అసమాన ప్రతిభ కనబరిచి ఎన్నో ఘన విజయాలు సాధించి తిరుగులేని నాయకునిగా గుర్తింపు పొందారని చట్టసభలకు మూడుసార్లు ఏకగ్రీవంగా ఎన్నికై సంచలనం సృష్టించారని సుధాకర్ బాబు అభిప్రాయపడ్డారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన జగ్జీవన్ రామ్ గారి 38 వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ముందుగా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పార్టీ కార్యాలయం నందలి జగ్జీవన్ రామ్ గారి చిత్రపటమునకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ఐదు రోడ్ల కూడలి నందలి జగ్జీవన్ రామ్ గారి కాంస్య విగ్రహమునకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కార్యకర్తల సమావేశం జరిగింది. పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, ఐఎన్టియుసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి పాషా, కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, ఎస్సి సెల్ జిల్లా చైర్మన్ ఎస్సీ బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, కేకేసి సెల్ జిల్లా చైర్మన్ ఎజాజ్ అహ్మద్, ఐ ఎన్ టి యు సి సిటీ అధ్యక్షులు ఆర్ ప్రతాప్ కాంగ్రెస్ నాయకులు బి సుబ్రహ్మణ్యం, డబ్ల్యూ సత్యరాజు, జాన్ సదానందం, వశీ భాష, శివ కుమార్, కేశవరెడ్డి, మద్దిలేటి మొదలగు వారు పాల్గొన్నారు.

# కార్మిక కర్షకోద్యోగ ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలి

**● సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు**



**రాయచోటి జులై 06:–** బీజేపీ ప్రభుత్వం కార్మికులు సాధించుకున్న చట్టాలు హక్కులను కాలరస్తున్నదని, జూలై 9న కేంద్ర కార్మి సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న దేశ వ్యాప్త సమ్మెలో కార్మిక, కర్షక శ్రేణులు పాల్గొని సమ్మె జయప్రదం చేయాలని రామాంజులు పిలుపునిచ్చారు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక , విధానాలను వ్యతిరేకిస్తూ కార్మికులను సంఘటితం చేయడానికి మండలకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయం లో మండల కన్వీనర్ డి భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన సదస్సు లో సమ్మె కోసం ప్రత్యేకంగా ప్రచురించిన కరపత్రాలను వివిధ కార్మిక సంఘాల నాయకులు విడుదల చేయడం జరిగింది. అనంతరం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎ వి రమణ మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బీవీ రమణ లు మాట్లాడుతూ కార్మికులు ప్రాణ త్యాగాలతో పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చి బడా కంపెనీల యజమానులకు అనుకూలంగా చట్టాలను మారుస్తూ కార్మికుల శ్రమ దోపిడీని దోచుకు తినే విధంగా చట్టాలను మారుస్తున్నారని ఇది ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని తెలిపారు. విద్యుత్ శాఖలో పెండింగ్ లో ఉన్న 4 డి ఏ లు విడుదల చేయాలి, ఈపీఎఫ్ నుండి జిపిఎఫ్ కు బదిలీ చేయాలి.2014 నుండి కోర్టు పెండింగ్ లో ఉన్న జేఎల్ఎం గ్రేడ్ 2 జేఎల్ఎం కు ప్రమోషన్లు ఇవ్వాలి . రిటైర్డ్ అయిన ఈపీఎఫ్ ఎంప్లాయిస్ కి మెడికల్ సౌకర్యం కల్పించాలి. కేంద్రం పనిగంటలను 12 గంటలకు పెంచి, రాష్ట్ర ప్రభుత్వం 10 గంటలకు, పని గంటల పెంచి, జీతాలు పెంచకుండా, దోపిడీ చేస్తుందన్నారు. కార్మికులకు పోరాడే హక్కు లేకుండా చేసి ఉద్యమాలను లేకుండా చేయాలని కుట్రలను కార్మిక వర్గం ఐక్యంగా పోరాటాల ద్వారా బి.జె.పి దాని విధానాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్న తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జులై 9,వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో, ఉద్యోగులు పాల్గొని సంఘీభావం తెలపాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు సిద్దమ్మ మంజుల,బీడీ సంఘం నసీబ్ జాన్, ఆశా నాయకులు సునీత, శైలజ, మధ్యాహ్న భోజన కార్మికులు జయన్న ఫర్హానా, హమాలీ నాయకులు మాధవ, రత్నం, మున్సిపల్ నాయకులు అక్బర్, నాగేశ్వర నాయుడు, ఈశ్వర్ రెడ్డి, గ్రామ పంచాయతీ నాయకులు దేవరాయలు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# కడప నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం

**● బాబు షూరిటీ-మోసం గ్యారంటీ**



**కడప జూలై 06:–** చంద్రబాబు మేనిఫెస్టో ను గుర్తుకు తెస్తూ (రికాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో) కార్యక్రమం లో భాగంగా ఆదివారం కడప నగరంలోని యూఎస్ మహల్ కళ్యాణ మండపం నందు వైస్సార్సీపీ కడప నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.బి.అంజాద్ భాష ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది.వైస్సార్సీపీ పార్టీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్ రెడ్డి, కడప నగర మేయర్ కే.సురేష్ బాబు, వైస్సార్సీపీ పార్టీ పరిశీలకులు కొండూరు అజయ్ రెడ్డి, డిప్యూటీ మేయర్లు ముంతాజ్ జమాల్ వలి, నిత్యానంద రెడ్డి, డాక్టర్ సాహెల్ అహ్మద్ హాజరైనారు.2024 ఎన్నికల మేనిఫెస్టో లో చంద్రబాబు ఇచ్చినటువంటి హామీలను గుర్తు చేస్తూ ప్రజలను వంచిస్తున్న తీరును వివరిస్తూ పార్టీ రూపొందించిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ స్కాన్ ను ఆవిష్కరించారు.చంద్రబాబు ప్రజలకు హామీలు ఇచ్చి మోసం చేస్తున్న తీరును ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు అంజాద్ భాష పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కడప నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, రాష్ట్రస్థాయి నాయకులు, జిల్లా స్థాయి నాయకులు,పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితుడు అరెస్ట్



**పులివెందుల జూలై 06:-** హత్య కేసులో నిందితుడు అరెస్ట్ చేశామని డిఎస్పి మురళి నాయక్ తెలిపారు. ఆదివారం సాయంత్రం పట్టణ పోలీస్ స్టేషన్లో మీడియా సమావేశంలో మాట్లా డుతూ గత నెల 30న బోనాల హసీనా హత్య ను హత్య చేయడం జరిగిందని, రెండు రోజుల తర్వాత దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. సంఘటన దానికి వెళ్లి అక్కడ ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా దేవిరెడ్డి లికిత్ కుమార్ రెడ్డి విచారించడం జరిగిందన్నారు. విచారణలో హసీనా వడ్డీలు వ్యాపారం చేస్తూ ఉండేదని కరుణ కుమారికి డబ్బులు ఇవ్వడం జరిగిందని రెండు సంవత్సరాలు అవుతున్న డబ్బులు ఇవ్వకపోవడంతో డబ్బులు ఇవ్వాలని కఠినంగా అడగాలముతో కరుణికుమారి కుమారుడు లిఖిత్ కుమార్ రెడ్డి గొంతు మీద చేతి మీద కత్తితో పొడిచి చంపాలన్నారు. ఈ హత్యకు ప్రోత్సహించిన కరుణ కుమారి పై కూడా కేసు నమోదు చేశామని ఆమె ప్రస్తుతం పరారీలో ఉందని త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు. ఆదివారం మధ్యాహ్నం ఉల్లి మెల్ల రింగ్ రోడ్డు ట్రాఫిక్ సిఐ హాజీవల్లి, ఎస్సై నారాయణ అరెస్ట్ పోలీస్ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేయడం జరిగింది అన్నారు. రిమాండ్ రిపోర్ట్ తో మెజిస్ట్రేట్ ముందు హాజరు పరుస్తామని డిఎస్పి తెలిపారు.

# ఈ కొత్తపల్లెలో కోలాహలంగా పీర్ల పండగ

- అంగరంగ వైభవంగా మొహరం వేడుకలు





**పులివెందుల జూలై 06:-** హిందూ,ముస్లింలు, సమైక్యంగా జరుపుకునే మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే,మొహరం వేడుకలలో భాగంగా,పెద్ద సరిగేత్తు, పానకాలు,కార్యక్రమం ఆదివారం పేర్ల దేవుళ్ళు మసీదులకు వందలాదిమంది భక్తులు డప్పు వాయిద్యాలు నడుమ, ఊరేగింపుగా వచ్చి పానకాలు సమర్పించి,చక్కెర బెల్లం తులాభారా లిచ్చి,చక్కెర చదివింపులు నిర్వహించి,మొక్కలు తీర్చుకున్నారు, ఈ పులివెందుల మండలంలోని పెద్ద ఎత్తున మొహరం పండుగ నిర్వహించేది ఈ కొత్తపల్లి గ్రామంలోని చెప్పుకోవచ్చు అంతేకాకుండా ఈ గ్రామంలో ఉన్నవారు ఏదైనా విదేశాలలో ఉన్న వారు కూడా ఈ మొహరం పండగ రావడం ఆనవాయితీగా జరుగుతున్నది ఈ గ్రామంలో అందరూ కలిసికట్టుగా నిర్వహించుకునే ఒక పెద్ద పండగ అంటే మోహరం పండగ అని చెప్పుకోవచ్చు అంతేకాకుండా వారి సమీప బంధువులను ఈ పండక కు గ్రామానికి ఆహ్వానించడం జరుగుతుంది అదేవిధంగా ఈ గ్రామంలో ఉన్న హస్తం పేరుకు ఏదైనా కోరికలు కోరుకుంటే మళ్ళీ వచ్చే ఏడాది కల్లా నెరవేరుతాయి అని పూర్తి నమ్మకం అందులో భాగంగానే పిల్లల పుట్టిన వారు ఇక్కడ మోహరం చివరి రోజు సదింపు చదివించి కోరికలు కోరుకుంటే తిరిగి వచ్చే సంవత్సరానికల్లా వారికి సంతానం కలుగుతున్నది అట్ల సంతానం కలిగిన వారు వారికి పుట్టిన బిడ్డను మొహరం పండగ చివరి రోజున అగ్నిగుండంలో ఆ పిల్లలను బండి వేసి ముక్కులు తీర్చుకోవడం జరుగుతున్నది ఇలా కొన్ని సంవత్సరాల నుంచి ఇదే ఆనవాయితీగా కొనసాగుతున్నది వారం రోజులు పాటు ఎంతో అంగరంగ వైభవంగా ఈ మొహరం పండుగలు నిర్వహించుకోవడం గ్రామ ప్రజలంతా కలిసికట్టుగా ఈ వేడుకలు తిలకించేందుకు పెద్ద ఎత్తున హాజరవుతారు ఈ మొహరం పండగ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా డి.ఎస్.పి మురళి ఆదేశాల మేరకు సిఐల పర్యవేక్షణలో ఎస్ఐ నారాయణ తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది.


# ప్రశాంతంగా ముగిసిన మొహర్రం వేడుకలు: ఎస్సై మహమ్మద్ రఫీ



**రుద్రవరం, జూలై 06:** రుద్రవరం మండలంలో మొహర్రం పండుగ సందర్భంగా నిర్వహించిన పెద్ద సరిగేతు, పీర్ల ఊరేగింపు కార్యక్రమాలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగిసినట్లు ఎస్సై మహమ్మద్ రఫీ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని కోటకొండ, ఎల్లావత్తుల, శ్రీరంగాపురం, బి.నాగిరెడ్డిపల్లె, ఆలమూరు, చిత్రేనిపల్లె, నరసాపురం, ఆర్ నాగులవరం , నల్లవాగుపల్లె, గ్రామాలలో ఊరేగింపు రూట్లలో పోలీసుపటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు శాంతియుతంగా పండుగను జరుపుకోవడానికి సహకరించారని తెలిపారు. ఎక్కడా కూడా డీజేలకు అనుమతి ఇవ్వలేదని, గుండం దగ్గర ప్రజలు జాగ్రత్తలు పాటించి వేడుకల్లో పాల్గొనాలని సూచించారు. మరి కొన్ని గ్రామాల్లో సోమవారం జరిగే ఊరేగింపు కార్యక్రమాల్లో కూడా డీజేలు పెట్టకుండా, గుండాల దగ్గర జాగ్రత్తలు పాటిస్తూ మొహరం వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై సూచించారు.

# మళ్లీ మళ్లీ ప్రధానమంత్రి నరేంద్రుడే!

- మళ్లీ మళ్లీ నరేంద్రుడే ప్రధానమంత్రి కావాలని కనకదుర్గ దేవస్థానంలో పూజలు



**ఉరవకొండ జులై 06:-** దేశ సార్వభౌమాధికారం, సమగ్రత, సౌభ్రాతత్వం, పాలనా దక్షత కలిగిన నరేంద్ర మోడీ మళ్లీ మళ్లీ ప్రధానమంత్రిగా కొనసాగాలంటూ విజయవాడ కనకదుర్గాదేవి దేవస్థానంలో అమ్మవారికి బిజెపి నేతలు ప్రత్యేక పూజలు కుంకు మార్చనలు చేశారు. పూజలు రాష్ట్ర గిరిజన మోర్చా ఉపాధ్యక్షులు, కేశవ నాయక్, మాట్లాడుతూ పరిపాలన దక్షత కలిగిన సమర్థుడైన ప్రధాన మంత్ర ని ఆయన అభివర్ణించారు. దేశ ప్రజలు మోడీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. సిద్ధాంతాలు ఆచరించటంలో, దేశ ప్రజల కు సంక్షేమ పథకాలు అందించటంలో నరేంద్రుడు మొట్టమొదటి వాడన్నారు. శాశ్వత దేశ ప్రధానిగా కొనసాగే హక్కు నరేంద్రుడికి చెందుతుందన్నారు. ప్రధాని పేరిట ప్రత్యేక కుంకుమార్చన విశేష పూజలు జరిపించారు. అమ్మ కృపా కటాక్షాలు మెండుగా ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలోశివాజీ నాయక్ , నాయడు నాయక్, బిజెపి కార్యకర్తలు మరియు బిజెపి నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# సుపరిపాలన తొలి అడుగులో పండుగ వాతావరణం

- చంద్రన్న, అఖిలమ్మ పాలనపై హర్షాతిరేకం
- యూనిట్ ఇంచార్జ్ యు వి సుబ్బయ్య



**సిరివెళ్ల జులై 06:** మండల కేంద్రంలోని శిరివెళ్ల మేజర్ గ్రామపంచాయతీలో 97, 98వ బూతులో తెలుగు దేశం పార్టీ కూటమి ప్రభుత్వం ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం యూనిటీ ఇన్చార్జి ఉల్లి వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో బూతుల ఇంచార్జీలు 50 శాతం గృహ కుటుంబాలను కలిసినట్లు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం రెండు బూతులలో పండుగ వాతా వరణం నెలకొన్నదని బూతు లో ఇన్చార్జీలు ఉల్లి గురు మోహన్, చాకలి మద్దిలేటి పేర్కొన్నారు. ఆళ్లగడ్డ శాసన సభ్యురాలు భూమా అఖిల ప్రియ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సుపరి పాలనలో తొలి అడుగు కార్య క్రమం ఐదు రోజులపాటు నిర్విఘ్నంగా కొనసాగుతున్న దని యూనిటీ ఇన్చార్జి ఉల్లి వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులకు భూమా అభిమానులకు ముందుగా తొలి ఏకాదశి మరియు మొహరం పండుగలా శుభాకాంక్షలు తెలియజేశారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా వెళ్ళిన ప్రతి ఇంటిలో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయని అన్నారు. నేడు కుటుంబంలో ఎంత మంది చదువుకుంటే అంత మందికి అరుపులైన ప్రతి విద్యార్థినీ విద్యార్థులకు 13 వేల రూపాయలు వేసిన ఘనత కూటమి ప్రభుత్వాని దేనని అన్నారు .పెన్షన్ దారులు తల్లికి వందనం లబ్ధిదారులు అభివృద్ధి సంక్షేమాలు లబ్ధి పొందిన కాలనీ ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ కూటమి ప్రభు త్వానికి జేజేలు పలికారని యు వి సుబ్బయ్య పేర్కొన్నా రు. ఏడాది పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా 50 శాతం గృహాలు పూర్తిచేసుకుని ముందుకు వెళుతున్న సందర్భంగా యూనిటీ ఇన్చార్జి తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# సుపరిపాలనలో తొలి అడుగులో పండుగ వాతావరణం

**సిరివెళ్ల జులై 06:** మండల కేంద్రంలోని ప్రజలకు నూతన సంవత్సర తొలి ఏకాదశి పండుగ మరియు మొహరం శుభాకాంక్షలు కొత్తపేట జిక్రియ బ్రదర్స్ మరియు నంద్యాల సిద్ధిక్ , అల్లా బకాస్ తెలిపారు. తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా సుపరి పాలన తొలి అడుగు కార్యక్ర మం లో భాగంగా 106 బూతులో ఇంటింటికి వెళ్లి ఈ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పథకాల గురించి తెలియ జేశారు. నేడు కుటుంబంలో ఎంతమంది చదువుకున్న విద్యార్థిని విద్యార్థులకు 13 వేల రూపాయలు వేసిన ఘనత కూటమి ప్రభుత్వాన్ని దేనిని తెలియజేశారు. పెన్షన్ దారులకు, తల్లికి వందనం లబ్ధిదారులకు అభివృద్ధి సంక్షేమాలు ప్రజలకు తెలియజేశారు. ఇంకను ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడం జరుగుతుంది తెలియ జేశారు. ఒకదాని తర్వాత ఒకటి చెప్పిన వాగ్దానాలన్నీ నెరవేర్చడం జరుగుతుంది అని ఎలాంటి అపో హాలు నమ్మవద్దని తెలియజేశారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని సమస్యల పరిష్కారానికి ప్రభు త్వం కృషి చేయడం జరుగుతుంది అనికొత్తపేట బ్రదర్స్, నంద్యాల సిద్ధిక్, బి అల్లా బగాష్ తెలిపారు.





# నేడు సోమవారం ఉరవకొండలో మంత్రి పర్యటన

**ఉరవకొండ జులై 06:-** ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం ఉరవకొండ పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి మొదట ఉరవకొండ పట్టణం తాగునీటికి సంబంధించి పిఏబిఆర్‌లో పంప్ హౌస్ సందర్శన చేసి, ఉరవకొండ ఆర్.డబ్ల్యూ.ఎస్ కార్యాలయంలో ఉదయం 09:30 గంటల నుంచి 10 గంటల మధ్య తాగునీటి పథకం ప్రారంభోత్సవం కార్యక్రమంలో మంత్రివర్యులు పాల్గొనను న్నారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు ఎదురుగా ఉన్న ప్రాంతంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు కోసం స్థల పరిశీలన చేయనున్నారు. ఆ తర్వాత నూతనంగా మంజూరైన రాయంపల్లి రోడ్డు, పాల్తూరు రోడ్డు, కనేకల్ క్రాస్ నుంచి ఉరవకొండ టౌన్ రోడ్డులకు భూమి పూజ చేసే కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి..

# పీర్లకు వెండి గుర్రం, శంకు-చక్రాలను అందించిన సాఫ్ట్వేర్ ఉద్యోగి



**ఉరవకొండ జులై 06:-** మొహారం పండుగను పురస్కరించుకుని అమిద్యాల గ్రామానికి చెందిన సాఫ్ట్వేర్ ఉద్యోగి రుషేంద్ర, ప్రశాంతి దంపతులు వెండితో తయారు చేయించిన 2కేజీల గుర్రం, శంకు-చక్రాలను పెద్ద వన్నూరు స్వామి, చిన్న వన్నూరు స్వామి పీర్లకు అందించారు. ఈ సందర్భంగా ఇంటి వద్ద నుండి మేళతాళాల మధ్య ఊరేగింపుగా గుర్రం, శంకు-చక్రాలను పీర్ల చావడి వరకు తీసుకొచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు అనంతరం వాటిని పీర్లకు అలంకరించారు. మొక్కును చెల్లించుకోవడంలో భాగంగా వీటిని ప్రత్యేకంగా తయారు చేయించినట్లు వారు తెలిపారు.

# డ్రైనేజీ కాలవల్లో చెత్తాచెదారాలను తొలగించాలి




**వేంపల్లె జూలై 06:-**వేంపల్లి పంచాయతీ పరిధిలోని డ్రైనేజీ కాలువల్లో చెత్తాచెదారాలను తొలగించాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.గత వారం రోజులుగా వేంపల్లి పట్టణంలోని మేదర వీధి,ఉర్దూ ప్రాథమిక పాఠశాల వద్ద,బాలిశెట్టి వీధి,బలిజ సంఘం వీధి,చైతన్య హై స్కూల్ వీధి,చౌడమ్మ ఆలయం వీధి,పప్పుల బజార్ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువల్లో చెత్తాచెదారాలు పేరుకుపోయి మురుగునీరు రోడ్లపైకి పారుతున్నాయి.చెత్తాచెదారాలు పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని అంటున్నారు.పిల్లలు వృద్దులు రోగాల పారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.స్థానిక ప్రజలు పలుమార్లు ఫిర్యాదు చేసిన పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు అంటున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ కాలవల్లో చెత్తాచెదారాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## హత్య కేసులో జీవితఖైదు.. ఆపై బెయిల్ అత్యాచారం కేసులో అరెస్ట్




**ఢిల్లీ** ఇప్పటికే ఒక హత్య కేసులో జీవితఖైదు పడిన వ్యక్తి బెయిల్‌పై బయటికి వచ్చి అత్యాచారం కేసులో అరెస్టయ్యాడు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. హర్యానా రాష్ట్రం ఝజ్జర్ జిల్లా బహదూర్‌గఢ్ మున్సిపాలిటీలోని పటేల నగర్‌ఏరియాకు చెందిన మన్‌జీత్ అలియాస్ మంజా 2009లో ఓ హత్య కేసులో అరెస్టయ్యాడు.అతడితోపాటు అరుణ్ దబాస్ అలియాస్ బిట్టు అనే వ్యక్తికి కూడా జీవితఖైదు పడింది. ఈ ఇద్దరూ కలిసి తమతో కలిసి నేరాలు చేసే మరో వ్యక్తిని హత్య చేశారు. ఈ కేసు విచారించిన చండీగఢ్ హైకోర్టు 2012లో నిందితులిద్దరినీ దోషులుగా తేల్చి జీవితఖైదు విధించింది. ఆ తర్వాత 2015లో మంజా బెయిల్‌పై బయటికి వచ్చాడు.ఇప్పటికే ఓ కేసులో శిక్ష అనుభవిస్తున్నా అతడు తన ప్రవర్తనను మార్చుకోలేదు. గత నెలలో ఢిల్లీలో ఓ మహిళపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలు జూన్ 11న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడి కోసం గాలింపుచేపట్టారు. అయితే 20 రోజులకుపైగా పోలీసుల కళ్లుగప్పి తప్పించుకున్న మంజా ఈ నెల 3న పట్టుబడ్డాడు.హర్యానాలోని తన స్వస్థలానికి నిందితుడు వచ్చినట్లు తెలుసుకున్న ఢిల్లీ పోలీసులు అక్కడికి వెళ్లి హర్యానా పోలీసుల సాయంతో అతడిని అరెస్ట్ చేశారు. ఈ విషయాన్ని ఆదివారం మీడియాకు వెల్లడించారు. నిందితుడిపై గతంలో ఉన్న పెండింగ్ కేసుల గురించి కూడా ఆరా తీస్తున్నామని తెలిపారు.

## రైలు పట్టాల మధ్యలో పడుకున్న బాలుడు, వేగంగా వెళ్లిన రైలు.




**భువనేశ్వర్:** రిస్కీ రీల్ కోసం ముగ్గురు బాలురు ప్రయత్నించారు. ఒక బాలుడు రైలు పట్టాల మధ్యలో పడుకున్నాడు. అతడి మీదుగా రైలు వేగంగా దూసుకెళ్లింది. ఆ తర్వాత అతడు పైకి లేచాడు. ఆ బాలురు సంబరపడ్డారు. వైరల్ అయిన ఈ వీడియో క్లిప్ పోలీసుల దృష్టికి వెళ్లింది. దీంతో ముగ్గురు బాలురను అదుపులోకి తీసుకున్నారు. ఒడిశాలోని బౌధ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ముగ్గురు బాలురు కలిసి వైరల్ రీల్ కోసం ప్రయత్నించారు. పురునపాణి రైల్వే స్టేషన్‌కు సమీపంలోని దాలుపలి సమీపంలో రైలు పట్టాల మధ్యలో ఒక బాలుడు పడుకున్నాడు. వేగంగా వచ్చిన రైలు ఆ పట్టాలపై దూసుకెళ్లింది. ఆ తర్వాత ఆ బాలుడు పైకి లేచాడు. ఈ రీల్ తీసిన వారంతా సంబరపడ్డారు.కాగా, ఈ వీడియో క్లిప్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా వైరల్ అయ్యింది. దీంతో పోలీసుల దృష్టికి వెళ్లింది. ఈ నేపథ్యంలో ఆ ముగ్గురు మైనర్ బాలురను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 'నేను పట్టాల మధ్యలో పడుకున్నా. రైలు వెళ్తున్నప్పుడు నా గుండె వేగంగా కొట్టుకున్నది. నేను బతుకుతానని ఊహించలేదు' అని ఆ బాలుడు చెప్పాడు. అయితే ప్రమాదకర స్టంట్లు చేయవద్దని యువతను పోలీసులు హెచ్చరించారు.

## జూలై 31నుండి వచ్చే నెల 14 వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ



**కంటోన్మెంట్, జూలై 6 :** యూనిట్ హెడ్ క్వార్టర్స్ కోటా కింద ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ జూలై 31 నుండి సెప్టెంబర్ 14 వరకు సికింద్రాబాద్‌లోని ఏఓసీ సెంటర్‌లోని జోగిందర్ సింగ్ స్టేడియం (ఎక్స్ థాపర్ స్టేడియం)లో అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ క్లర్క్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ 10వ తరగతి, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ 8వ తరగతి (హౌస్ కీపర్) కేటగిరీతో పాటు అత్యుత్తమ క్రీడాకారులు (ఓపెన్ కేటగిరీ) పోస్టుల నమోదు కోసం నియామక ర్యాలీ జరగనున్నట్లు అధికారులు తెలిపారు. అత్యుత్తమ క్రీడాకారులు (ఓపెన్ కేటగిరీ) జూలై 31న ఉదయం 6 గంటలలోపు జోగిందర్ సింగ్ స్టేడియంలో స్పోర్ట్స్ ట్రయల్స్ కోసం రిపోర్ట్ చేయాలని, ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్, స్విమ్మింగ్, డైవింగ్, వెయిట్ లిఫ్టింగ్‌తో సహా అథ్లెటిక్స్ రంగాలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించిన అత్యుత్తమ క్రీడాకారులు తమ సర్టిఫికెట్లతో పాటు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.అన్ని వర్గాలకు వయోపరిమితి 17½ నుండి 21 సంవత్సరాలు. అగ్నివీర్ జనరల్ డ్యూటీకి విద్యార్హత 10వ తరగతి, మెట్రిక్ ఉత్తీర్ణత మొత్తం 45 శాతం మార్కులతో ప్రతి సబ్జెక్టులో 33 శాతం మార్కులతో ఉత్తీర్ణతతో పాటు చెల్లుబాటు అయ్యే లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న అభ్యర్థులకు డ్రైవర్ అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని చెప్పారు. అగ్నివీర్ క్లర్క్ కోసం, పది, ఇంటర్మీడియట్ పరీక్షలో ఏదైనా స్ట్రీమ్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించడం, ప్రతి సబ్జెక్టులో కనీసం 50 శాతం మార్కులు సాధించడం తప్పనిసరి అన్నారు. మరిన్ని వివరాలకు అభ్యర్థులు సికింద్రాబాద్ ఈస్ట్ మారేడ్‌పల్లి, తిరుమలగిరిలోని ప్రధాన కార్యాలయ ఏఓసీ సెంటర్‌లో కానీ అధికారిక వెబ్‌సైట్‌ని సంప్రదించాలని అధికారులు సూచించారు.

## క్యాన్సర్ రోగి కుమార్తె స్నానం చేస్తుండగా రికార్డ్ చేసిన వ్యక్తి బ్లాక్‌మెయిల్ చేయడంతో అరెస్ట్



**లక్నో:** ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాన్సర్ కోసం చికిత్స పొందుతున్న తల్లి వెంట కుమార్తె ఉన్నది. అదే వార్డులో భార్య చికిత్స కోసం ఉన్న వ్యక్తి దారుణానికి పాల్పడ్డాడు. ఆ యువతి స్నానం చేస్తుండగా రికార్డ్ చేశాడు. వాటిని ఆమె ఫోన్‌కు పంపి బ్లాక్‌మెయిల్ చేశాడు. ఆ యువతి ఫిర్యాదుతో అతడ్ని అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ఈ సంఘటన జరిగింది. క్యాన్సర్‌తో బాధపడుతున్న ఒక మహిళ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నది. 20 ఏళ్ల కుమార్తె ఆమెకు సహాయంగా వార్డులో ఉన్నది.కాగా, ముజఫర్‌నగర్ చెందిన 22 ఏళ్ల వ్యక్తి భార్య క్షయ వ్యాధితో బాధపడుతున్నది. చికిత్స కోసం ఆ ప్రభుత్వ ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యింది. ఈ నేపథ్యంలో క్యాన్సర్ మహిళ ఉన్న వార్డులోకి ఆ వ్యక్తి వెళ్లాడు. ఆమె కుమార్తె స్నానం చేస్తున్నప్పుడు రహస్యంగా రికార్డ్ చేశాడు. ఆ యువతి మొబైల్ నంబర్ సేకరించి ఆ వీడియోలు పంపాడు. తన కోరిక తీర్చాలని బలవంతం చేశాడు. ఆమె నిరాకరించడంతో ఆ వీడియోలు పబ్లిక్‌గా లీక్ చేశాడు.మరోవైపు ఆ యువతికి ఈ విషయం తెలిసింది. దీంతో ఆ వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. శుక్రవారం అతడ్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.కాగా, గత నెలలో అదే ప్రభుత్వ ఆసుపత్రిలోని ఆర్థోపెడిక్ వార్డులో చికిత్స పొందుతున్న 13 ఏళ్ల బాలికపై అత్యాచారం జరిగింది. దీనిపై ఆసుపత్రి అధికారులు స్పందించారు. భవిష్యత్తులో ఇలాంటి నేరాలు నివారించేందుకు భద్రతా చర్యలను కఠినతరం చేస్తామని చెప్పారు. అయినప్పటికీ తాజాగా ఈ సంఘటన జరుగడం కలకలం రేపింది.

## సైబర్ మోసాలపై వయోవృద్ధులు అప్రమత్తంగా ఉండా

**సైదాబాద్, జూలై 6 :** సీనియర్ సిటిజన్స్‌ను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ పారా వాలంటీర్ పిట్టల సత్యనారాయణ రాజు అన్నారు. సైబర్ క్రైమ్స్‌పై ఆదివారం సైదాబాద్‌లో సీనియర్ సిటిజన్‌కు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ముసుగులో అపరిచిత వ్యక్తులు వీడియో కాల్స్ చేసి మిమ్మల్ని అరెస్ట్ చేస్తున్నామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. అదే విధంగా స్టాక్ ఎక్స్ఛేంజీలో పెట్టుబడుల పేరుతో స్టాక్, క్రిప్టో, ఫారెక్స్ వంటి పెట్టుబడి ద్వారా అతి తక్కువ కాలంలో అధిక లాభాలను పొందవచ్చంటూ, వాట్సాప్ డీపీ ద్వారా మీ ప్రొఫైల్ ఫోటోలను




తస్కరించి వాటిని దుర్వినియోగం పరచటం ద్వారా మీ పరిచయస్తుల నుంచి డబ్బులను పొందుతూ మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. బీమా పేరుతో ఆకర్షణీయమైన నకిలీ ఇన్సురెన్స్ ఏజెంట్ల ముసుగులో కీలకమైన, అతిసున్నితమైన మీ వ్యక్తిగత సమాచారాన్ని రాబట్టి మోసాలు చేస్తున్నారని, అలాగే పేరొందిన కంపెనీల కొరియర్ ఉద్యోగులుగా, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులుగా నటిస్తూ, మీ పార్సెల్స్‌లో డ్రగ్స్, మత్తు పదార్థాలు ఉన్నాయని బెదిరించి మీ నుంచి అందినంతగా దోచుకుంటున్నారని తెలిపారు.మరి ముఖ్యంగా పరిచయస్తులుగా నటిస్తూ మీకు పరిచయం ఉన్న వ్యక్తులను లక్ష్యంగా చేసుకొని డబ్బులు గుంజే మోసగాళ్లుగా ఎక్కువయ్యారని, మోసాళ్లలపై అవగాహన పెంచుకోవాలని, అపరిచిత వ్యక్తులకు ఎటువంటి వ్యక్తిగత సమాచారం ఇవ్వరాదని, మొబైల్ ఫోన్లలో వచ్చే ఆకర్షణీయమైన ప్రకటనలకు ఆకర్షితులు కావద్దని ఆయన సూచించారు. సైబర్ మోసాల బారిన పడితే, భయభ్రాంతులకు గురికాకుండా వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్ ఫోన్ చేసి, సైబర్ క్రైం పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మారెడ్డి, భరత్‌సింగ్, జగన్ మోహన్ రెడ్డి, బుచ్చిరెడ్డి, సత్యనారాయణ, ఉమాదేవి, స్నేహలత, నాగమణి, పద్మారెడ్డి పాల్గొన్నారు.

## హిమాచల్‌ప్రదేశ్‌లో కొనసాగుతున్న వర్షాలు.. 75కు పెరిగిన మరణాలు

**హిమాచల్ ప్రదేశ్** రాష్ట్రంలో వరుణ బీభత్సం ఇంకా కొనసాగుతోంది. మండి జిల్లాలో భారీ వర్షాల కారణంగా మరణించిన వారి సంఖ్య 75కు పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన రహదారులపై కొండచరియలు విరిగిపడటం, మెరుపు వరదలు, కుంభవృష్టితో పరిస్థితి దారుణంగా మారింది. చాలాచోట్ల సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 240 రహదారులపై రాకపోకలు కష్టంగా మారినట్లు అధికారులు వెల్లడించారు. వీటిల్లో ఒక్క మండి జిల్లాలోనే 176 మార్గాలున్నాయి. హిమాచల్‌ప్రదేశ్‌లో ఒక్కరోజులో 115–204 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 204 మిల్లీ మీటర్లు అంటే అతి తీవ్ర వర్షపాతం కిందకు వస్తుంది. హిమాచల్‌ప్రదేశ్‌లోని కంగ్రా, సిర్మూర్, మండి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే



ప్రమాదం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.రానున్న 24 గంటల్లో చంబా, కంగ్రా, మండి, శిమ్లా, సిర్మూర్ జిల్లాల్లో మెరుపు వరదలు రావొచ్చని ఐఎండీ హెచ్చరించింది. బిలాస్‌పుర్, హమీర్‌పూర్, చంబా, సిమ్లా, కులూ జిల్లాలో రెడ్ అలర్ట్ ప్రకటించారు. చాలా చోట్ల కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందన్నారు. బలహీనమైన నిర్మాణాల్లో ప్రజలను ఉండొద్దని హెచ్చరించారు. ఐటీబీపీ దళాలు సహాయ చర్యల్లో పాల్గొంటున్నాయి.దీనికితోడు బార్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ సాయం తీసుకోవాలని మాజీ ముఖ్యమంత్రి జైరామ్ ఠాకూర్ ప్రభుత్వానికి సూచించారు.

## ఆధ్యాత్మిక గురువు దలైలామాకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు

**టిబెటన్** ఆధ్యాత్మిక గురువు దలైలామాకు ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, సహనం, నైతిక క్రమశిక్షణకు దలైలామా చిహ్నమని అన్నారు. ఆధ్యాత్మిక గురువు, 14వ దలైలైమా 90వ పుట్టినరోజు సందర్భంగా మోదీ శనివారం తన సోషల్ మీడియా ప్లాట్ ఫాం ద్వారా శుభాకాంక్షలు తెలియజేశారు.కాగా దలైలామా 1935లో టిబెట్‌లోని టక్‌సెర్‌లో జన్మించారు. 1959లో టిబెట్‌ను చైనా ఆక్రమించిన తర్వాత భారత్‌లో ఆశ్రయం పొంది అప్పటి నుంచి ధర్మశాలలో నివసిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా శాంతి, అహింస, మానవతా విలువలను ప్రచారం చేయడంలో ఆయన విశేష కృషి చేస్తున్నారు. దలైలామా జన్మదినం సందర్భంగా మెక్లియోడ్ గంజ్‌లోని టిబెటన్లు ఆదివారం నుంచి వారం రోజులపాటు ఆయన జన్మదిన



వేడుకలను జరుప ుకుంటారు.దలైలామా జన్మదిన వేడుకల్లో భాగంగా మతపరమైన సమావేశం, యువజన వేదిక, చలనచిత్ర ప్రదర్శన, టిబెటన్ ఆధ్యాత్మిక గురువు దీర్ఘాయుష్షు కోసం ప్రార్థనలు లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇదిలావుంటే దలైలామా తన పుట్టినరోజు సందర్భంగా ప్రపంచానికి ఓ సందేశాన్ని అందించారు. మానవ విలువలు, మత సామరస్యాన్ని ప్రోత్సహించడంపై దృష్టి సారిస్తూనే ఉంటానని చెప్పారు.

## ఎట్టకేలకు బాహ్యప్రపంచంలోకి ఇరాన్ సుప్రీం లీడర్

**టెహ్రాన్:** ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ ఎట్టకేలకు బాహ్య ప్రపంచంలోకి వచ్చారు. రాజధాని టెహ్రాన్‌లో జరిగి ఒక మతపరమైన కార్యక్రమంలో పాల్గొన్నారు. షియా ముస్లిం క్యాలెండర్‌లో అతి ముఖ్యమైన రోజు అయిన అషురా(మొహర్రం)ను జరుపుకుంటున్న హాలులోకి ఖమేనీ ప్రవేశించారు. దీనికి సంబంధించిన వీడియోలను ఇరాన్ స్టేట్ టీవీ ప్రసారం చేసింది. సాంప్రదాయ నల్లని వస్త్రాలు ధరించిన ఆయన ప్రజల హర్షధ్వానాల మధ్య, అందరినీ పలకరిస్తూ అందులో కనిపించారు. ప్రతి ఏడాది ఖమేనీ ఈ కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొంటారు. కాగా, ఇరాన్–ఇజ్రాయెల్ ముగిసిన తర్వాత ఆయన బహిరంగంగా కనిపించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఆయనను చూసి జనాలు పెద్దపెట్టున నినాదాలు చేశారు.ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య 12 రోజులపాటు సాగిన యుద్ధం జూన్ 24న ముగిసింది. ఇదరు దేశాలు కాల్పుల విరమణ ఒప్పందం కుర్చుకోవడంతో యుద్ధానికి తెరపడింది. అయితే



ఖమేనీ మాత్రం ఇప్పటి వరకూ బాహ్య ప్రపంచానికి కనిపించకపోవడం చర్చనీయా ంశంగా మారింది. ఇజ్రాయెల్ దాడులు తీవ్రతరం కావడంతో ఖమేనీ సురక్షితమైన బంకర్‌లోకి వెళ్లినట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. తన ఫ్యామిలీతో కలిసి అత్యంత సురక్షితమైన బంకర్‌లో ఖమేనీ తలదాచు కుంటున్నట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. అయితే, కాల్పుల విరమణ అమల్లోకి వచ్చి.. యుద్ధం ముగిసినప్పటికీ ఆయన బాహ్య ప్రపంచానికి కనిపించకపోవడం పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో 'ఖమేనీ ఎక్కడ..?' అంటూ ఇరాన్ ప్రజలు, నేతల్లో ఆందోళన వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో వీడియో ద్వారా దేశ ప్రజలకు సందేశం ఇచ్చారు.

## ఈసీఐ ఓటర్ల జాబితా సమీక్షపై సుప్రీంకోర్టుకు మహువా మొయిత్రా

**న్యూఢిల్లీ:** కేంద్ర ఎన్నికల కమిషన్ బీహార్ లో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సమీక్ష ను తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొసవాలు చేశారు. సుప్రీంకోర్టు లో పిటిషన్ వేశారు. బీహార్‌లో చివరిసారిగా 2003లో ఎస్‌ఐఆర్ నిర్వహించారు. ఈసీఐ బీహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సమీక్ష అమలును తక్షణం ఆపివేయాలని, ఇతర రాష్ట్రాల్లోనూ ఈసీఐ ఇలాంటి ఆదేశాలు ఇవ్వకుండా సుప్రీంకోర్టు ఆదేశించాలని మహువా మొయిత్రా తన పిటిషన్‌లో అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు. ఈసీఐ ఆదేశం పక్షపాతంతో కూడుకున్నదని, రాజ్యాంగవిరుద్ధమని, పేదలు, మహిళలు, వలస ఓటర్లను ఓటింగ్ ప్రక్రియ నుంచి మినహాయించేందుకు ఉద్దేశించినదని ఆమె పేర్కొన్నారు.కాగా, దీనికి ముందు ఎస్‌ఐఆర్ కోసం ఈసీఐ ఇచ్చిన ఆదేశాలను అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఇందువల్ల లక్షలాది మంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోతారని తెలిపింది. ఎన్నికలు మరో మూడు, నాలుగు నెలల్లో ఉండగా



తక్కువ సమయంలో మరోసారి విస్తృత సమీక్ష జరపాలంటూ ఈసీఐ ఆదేశాలు ఇచ్చిందని, ఇందుకు ఎలాంటి కారణాలు లేవని పేర్కొంది. తన పౌరసత్వం గురించి మాత్రమే కాకుండా తన తల్లిదండ్రుల పౌరసత్వాన్ని కూడా పత్రాల ద్వారా నిరూపించాల్సి ఉంటుందని, లేకపోతే ఓటరు పేరును జాబితా నుంచి తొలగిస్తారని తెలిపింది. ఆ ప్రకారం ఎస్సీ, ఎస్టీ, వలస కార్మికులు మూడు కోట్ల మంది ఓటు హక్కు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేసింది.ఈసీఐ ఏమంటోంది?బీహార్‌లో అనర్హత కలిగిన ఓటర్లను తొలగించి, అర్హులైన వారిని జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక విస్తృత సమీక్ష జరపాలని జూన్ 24న ఎన్నికల కమిషన్ ఆదేశాలిచ్చింది. శ్రీఘ్రగతిని అర్బనైజేషన్ చోటుచేసుకోవడం, తరచు జరుగుతున్న వలసలు, కొత్తగా అర్హులైన యువ ఓటర్లు, మరణాల వివరాలు రిపోర్ట్ చేయకపోవడం, అక్రమ విదేశీ వలసదారుల పేర్లు చేర్చడం వంటి కారణాలను ఈసీ ప్రస్తావించింది. ఎన్నికల జాబితా సమగ్రత, కచ్చితత్వం కోసం ఈ సమీక్ష అవసరమని తెలిపింది. ఓటర్ వెరిఫికేషన్ కోసం బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తారని తెలిపింది.

## ఇద్దరు యువకుల మధ్య స్వలింగ సంపర్క సంబంధం

**ముంబై:** ఇద్దరు యువకుల మధ్య స్వలింగ సంపర్క సంబంధం ఉన్నది. ఆ యువకుడికి దూరంగా ఉంచేందుకు మైనర్ బాలుడి కుటుంబం ప్రయత్నించింది. కలత చెందిన యువకుడు కూల్ డ్రింక్‌లో విషం కలిపి ఆ బాలుడ్ని హత్య చేశాడు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. 19 ఏళ్ల యువకుడు, 16 ఏళ్ల బాలుడి మధ్య స్వలింగ సంపర్క సంబంధం ఏర్పడింది. నాలుగు నెలల కిందట వారిద్దరూ నాగ్‌పూర్ వెళ్లి గడిపారు. ఈ విషయం తెలిసిన మైనర్ బాలుడి కుటుంబం అతడ్ని కట్టడి చేశారు. సంబంధం ఉన్న యువకుడిని కలవవద్దని, మాట్లాడవద్దని చెప్పారు.కాగా, తనకు దూరంగా ఉండటంపై కలత చెందిన యువకుడు ఆ బాలుడ్ని హత్య చేయాలని ప్లాన్ చేశాడు. జూన్ 29న తన వద్దకు రప్పించాడు. కూల్ డ్రింక్‌లో విషం కలిపి ఇచ్చాడు. అది తాగిన బాలుడు వాంతి చేసుకున్నాడు.దూరంగా ఉండటంపై ఆ తర్వాత అక్కడి బెడ్‌పై మరణించాడు.మరోవైపు కుమారుడు కనిపించక పోవడంతో బాలుడి కోసం తండ్రి వెతికాడు. ఆ యువకుడి వద్దకు వెళ్లినట్లు బాలుడి ఫ్రెండ్ చెప్పాడు. దీంతో బాలుడి కుటుంబ సభ్యులు ఆ యువకుడి ఇంటికి చేరుకున్నారు. బెడ్‌పై అచేతనంగా పడి ఉన్న కుమారుడ్ని చూశారు. ఆ పక్కనే ఆ యువకుడు కూడా కూర్చొని ఉన్నాడు.కాగా, డాక్టర్‌ను పిలిపించగా ఆ బాలుడు మరణించినట్లు




నిర్ధారిం చారు. దీంతో అతడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాలుడి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్వలింగ సంపర్క సంబంధానికి దూరంగా ఉన్నందుకు బాలుడ్ని ఆ యువకుడు హత్య చేశాడన్న ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## తాటి చెట్లను తొలగించవద్దంటూ
# గీత కార్మికుల ఆందోళన



**పోచారం, జూలై 6 :** వెంచర్ అభివృద్ధి పేరిట గీత కార్మికులకు ఉపాధినిచ్చే తాటి చెట్లను తొలగించి ఉపాధిని దూరం చేయవద్దని పోచారం మున్సిపాలిటీ కొర్రెముల గౌడ సంఘం నాయకులు, గీత కార్మికులు ఆదివారం ఆందోళనకు దిగారు. సర్వే నంబర్ 311,312,313,324,324,326పి,327లలో దాదాపు 12 ఎకరాల విస్తీర్ణంలో వెంచర్‌ను ఏర్పాటు చేస్తున్నారు.ఈ సందర్భంగా ఈ భూమిలోని 85 తాటి చెట్లను ఎలాంటి సమాచారం లేకుండా వెంచర్ నిర్వాహకులు తొలగించడంతో దాదాపు రెండు వందల మంది గౌడ సంఘం సభ్యులు వెంచర్‌లో దీక్ష చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గౌడ సంఘం నాయకుడు పంజాల జైహింద్ గౌడ్ పాల్గొని మద్దతు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొర్రెముల కల్లు గీత కార్మిక సంఘం అధ్యక్షుడు సుదర్శన్, ఉపాధ్యక్షుడు బుర్ర వెంకటేశం, మాజీ సర్పంచ్ బైరు రాములు గౌడ్, నాయకులు పల్లె బాబురావు, అనిల్ గౌడ్, బైరు పాండు గౌడ్, కట్ట ఆంజనేయులు గౌడ్, దేశగోని బాల్‌రాజ్ గౌడ్ గీత కార్మికులు పాల్గొన్నారు.

## బీజేపీ కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి : యూఎస్ఎఫ్ఐ నాయకులు




**అల్వాల్ జూలై 6 :** కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మికులు, కర్షకులకు వ్యతిరేకంగా ప్రవేశ పెట్టిన చట్టాలను రద్దు చేయాలని యూఎస్ ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి బ్యాగరి వెంకటేష్ అన్నారు. ఈ నెల 9న అఖిల భారత కార్మిక సంఘాల సమ్మెను జయప్రదం చే యాలని ఆదివారం అల్వాల్ పట్టణ కేంద్రంలోని యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నారాయణ కళాశాలలో కరపత్రాలను విడుదల చేయడం జరిగిందిఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి అందరిని ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తూ 29 కార్మిక చట్టాలను కుదించిందన్నారు.నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైందని వెంటనే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని యూఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు.

# నాలాపై అక్రమ పార్కింగ్ పట్టించుకోని అధికారులు



**అంబర్‌పేట, జూలై 6 :** అంబర్‌పేట మండల కార్యాలయం నుంచి పటేల్‌నగర్ చౌరస్తా వరకు రోడ్డుకు ఎడమవైపున అక్రమ పార్కింగ్‌తో స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎవరుపడితే వారు ఇష్టారాజ్యంగా కార్లను, ఇతర వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో పెద్ద వాహనం ఏదైనా వస్తే మిగతా చిన్న చిన్న వాహనాలు పోవడానికి ఇబ్బంది ఎదురవుతోంది. ఇటీవలనే ఈ వాహనాల పార్కింగ్ ఎక్కువైందని స్థానికులు వాపోతున్నారు. అంబర్‌పేట మండల కార్యాలయం నుంచి సీపీఎల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వరకు ఇంతకుముందు ఎవరు కూడా పార్కింగ్ చేసేవారు కాదని, ఇప్పుడు అక్రమంగా కార్లను పార్కింగ్ చేస్తున్నారని అంటున్నారు. రద్దీ ఎక్కువగా ఉండే ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అలాగే పటేల్‌నగర్ చౌరస్తా వరకు కూడా కార్లను, ఇతర వాహనాలను ఇష్టం వచ్చినట్లు నిలుపుతున్నారని చెప్పారు. ఇక్కడ కూడా పార్కింగ్ సమస్య తలెత్తుతుందని తెలిపారు. వరదనీరు సాఫీగా వెళ్లేందుకు బాపూనగర్ నుంచి పటేల్‌నగర్ మీదుగా ప్రేమ్‌నగర్ గ్రీన్‌లాండ్ హోటల్ వరకు నాలాను గతంలో విస్తరించారు. దానిపై స్లాబు వేశారు. అది ట్రాఫిక్ లేకుండా వాహనాలు వెళ్లడానికి ఉపయోగపడుతుందని అధికారులు భావించారు. కానీ ఆ విస్తరించిన నాలా స్లాబుపై ఇప్పుడు కార్లు పార్కింగ్ చేస్తుండడంతో ఇక్కడ నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. దీనికి తోడు వారంలో రెండు రోజులు ఇక్కడ వారం వారం సంత నిర్వహిస్తుండడంతో ప్రజలు ఇంకా ఇబ్బందులు పడుతున్నారు. పటేల్‌నగర్, ప్రేమ్‌నగర్, నరేంద్రనగర్, అహ్మద్‌నగర్, న్యూపటేల్‌నగర్, చెన్నారెడ్డినగర్, న్యూప్రేమ్ నగర్, బాపూనగర్ తదితర ప్రాంతాల నుంచి ప్రజలు ఎక్కువ శాతం ఇదే రహదారి ద్వారా ప్రయాణం సాగిస్తుంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని, ట్రాఫిక్ సమస్య లేకుండా ఉండేందుకు సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయా బస్తీల ప్రజలు కోరుతున్నారు. ప్రధానంగా ట్రాఫిక్ పోలీసులు ఈ సమస్యపై దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## బొల్లారంలో అనుమానాస్పద సమాధి



**హైదరాబాద్ బొల్లారం** పోలీస్ స్టేషన్ పరిధిలో నరబలి ఇచ్చారనే ప్రచారం తీవ్ర కలకలం రేపింది. స్థానిక బజార్‌లోని గుట్టల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి క్షుద్ర పూజలు చేసి ఓ చిన్నారిని నరబలి ఇచ్చి పూడ్చివేశాడంటూ మూడు రోజుల క్రితం స్థానికంగా ప్రచారం మొదలైంది. దీంతో స్థానికుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు.. నిఘా పెట్టి అనుమానాస్పదంగా ఉన్న సమాధిని తవ్వి చూశారు. గాంధీ ఆసుపత్రి ఫోరెన్సిక్ వైద్యుల సహకారంతో సమాధిని తవ్వ చూడగా.. అందులో కనిపించింది చూసి షాక్ అయ్యారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక గుట్టల ప్రాంతంలో ఓ సమాధి వద్ద ఐస్‌క్రీం, పూలు చల్లి ఉండటాన్ని గమనించిన స్థానికులు అక్కడ క్షుద్ర పూజలు జరిగినట్లు అనుమానించారు. ఈ ప్రచారం పోలీసుల దృష్టికి రావడంతో బొల్లారం పోలీసులు అప్రమత్తమయ్యారు. నిజంగానే నరబలి జరిగిందా? లేదా? అని నిర్ధారించుకోవడానికి పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. సమాధి వద్దకు ఎవరైనా వస్తున్నారా? అనే దానిపై మఫ్టీలో నిఘా పెట్టారు. రెండు, మూడు రోజులు నిఘా ఉంచినా ఎవరూ రాకపోవటంతో నరబలి ప్రచారం తీవ్రం కావడంతో గాంధీ ఆసుపత్రి ఫోరెన్సిక్ వైద్యులను సంప్రదించారు.సమాధిని తవ్వేందుకు సిద్ధపడి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫోరెన్సిక్ బృందం సహకారంతో పోలీసులు ఆ సమాధిని తవ్వారు. అయితే అందరినీ ఆశ్చర్యపరుస్తూ.. అందులో నుంచి ఓ కుక్క శవం బయటపడింది. దీంతో పోలీసులు, స్థానికులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. చిన్నారిని బలి ఇచ్చారనే ప్రచారం అబద్ధం కావటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసుల తదుపరి విచారణలో ఆ కుక్క స్థానికంగా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహించే సుమన్ అనే వ్యక్తిదని తేలిందిఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా.. తన పెంపుడు కుక్క చనిపోవడంతో దాన్ని అక్కడ పూడ్చిపెట్టినట్లు చెప్పారు. దానిపై ఉన్న ప్రేమతో ఐస్‌క్రీం, పూలు చల్లి శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించినట్లు చెప్పారు. దీంతో నరబలి ప్రచారానికి తెరపడింది. ఈ ఘటనతో బొల్లారంలో నెలకొన్న ఉత్కంఠకు తెరపడగా.. వదంతులు ఎంత ప్రమాదకరంగా ఉంటాయో మరోసారి రుజువైంది.

## సిగాచి ఇండస్ట్రీస్ పేలుడు ఘటనలో 41కి చేరిన మృతులు
# ఇంకా దొరకని 9 మంది ఆచూకీ



**సంగారెడ్డి:** పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి ఇండస్ట్రీస్ (%బాఅన్త్రుఎష్ట్రఅ ×అఎబరీతీఅవం%) పేలుడు ఘటనలో మరొకరు చనిపోయారు. పటాన్‌చెరు ధృవ దవాఖానలో చికిత్స పొందుతున్న జితేందర్ అనే కార్మికుడు మృతిచెందారు. దీంతో మృతుల సంఖ్య 41కి చేరింది. ఈ ఘటనలో మరో తొమ్మిది మంది ఆచూకీ తెలియాల్సి ఉన్నది. పేలుడు ధాటికి కార్మికుల శరీర భాగాలు ఛిద్రమవై పరిశ్రమలోని యంత్రాలకు అతుక్కుపోయాయి. దీంతో తమవారి ఆచూకీ కోసం కార్మికుల కుటుంబ సభ్యులు సిగాచీ ఇండస్ట్రీస్ వద్ద పడిగాలు గాస్తున్నారు. ప్రమాదం సంభవించి ఏడు రోజులైనా కార్మికులను గుర్తించడంలో ఎలాంటి పురోగతి లేదంటూ కార్మిక సంఘాలు ఆందోళనకు దిగాయి. ప్రమాద స్థలాన్ని పరిశీలించడానికి వెళ్తున్న కార్మిక సంఘాల నాయకులను పోలీసులు అడ్డుకున్నారుకాగా, సిగాచి పరిశ్రమ పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడి ధృవ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న 9 మందిలో ఇప్పటికే ముగ్గురు మృతిచెందారు. మిగిలిన ఆరుగురిలో ముగ్గురు 40 నుంచి 80 శాతానికిపైగా కాలిన గాయాలతో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. అయితే శు క్రవారం భీం రావు అనే కార్మికుడు మృతిచెందగా, శనివారం మరో కార్మికుడు మున్‌మున్ చౌదరి చనిపోయారు. తాజాగా మరో కార్మికుడు మరణించడంతో మరణాల సంఖ్య 41కి పెరిగింది.

# వనమహోత్సవం పేరుతో వ్యవసాయ వర్సిటీలో బీభత్సం



**వ్యవసాయ యూనివర్సిటీ, జూలై 06:** హెచ్‌సీయూ కంచగచ్చి బౌలి తరహా ఘటన రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీలో )లో చోటుచేసుకున్నది. వనమహోత్సవం పేరుతో జేసీబీలతో భారీ వృక్షాలను ప్రభుత్వ తొలగిస్తున్నది. శనివారం అర్ధరాత్రి సుమారు 20 జేసీబీలు, ప్రొక్లైనర్లతో వర్సిటీకి చేరుకున్న అధికారులు విలువైన చెట్లు, సహజసిద్ధంగా పెరిగిన అటవీ సంపదను భూస్థాపితం చేస్తున్నారు. సోమవారం సీఎం రేవంత్ రెడ్డి వన మహోత్సవం సందర్భంగా ఈ ప్రాంతంలో మొక్కలు నాటేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. రాత్రికి రాత్రి జేసీబీ, హిటాచీ వంటి భారీ యంత్రాలతో ఆ ప్రాంతంలోని మొక్కలను చెట్లను నేలమట్టం చేశారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు శనివారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో అడ్డుకోవడానికి ప్రయత్నించారు. దీంతో సెక్యూరిటీ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. భారీగా అక్కడికి చేరుకున్న పోలీసులు విద్యార్థులను చెదరగొట్టారు. వారిని హాస్టల్ గదుల్లో నిర్బంధించారు.క్యాంపస్‌లో భారీగా పోలీసులు మోహరించడంతో ఆ ప్రాంతమంతా నిషేధ ప్రాంతంగా తలపిస్తుంది. విద్యార్థులు వస్తే వారిపై అక్రమ కేసులు పెట్టడానికైనా సిద్ధమేనని పోలీసులు హెచ్చరించినట్లు సమాచారం. తొలగించిన చెట్లను ఎప్పటికప్పుడు లారీలు, ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. సంబంధిత అధికా రులు మాత్రం విలువైన మొక్కలు కాకుండా బ్యాంబూ వంటి మొక్కలను తొలగించి ఆ ప్రాంతంలో వన మహోత్సవ కార్య కమం చేపడుతున్నామని వివరణ ఇచ్చారు. కాగా, ఇప్పటికే హైకోర్టు నిర్మాణానికి వర్సిటీకి చెందిన 100 ఎకరాల భూమిని తీసుకున్న ప్రభుత్వం తాజాగా, వనమహోత్సవం అంటూ ఉన్న చెట్లను నరికివేస్తూ 20 ఎకరాలను చదును చేస్తుండటంపై సర్వ తా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం జరుగనున్న సీఎం కార్యక్రమాన్ని అడ్డుకుంటామని విద్యార్థి సంఘాల నేతలు హెచ్చరించారు.

# ఆప్షనల్ హాలీ డేస్ టీచర్లకే స్కూల్ మొత్తానికి కాదు



**విజయవాడ** ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు ఎవరైనా మూడు రోజులకు మించి స్కూల్‌కు రాకపోతే వెంటనే తల్లిదండ్రులకు ఫోన్ చేసి, వివరాలు తెలుసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు విజయవాడలో జిల్లా విద్యాధికారులు, అదనపు ప్రాజెక్టు సమన్వయకర్తలు, అకడమిక్ పర్యవేక్షణ అధికారులతో శనివారం జరిగిన సమావేశంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ప్రకటన చేశారు.ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలని విజయరామరాజు సూచించారు. ఎంఈ వోలు, సీఆర్పీలు, డీఈవోలు, ఏపీసీలు పాఠశాలలను క్రమం తప్పకుండా పరిశీలించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు ఎవరైనా సెలవు పెడితే ప్రత్యామ్నాయాలు ఏర్పాటు చేయాలన్నారు. సెలవులు పెట్టకుండా విధులకు గైర్హాజరయ్యే వారి జాబితాను రూపొందించి చర్యలు తీసుకోవాలని సూచించారు. పదో తరగతిలో తక్కువ ఫలితాలు వచ్చిన సబ్జెక్టు టీచర్లకు శిక్షణ ఇవ్వాలన్నారు.ఆప్షనల్ హాలీ డేస్ టీచర్లకే.. స్కూల్ మొత్తానికి కాదు!ప్రభుత్వం ఇచ్చే ఆప్షనల్ హాలీడేస్ కేవలం ఉపాధ్యాయులకు మాత్రమే వర్తిస్తాయని విజయరామరాజు తెలిపారు. ఇవి పాఠశాల మొత్తానికి సెలవులు ఇచ్చేందుకు కాదని ఆయన స్పష్టం చేశారు. ఎవరైనా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ప్రైవేటు బడుల్లో కనిపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## తొలి ఏకాదశి స్పెషల్.. కల్యాణ రామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయ అర్చకులు రామకృష్ణ చార్యులు ఆధ్వర్యంలో ఆలయం లో

**గుమ్మడిదల, జూలై 6 :** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కల్యాణ రామ చంద్రస్వామి దేవాలయంలో లక్ష తులసీ దళాలతో అర్చనను వైభవంగా నిర్వహించారు. ఆదివారం గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీదేవి భూదేవి మేత కల్యాణ రామచంద్రస్వామి దేవాలయంలోని ఆలయ వంశ పారంపర్యకులు కేవీ నర్సింహాచార్యులు, కేవీ రంగనాథచార్యులు, అచ్చుతాచార్యుల ఆధ్వర్యంలో తొలి ఏకాదశి పూజలను నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తులు సామూహికంగా లక్ష తులసి దళాలతో అర్చనలు చేశారు. అనంతరం వచ్చిన భక్తులు కల్యాణ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మద్దుల బాల్‌రెడ్డి, ధర్మకర్తలు, మున్సిపాలిటీ భక్తులు పాల్గొన్నారు.నేత్ర పర్వంగా తొలి ఏకాదశి..తొగుట : తొలి ఏకాదశి పర్వదినంను పురస్కరించుకొని మండలంలోని వెంకట్రావుపేట వేణుగోపాల స్వామి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది.. ఆలయ కమిటీ చైర్మన్ రాయరావు అరుణదిరఘుపతి రావు, శ్రీ వేణుగోపాల స్వామి వారికి ప్రత్యేక అర్చన, తులసి అభిషేకం, ప్రత్యేక పూజాది కార్యక్రమం లు నిర్వహించారు. శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయములో తొలి ఏకాదశి సందర్భముగా సహకరించిన గ్రామ ప్రజలకు ధన్యవాదములు తెలుపుకుంటూ గ్రామము దిన దిన అభివృద్ధిచెందాలని మన వేణుగోపాల్ స్వామి కృపా కటాక్షాలు అందరిమీదా ఉండాలని స్వామి వారి మంగళ శాసనములు తెలియజేశారు.తొలి ఏకాదశి సందర్భంగా గ్రామంలో పూర్తి స్థాయిలో ప్రజలు భక్తి శ్రద్ధలతో శాఖాహారం తీసుకున్న ందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు..తొగుట ఏ ఎస్ ఐ జీడిపల్లి రాంరెడ్డి ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు ..అలాగే గ్రామంలోని దళిత గోవిందం వెంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు..

# ప్రారంభమైన రొట్టెల పండుగ బారాషహీద్ దర్గాకు భారీగా తరలివస్తున్న భక్తం జనం



**నెల్లూరు** నెల్లూరులోని ప్రసిద్ధ బారాషహీద్ దర్గా వద్ద ఏటా జరిగే రొట్టెల పండుగ నేడు అత్యంత వైభవంగా ప్రారంభమైంది. సోమవారం గంధ మహోత్సవం , మంగళవారం రొట్టెల పండగ జరగనుంది. బారాషహీదుల సమాధులను దర్శించుకుని స్వర్ణాల చెరువులో రొట్టెలు మార్చుకుంటే కోరిన కోర్కెలు తీరుతారని భక్తులు విశ్వసిస్తారు.తమ కోరికలు నెరవేరాలని ఆశిస్తూ భక్తులు స్వర్ణాల చెరువులో రొట్టెలు మార్చుకునే ఈ విశిష్టమైన ఉత్సవంలో పాల్గొనేందుకు దేశ, విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. దీంతో దర్గా ప్రాంగణం, స్వర్ణాల చెరువు పరిసరాలు భక్తజన సంద్రంగా మారాయి.ఐదు రోజుల పాటు సాగే ఈ ఉత్సవాల కోసం భక్తులు భారీగా చేరుకుంటున్నారు. తమ మనసులోని కోరిక నెరవేరాలని ఆశిస్తూ, గతంలో కోరిక తీరిన వారి నుంచి రొట్టెను స్వీకరించడం, తమ కోరిక తీరితే ఇతరులకు రొట్టెను ఇవ్వడం ఈ పండుగలోని ప్రధాన ఆచారం. దీని కోసం భక్తులు స్వర్ణాల చెరువులో పుణ్యస్నానాలు ఆచరించి, భక్తిశ్రద్ధలతో రొట్టెలను మార్చుకుంటున్నారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రాంగణంలో ప్రత్యేక టెంట్లు, తాగునీటి సౌకర్యం, ఉచిత భోజన వసతి కల్పించింది. జిల్లా కలెక్టర్, ఎస్పీ సహా ఉన్నతాధికారులు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, పండుగ ప్రశాంతంగా జరిగేలా పర్యవేక్షిస్తున్నారు. భక్తుల రాకతో దర్గా పరిసర ప్రాంతాల్లో పూర్తి పండుగ వాతావరణం నెలకొంది.15 లక్షల మంది భక్తులు రావచ్చని అంచనారొట్టెలు పట్టుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు పండగకు తరలివస్తారు. లక్షల సంఖ్యలో వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అధికార యంత్రాంగం ఏర్పాటు చేసింది. దర్గా ఆవరణలో షెల్టర్లు, క్యూ లైన్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానపు గదులు, వైద్య శిబిరాలతో పాట, తాగునీటి వసతి ఏర్పాటు చేశారు.దర్గాకు వచ్చే రహదారులన్నీ రద్దీగా ఉండటంతో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. పండగకు రెండు రోజుల ముందు నుంచే వస్తున్న భక్తులు బారాషహీద్‌లను దర్శించుకుని స్వర్ణాల చెరువులో కోర్కెల రొట్టెలను మార్చుకుంటారు. రొట్టెల పండగ ఏర్పాట్లు బాగున్నాయని భక్తులు ప్రశంసిస్తున్నారు.రొట్టెల పండగ ఏర్పాట్లను మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిలు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సోమవారం నెల్లూరుకు రానున్న మంత్రి నారా లోకేశ్? దర్గాను సందర్శించనున్నారు.రొట్టెల పండుగ ప్రాముఖ్యం రొట్టెల పండగ మత సామరస్యానికి ప్రతిబింబం. మొహర్రం నెలలో నెలవంక కనిపించిన 11వ రోజు నుంచి బారాషహీద్ దర్గా వేదికగా 5 రోజుల పాటు రొట్టెల పండగ జరుపుకుంటారు. 40 ఏళ్ల కిందట ఒక్క రోజు మాత్రమే జరిగే ఈ పండగ భక్తుల రద్దీ దృష్ట్యా ప్రస్తుతం 5 రోజుల పాటు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం దీనిని రాష్ట్ర పండగగా ప్రకటించి ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఏడాది రొట్టెల పండగ ఆదివారం ప్రారంభం కానుండగా, ఇప్పటికే యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది6 నుంచి 10వ తేదీ వరకు ఉత్సవాలు:బారాషహీద్‌ల త్యాగనిరతిని స్మరిస్తూ ప్రతి సంవత్సరం గంధ మహోత్సవం, రొట్టెల పండగ జరుగుతాయి. నెలవంక కనిపించిన 10వ రోజు సొందల్ మాలి, 11వ రోజు గంధం, 12వ రోజు రొట్టెల పండగ, 13వ రోజు తహలీల్ ఫాతెహాఖాని, 14వ రోజు పండగ ముగింపు ఉత్సవాన్ని జరుపుతారు. ఈ మేరకు జులై 6వ తేదీ నుంచి 10 వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయి.బియ్యం, ఆకుకూరతో రొట్టెల పండగ:పూర్వపు రోజుల్లో ఆకుకూర, బియ్యంతో రొట్టెల పండగ జరుపుకునేవారు. ప్రస్తుతం గోధుమ రొట్టెలు, బెల్లంతో దీనిని నిర్వహిస్తున్నారు. సుమారు 15 లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. దర్గా పక్కనున్న స్వర్ణాల చెరువులో భక్తితో స్నానమాచరించి, కోరికల రొట్టెను భక్తులు పట్టుకుంటారు. తరువాత బారాషహీదులను దర్శించుకుంటారు. కోరికలు తీరిన మరుసటి సంవత్సరం అదే రొట్టెను తీసుకొచ్చి వదులుతారు.

తెలంగాణ తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం
సోమవారం,
07 జులై 2025



## డబుల్ సెంచరీ కొట్టి తీరుతా ఇంగ్లండ్‌కు సూర్యవంశీ వార్నింగ్




14 ఏళ్ల వయసులోనే స్టార్‌డమ్ సంపాదించాడు వైభవ్ సూర్యవంశీ. అండర్-19లో ఆడుతూ వెలుగులోకి వచ్చిన ఈ యువ బ్యాటర్.. ఐపీఎల్-2025తో ఓవర్‌నైట్ స్టార్‌గా అవతరించాడు. క్యాష్ రిచ్ లీగ్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున బరిలోకి దిగిన సూర్యవంశీ.. 7 ఇన్నింగ్స్‌ల్లో కలిపి 252 పరుగులు చేశాడు. ఎదుర్కొన్న తొలి బంతినే సిక్స్ కొట్టాడు. 35 బంతుల్లోనే సెంచరీ బాది పాత రికార్డులకు పాతర వేశాడు. అక్కడితో ఆగని వైభవ్.. ఇంగ్లండ్ టూర్‌లో భారత అండర్-19 జట్టుకు ఆడుతూ 52 బంతుల్లోనే మెరుపు శతకం బాదాడు. 10 ఫోర్లు, 7 సిక్సులు బాదిన సూర్యవంశీ.. 78 బంతుల్లో 143 పరుగులతో విధ్వంసం సృష్టించాడు. అలాంటోడు ప్రత్యర్థులకు మరోమారు హెచ్చరికలు జారీ చేశాడు. ఇంతకీ వైభవ్ ఏమన్నాడంటే..గిల్ స్ఫూర్తితో ..యూత్ వన్డే క్రికెట్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ కొట్టిన ప్లేయర్‌గా నిలవడంపై వైభవ్ సూర్యవంశీ స్పందించాడు. రికార్డు సృష్టించినట్లు తనకు తెలియదని అన్నాడు. 'నేను రికార్డు సృష్టించాననే విషయం నాకే తెలియదు. 100 మార్క్‌ను అందుకున్నాక మా టీమ్ మేనేజర్ అంకిత్ ఈ విషయం చెప్పారు. నెక్స్ట్ మ్యాచ్‌లో డబుల్ సెంచరీ కొట్టాలని అనుకుంటున్నా. తప్పకుండా 50 ఓవర్లు బ్యాటింగ్ చేసి 200 మార్క్‌ను అందుకోవాలని భావిస్తున్నా. నేను ఎంత ఎక్కువగా పరుగులు చేస్తే అది టీమ్‌కు అంత మంచి చేస్తుంది' అని వైభవ్ సూర్యవంశీ చెప్పుకొచ్చాడు. టీమిండియా కెప్టెన్ శుబ్‌మన్ గిల్ తనకు స్ఫూర్తి అని పేర్కొన్నాడు. ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌లో గిల్ బ్యాటింగ్ అదిరిపోయిందని, అతడిలా భారీ ఇన్నింగ్స్‌లు ఆడాలని అనుకుంటున్నానని తెలిపాడు. మరింత నిబద్ధత, క్రమశిక్షణతో బ్యాటింగ్ చేయాలని భావిస్తున్నానని వ్యాఖ్యానించాడు.

## మేమేం పిచ్చోళ్లం కాదు.. ఇంగ్లండ్ కోచ్ షాకింగ్ కామెంట్స్



బజ్‌బాల్ క్రికెట్‌తో ప్రత్యర్థులను భయపెడుతూ వస్తోంది ఇంగ్లండ్. టెస్టులను టీ20లు మార్చేసిన స్టోక్స్ సేన.. రిజల్ట్ రాబట్టాలనే ఉద్దేశంతో ఆడుతోంది. బాదుడు మంత్రంతో వార్‌ను వన్ సైడ్ చేస్తోంది. అయితే బజ్‌బాల్ ఫార్ములా వాళ్లకు బెడిసికొట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి. దీంతో ఈ ఫార్ములా విషయంలో వాళ్లు రివర్స్ గేర్ వేయడం కూడా చూస్తున్నాం. ఇప్పుడు అదే జరిగేలా ఉంది. భారత్‌తో జరుగుతున్న ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌లో ఓటమి అంచున ఉంది ఇంగ్లండ్. 608 పరుగుల లక్ష్య ఛేదనలో 72 పరుగులకు 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. దీంతో ఆ జట్టు బజ్‌బాల్‌ను ప్రయోగిస్తుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.డ్రా అయితే. .ఇంగ్లండ్ బజ్‌బాల్ ఫార్ములాను ఉపయోగించే ధైర్యం చేస్తుందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీనిపై ఆ టీమ్ అసిస్టెంట్ కోచ్ మార్కస్ ట్రెస్కోథిక్ తాజాగా స్పందించాడు. తామేమీ పిచ్చోళ్లం కాదని.. డ్రా ధ్యేయంగా ఆడతామని స్పష్టం చేశాడు. తాము ఎప్పుడూ సానుకూల దృక్పథంతో ఆడాలని అనుకుంటామని, ఎడ్జ్‌బాస్టన్‌లోనూ అదే విధంగా ముందుకు వెళ్తున్నామని తెలిపాడు. భారత్ సంధించిన లక్ష్యాన్ని అందుకోవడం చాలా కష్టమని.. ఒక్కరోజులో 550 పరుగులు చేయడం మామూలు విషయం కాదన్నాడు ట్రెస్కోథిక్. మొదటి 15 ఓవర్ల ఆట తర్వాతే మ్యాచ్ ఎలా ముందుకు సాగుతుందనేది తెలుస్తుందని, పిచ్ ప్రవర్తించే తీరును బట్టి తమ బ్యాటర్లు ఆడతారని క్లారిటీ ఇచ్చాడు. ప్రస్తుత పరిస్థితుల్లో మ్యాచ్ డ్రా అయితే తమకు సంతోషమేనని పేర్కొన్నాడు. అయితే తమ బ్యాటర్లు పోరాటం మాత్రం ఆపబోరని వ్యాఖ్యానించాడు.

## బజ్‌బాల్‌కు భయపడిన గిల్ ఇంత చేసినా తప్పని తిట్లు




ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌లో విజయం ముంగిట నిలుచుంది భారత్. రెండో ఇన్నింగ్స్‌లో 427 పరుగులు చేసిన టీమిండియా.. 608 పరుగుల లక్ష్యాన్ని సెట్ చేసింది. ఆ తర్వాత ఛేదనకు దిగిన ఇంగ్లండ్ నాలుగో రోజు ఆట ముగిసేసరికి 3 వికెట్ల నష్టానికి 72 పరుగులతో ఉంది. ఇంకా ఒక రోజు మిగిలి ఉంది. ఐదో రోజు భారత్ విజయానికి 7 వికెట్లు కావాలి. అదే ఆతిథ్య జట్టు నెగ్గాలంటే ఇంకా 536 పరుగులు చేయాలి. ఇప్పటికే క్రాలే, డకెట్, రూట్ ఔటైన నేపథ్యంలో ఇంగ్లండ్ డ్రా చేసుకున్నా గొప్పే అనుకుంటోంది. ఓటమి బారి నుంచి ఎలా తప్పించుకోవాలా? అని ఆలోచిస్తోంది. ఈ పరిస్థితుల్లో స్టోక్స్ సేనను చూసి భారత కెప్టెన్ టెన్షన్ పడటం చర్చనీయాంశంగా మారింది. ఎందుకింత భయం? ఇన్నింగ్స్ డిక్లరేషన్ విషయంలో టీమిండియా నయా కెప్టెన్ శుబ్‌మన్ గిల్ వ్యవహరించిన తీరు చర్చనీయాంశంగా మారింది. భారత ఆధిక్యం 500 దాటినా అతడు డిక్లేర్ చేయలేదు. 600 మార్క్‌ను అందుకున్నాకే డిక్లేర్ చేసి.. ఇంగ్లండ్‌ను ఛేదనకు ఆహ్వానించాడు గిల్. దీంతో అతడు ఎందుకు ఇంత డిఫెన్సివ్ మైండ్‌సెట్‌తో ఆలోచిస్తున్నాడని సోషల్ మీడియాలో నెటిజన్స్ ప్రశ్నిస్తున్నారు. బజబాల్‌కు ఎందుకింత భయపడుతున్నాడని కృశ్చన్ చేస్తున్నారు.డ్రా అయితే..!ఇంకో అరగంట ముందు డిక్లేర్ చేసి ఉంటే సిరాజ్-ఆకాశ్‌దీప్‌కు మరిన్ని ఓవర్లు బౌలింగ్ చేసేందుకు లభించేవని.. తద్వారా ఇంకో ఒకట్రెండు వికెట్లు తీసేందుకు అవకాశం దక్కేదని నెటిజన్స్ అంటున్నారు. ఆట ఐదో రోజు వర్షం కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో పూర్తి ఓవర్లు సాధ్యం కాకపోవచ్చు. ఈ కారణంగా ఒకవేళ మ్యాచ్ డ్రా అయితే దానికి గంభీర్, టీమ్ మేనేజ్‌మెంట్ బాధ్యత తీసుకుంటారా? అని నెటిజన్స్ నిలదీస్తున్నారు. అయితే మరికొందరు మాత్రం గిల్ చేసింది కరెక్ట్ అని.. ఇంగ్లండ్‌కు ముకుతాడు వేయాలంటే కొండంత స్కోరు సెట్ చేసి, అటాక్ చేయాలని చెబుతున్నారు. పరుగులు పోయినా ఫర్వాలేదు.. వికెట్లు తీయడమే ధ్యేయంగా అగ్రెసివ్ అప్రోచ్‌తో భారత్ ముందుకెళ్లాలని సూచిస్తున్నారు. వరుస సెంచరీలతో అదరగొడుతున్న కెప్టెన్‌ను ఈ విషయంలో అనవసరంగా విమర్శించొద్దని కోరుతున్నారు.

## ఒక్కరోజే రూ.735 కోట్ల లాభం

### - భారతీయ మార్కెట్లలో జేన్ స్ట్రీట్ అక్రమాలు అన్నీఇన్నీ కావు




న్యూఢిల్లీ/ముంబై, భారతీయ మార్కెట్లలో అమెరికాకు చెందిన ప్రొప్రైటరీ ట్రేడింగ్ సంస్థ జేన్ స్ట్రీట్ గ్రూప్ పాల్పడిన అక్రమాలు సంచలనం సృష్టిస్తున్నాయి. ఇప్పటికే క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. జేన్ స్ట్రీట్‌పై నిషేధం విధించిన విషయం తెలిసిందే. ఎస్క్రో ఖాతాలో అక్రమంగా ఆర్జించిన రూ.4,843 కోట్ల లాభాలను డిపాజిట్ చేయాలని కూడా ఆ కంపెనీని సెబీ ఆదేశించిన సంగతీ విదితమే. అయితే ఓ సంస్థకు ఈ స్థాయిలో జరిమానా పడటం సెబీ చరిత్రలోనే ఇది తొలిసారి. ఇక సెబీ బయటపెడుతున్న వివరాల్లో జేన్ స్ట్రీట్ ఎలా వేల కోట్ల రూపాయలను ఆర్జించిందో తెలియవస్తుంటే.. మన వ్యవస్థలో సరిదిద్దాల్సిన లోపాలు ఎన్నున్నాయో అర్థమవుతున్నదిప్పుడు. గత ఏడాది జనవరిలో ఓ రోజైతే ఏకంగా రూ.735 కోట్ల లాభాన్ని జేన్ స్ట్రీట్ జేబులో వేసుకున్నది మరి.ఇదీ సంగతి.2024 జనవరి 17న జేన్ స్ట్రీట్.. బ్యాంక్ నిఫ్టీ ఇండెక్స్, దాని కంపోనెంట్స్‌లో మునుపెన్నడూ లేనివిధంగా ఓ సరికొత్త 'ఇంట్రా-డే ఇండెక్స్ మ్యానిపులేషన్' స్కీంను తెచ్చి ఇండెక్స్ ఆప్షన్స్ నుంచి పెద్ద ఎత్తున లాభాలను గడించిందని సెబీ దర్యాప్తులో తేలింది. నాడు బ్యాంక్ నిఫ్టీ ఇండెక్స్ 46,573 .95 వద్ద ముగిసింది. మునుపటి రోజు (జనవరి 16) ముగింపు (48,125.10 )తో పోల్చితే నష్టాలను చవిచూసింది. అయితే ఇందుకు కారణం అంతా 16న మార్కెట్ ట్రేడి ంగ్ ముగిసిన తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రకటించిన ఆర్థిక ఫలితాలు నిరాశపర్చడమే అనుకున్నారు. కానీ దీని వెనుక జేన్ స్ట్రీట్ అనుసరించిన రెండు దశల వ్యూహాలున్నాయని, అందువల్లే 17న కొద్ది గంటల ట్రేడింగ్‌లోనే అది రూ.734.93 కోట్ల నికర లాభాలను పొందినట్టు సెబీ గుర్తించింది. నాడు ఉదయాన్నే క్యాష్/ఫ్యూచర్స్ మార్కెట్లలో బ్యాంక్ నిఫ్టీ ఇండెక్స్‌లోని రూ.4,370 కోట్ల విలువైన స్టాక్స్‌ను జేన్ స్ట్రీట్ కొన్నది. ఈ పరిణామం సూచీలో కృత్రిమ పెరుగుదలకు దారితీసింది. దీంతో అప్పటిదాకా నష్టాల్లో కదలాడుతున్న మార్కెట్.. రికవరీ అవుతున్నదన్న తప్పుడు సంకేతాలు మదు పరులలోకి వెళ్లాయి.ఇదే సమ యంలో చౌకగా కొనుగోలు ఆప్షన్స్‌ను, ఖరీదైనవిగా అమ్మకపు ఆప్షన్లను పెట్టడం ద్వారా బడా బ్యాంకుల షేర్లుండే నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ ఆప్షన్స్‌లో రూ.32,114.96 కోట్ల బేరిష్ పొజిషన్లను జేన్ స్ట్రీట్ ప్రభావవంతంగా నిర్మించగలిగింది. అయితే ఆ తర్వాత కాసేప టికే తమవద్ద ఉన్న దాదాపు అన్ని స్టాక్స్‌ను జేన్ స్ట్రీట్ అమ్మేసింది. దీంతో పెద్ద ఎత్తున జరిగిన అమ్మకాలు.. కంపోనెంట్ స్టాక్స్, ఇండెక్స్‌లో ధరల పతనానికి దారితీసింది. సూచీ పడిపో యింది. ఈ సమయంలో జేన్ స్ట్రీట్ గ్రూప్ సైతం ఇంట్రా-డే క్యాష్/ఫ్యూచర్స్ మార్కెట్ ట్రేడి ంగ్‌లో నష్టాలను అందుకున్నది. అయినప్పటికీ ఇండెక్స్ ఆప్షన్స్ నుంచి వచ్చిన లాభాలు ఈ నష్టాల కంటే చాలాచాలా ఎక్కువని సెబీ చెప్తున్న ది. ఇలా 2023 జనవరి నుంచి 2025 మే వరకు దేశంలోని వివిధ మార్కెట్ సెగ్మెంట్లలో మొత్తం రూ.36,671 కోట్ల నికర లాభాలను జేన్ స్ట్రీట్ అందుకోవడం గమనార్హం.ఐఐటీ విద్యార్థికి రూ.4.3 కోట్ల జీతంభారతీయ డెరివేటివ్స్ మార్కెట్‌లో అధునాతన అల్గారిద్మిక్ ట్రేడింగ్ ద్వారా పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిన జేన్ స్ట్రీట్ సంస్థ.. ఓ ఐఐటీ మద్రాస్ విద్యార్థికి ఏకంగా రూ.4.3 కోట్ల వార్షిక వేతనాన్ని ఆఫర్ చేయడం ఇప్పుడు మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన ఐఐటీ మద్రాస్ ప్లేస్‌మెంట్ సీజన్‌లోనే ఇది అత్యధికం కావడం గమనార్హం. అయితే మ్యాథమెటిక్స్, ప్రోగ్రామింగ్, రియల్-టైం డెసిషన్-మేకింగ్‌లో అడ్వాన్స్‌డ్ నైపుణ్యాలున్నవారికి ఆ కంపెనీ ఎందుకింత పెద్దపీట వేస్తున్నదనడానికి కూడా ఈ ఆఫర్ అద్దం పడుతున్నదిప్పుడు. ఎంఐటీ, హార్వర్డ్, కేంబ్రిడ్జ్, ఆక్స్‌ఫర్డ్, స్టాన్‌ఫర్డ్, ప్రిన్స్‌టన్ వంటి అంతర్జాతీయ ప్రముఖ యూనివర్సిటీల నుంచి ఎక్కువగా జేన్ స్ట్రీట్ నియామకాలు చేపడుతున్నది. భారత్‌లోనైతే ఐఐటీల నుంచి ఉద్యోగులను తీసుకుంటున్నది. ఇక సాధారణంగా జేన్ స్ట్రీట్ ఇంటర్వ్యూ ప్రక్రియ క్వాంటిటేటివ్ సమస్యల పరిష్కారం, కోడింగ్ సవాళ్లు, చురుకుదనం తదితర అంశాలపై ఆధారపడి ఉంటుంది.సెబీకి సహకరిస్తాం: జేన్ స్ట్రీట్

## పసిడి ప్రియులకు గుడ్‌న్యూస్ తగ్గిన బంగారం ధరలు



భారత స్త్రీలకు బంగారం అంటే ఎంత ఇష్టమో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఎంత బంగారం ఉన్నా.. ఇంకా కావాలనే అంటారు. ఇక, శుభకార్యాల్లో కూడా బంగారం కీలక పాత్ర పోషిస్తూ ఉంటుంది. జనం పెట్టుబడులకు కూడా బంగారాన్ని ఎంచుకుంటున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చోటు చేసుకున్న పరిణామాలతో గత కొద్ది రోజుల నుంచి బంగారం ధరలు పెరుగుతూ పోయాయి. నేడు మాత్రం బంగారం కొనాలనుకునే వారికి ఊరట లభించింది. బంగారం ధరలు తగ్గాయి.హైదరాబాద్ నగరంలో బంగారం ధరలు..హైదరాబాద్‌లో నిన్న 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 98,730 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 90,500 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర 74,050 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. నిన్నటితో పోల్చుకుంటే పది గ్రాముల బంగారంపై.. గ్రాముకు ఒక రూపాయి చొప్పున 10 రూపాయలు తగ్గింది. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 98,720 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 90,490 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర .. 74,050 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది.వెండి ధరలు..మొన్నటి వరకు బంగారం ధరలతో సంబంధం లేకుండా వెండి ధరలు ప్రతీ రోజు ఎంతో కొంత పెరుగుతూ పోయాయి. క్యారెట్ల బంగారంకానీ, ఈ రోజు వెండి ధరలు కూడా తగ్గాయి. నిన్న హైదరాబాద్ నగరంలో 100 గ్రాముల వెండి ధర 12,000 దగ్గర ట్రేడ్ అయింది. కేజీ వెండి ధర 1,20,000 దగ్గర ట్రేడ్ అయింది. ఈ రోజు 100 గ్రాముల వెండిపై 10 రూపాయలు, కేజీ వెండిపై 100 రూపాయలు పెరిగింది. 100 గ్రాముల వెండి ధర నేడు 11,990 దగ్గర ట్రేడ్ అవుతోంది. కేజీ వెండి ధర 1,19,900 దగ్గర ట్రేడ్ అవుతోంది.

## ఐటీఆర్ గడువు మళ్లీ పొడిగింపు? ఇదే కారణం

## పన్ను నిపుణులు ఏం చెప్తున్నారంటే




ఆదాయపు పన్ను రిటర్న్‌ల దాఖలు గడువును మరోసారి పొడిగించాలని పన్ను నిపుణులు కోరుతున్నారు. 2025 సెప్టెంబర్ 15 వరకు గడువు ఉన్నప్పటికీ, కొన్ని కీలకమైన యుటిలిటీలు ఇంకా అందుబాటులోకి రాకపోవడం, సిస్టమ్ సమస్యలు కొనసాగుతుండటంతో గడువును పొడిగించాలని కోరుతున్నారు. నాన్-ఆడిట్ కేసులకు సెప్టెంబర్ 30 వరకు, ఆడిట్ కేసులకు నవంబర్ 30 వరకు గడువును పొడిగించాలని నిపుణులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు మే నెలలో నాన్-ఆడిట్ కేసులకు ఆదాయపు పన్ను రిటర్న్‌ల దాఖలుకు గడువు తేదీని 2025 సెప్టెంబర్ 15గా ప్రకటిం చింది.అయితే, అసెస్‌మెంట్ సంవత్సరం 2025-26కు సంబంధించిన ముఖ్యమైన రిటర్న్ ఫైలింగ్ యుటిలిటీ 7 ఇంకా అందుబాటులో లేవు. దీనితో చాలా మంది ట్యాక్స్ పేయర్లు అయోమయంలో ఉన్నారు. అంతేకాకుండా, ఫైనాన్స్ యాక్ట్, 2025లోని నిబంధనలను ప్రతిబింబించేలా ఉండాల్సిన 2021-22, 2022-23కి సంబంధించిన అప్డేటెడ్ రిటర్న్ యుటిలిటీలు కూడా ఇంకా రావాల్సి ఉంది. పన్ను ఆడిట్ కేసులు కొనసాగడానికి వీలులేని కీలకమైన ఆడిట్-సంబంధిత ఫారమ్‌లు విడుదల కాకపోవడం కూడా జాప్యానికి కారణమవుతోంది'కంప్లయన్స్ క్యాలెండర్ చాలా క్లిష్టంగా ఉంది. సిస్టమ్ సంసిద్ధత పూర్తి కాలేదు' అని ఒక సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్ అన్నారు. పన్ను చెల్లించ డానికి సిద్ధంగా ఉన్న పన్ను చెల్లింపుదారులు బ్యాకెండ్ వైఫల్యాల కారణంగా బాధపడక వాడదు. డిపార్ట్‌మెంట్ దీనిని గుర్తించి, నిజాయి తీగా ఫైల్ చేసేవారి నుంచి భారాన్ని తొలగిం చాలన్నారు. చాలా మంది పన్ను నిపుణులు ఇప్పుడుఫైలింగ్ గడువును నాన్-ఆడిట్ కేసులకు సెప్టెంబర్ 30, 2025 వరకు, ఆడిట్ కేసులకు నవంబర్ 30, 2025 వరకు పొడిగించాలని కోరుతున్నారు. గతంలో ఇచ్చిన గడువులను, ఆచరణాత్మక సమస్యలను వారు గుర్తు చేస్తున్నారు.

## మ్యూచువల్ ఫండ్స్ లో మరో 18 పథకాలు.. సబ్స్క్రిప్షన్ షురూ.

ప్రస్తుతం 18 మ్యూచువల్ ఫండ్ కొత్త పథకాలు సబ్‌స్క్రిప్షన్ కోసం అందుబాటులోకి వచ్చాయి. కోటక్ నిఫ్టీ 200 క్వాలిటీ 30 ఇండెక్స్ ఫండ్, కోటక్ నిఫ్టీ ఏఏఏ బాండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ మార్చి 2028 ఇండెక్స్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ జూలై 7, 2025తో ముగుస్తాయి. ఐసీఐసీఐ ప్రూ నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ ఇండెక్స్ ఫండ్, గ్రోవ్ నిఫ్టీ 50 ఇండెక్స్ ఫండ్ వరుసగా జూలై 14, జూలై 16 తేదీల్లో ముగుస్తాయి. హెచ్‌డీఎఫ్‌సీ ఇన్నోవేషన్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ జూలై 11వ తేదీతో ముగుస్తుంది.నిప్పన్ ఇండియా ఎంఎన్‌సీ ఫండ్, సుందరం మల్టీ-ఫ్యాక్టర్ ఫండ్ రెండూ జూలై 16వ తేదీతో ముగుస్తాయి. ముగుస్తాయి. ఎడెల్‌వైజ్ ఇన్‌కమ్ ప్లస్ ఆర్బిట్రేజ్ యాక్టివ్ ఎఫ్‌ఓఎఫ్, ఇన్వెస్కో ఇండియా ఇన్‌కమ్ ప్లస్ ఆర్బిట్రేజ్ యాక్టివ్ ఎఫ్‌ఓఎఫ్ జూలై 15, జూలై ఓవర్‌నైట్ ఫండ్, యూనియన్ లో డ్యూరేషన్ ఫండ్ అనే రెండు డెట్ ఫండ్‌లు సబ్‌స్క్రిప్షన్ ముగుస్తాయి. బజాజ్ ఫిన్‌సర్వ్ స్మాల్ క్యాప్ ఫండ్, ట్రస్ట్‌ఎంఎఫ్ మల్టీ క్యాప్ ఫండ్, జేఎం లార్జ్ %డ% మిడ్ క్యాప్ ఫండ్ అనే మూడు డైవర్సిఫైడ్ ఫండ్‌లు వరుసగా జూలై 11, జూలై 14, జూలై 18 తేదీల్లో ముగుస్తాయి. మ్యూచువల్ ఫండ్ సంస్థలు తమ పోర్ట్‌ఫోలియో శ్రేణిని పూర్తి చేసేందుకు కొత్త ఫండ్లను అందుబాటులోకి తీసుకొచ్చాయి. ఇండెక్స్ ఫండ్స్: కోటక్ నిఫ్టీ 200 క్వాలిటీ 30 ఇండెక్స్ ఫండ్, కోటక్ నిఫ్టీ ఏఏఏ బాండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ మార్చి 2028 ఇండెక్స్ ఫండ్ జూలై 7న ముగుస్తాయి.ఐసీఐసీఐ ప్రూ నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ ఇండెక్స్ ఫండ్, గ్రోవ్ నిఫ్టీ 50 ఇండెక్స్ ఫండ్ వరుసగా జూలై 14, జూలై 16 తేదీల్లో ముగుస్తాయి.

తెలంగాణ తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం




# అఖండ 2 కోసం సర్ ప్రైజింగ్ యాక్టర్..!

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం అఖండ 2 సినిమా చేస్తున్నారు. బోయపాటి శ్రీను డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమా భారీ అంచనాలతో వస్తుంది. అఖండ సినిమా బ్లాక్ బస్టర్ కాగా దానికి కొనసాగింపుగా అఖండ 2 వస్తుంది. ఈ సినిమాను 14 రీల్స్ ప్లస్ బ్యానర్ లో గోపీ ఆచంట, రామ్ ఆచంట భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. అఖండ 2 లో కాస్టింగ్ నందమూరి ఫ్యాన్స్ తో పాటుగా ఆడియన్స్ ని సర్ ప్రైజ్ చేస్తుంది. సినిమాలో ప్రగ్యా జైశ్వాల్ తో పాటు సంయుక్త మీనన్ కూడా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇక లేటెస్ట్ గా సినిమాలో ఒక ఇంపార్టెంట్ రోల్ లో బాలీవుడ్ నటిని తీసుకుంటున్నట్టు తెలుస్తుంది. బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ నటించిన సూపర్ హిట్ సినిమా భజరంగి భాయిజాన్ సినిమాలో నటించిన చైల్డ్ ఆర్టిస్ట్ హర్షాలి మల్హోత్రా అఖండ 2లో ఛాన్స్ అందుకుంది. సినిమాలో ఒక మంచి పాత్రలో ఆమె నటిస్తుందని తెలుస్తుంది. దీనికి సంబంధించిన అఫీషియల్ అనౌన్స్ మెంట్ మేకర్స్ ప్రకటించారు. అఖండ 2 లో హర్షాలి జనని అనే పాత్రలో కనిపించనుంది. చైల్డ్ ఆర్టిస్ట్ గా సల్మాన్ తో నటించిన ఆమె ఇప్పుడు అఖండ 2 లో నటించడం మూవీ లవర్స్ ని సర్ ప్రైజ్ చేస్తుంది. అఖండ 2 సినిమా పాన్ ఇండియా రిలీజ్ అవుతున్న సందర్భంగా హర్షాలికి ఇది కలిసి వచ్చే పాత్ర అవుతుందని చెప్పొచ్చు. బోయపాటి శ్రీను అఖండ 2 విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ అవ్వట్లేదు. బాలయ్య బర్త్ డే నాడు రిలీజ్ చేసిన టీజర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాను దసరా కానుకగా సెప్టెంబర్ 25న రిలీజ్ ఫిక్స్ చేశారు. బాలయ్య ఫ్యాన్స్ కి మరోసారి ఐ ఫీస్ట్ అందించేలా అఖండ 2 ఉంటుందని తెలుస్తుంది. ఇక అఖండ 2 కోసం థమన్ మరోసారి డ్యూటీ ఎక్కేశాడని తెలుస్తుంది. సినిమాలో తెర మీద సీన్స్ కి అతను ఇచ్చే బిజిఎం నెక్స్ట్ లెవెల్ లో ఉండబోతుందని తెలుస్తుంది. అఖండ 2 కాస్టింగ్ విషయంలో ఆడియన్స్ ని సినిమాపై మరింత ఆసక్తి పెంచేలా చేస్తుంది. మరి సినిమాపై పెరుగుతున్న ఈ అంచనాలు చూస్తుంటే పాన్ ఇండియా లెవెల్ లో అఖండ 2 సంచలనాలు సృష్టించేలా ఉందని చెప్పొచ్చు.



# కళ్లు చెదిరే విజువల్స్‌తో ప్రోమో

పాన్ ఇండియా నిర్మాణ సంస్థ హొంబలే ఫిలిమ్స్%ూ% క్లీమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి ప్రతిష్టాత్మకమైన, సెన్సేషనల్ వెంచర్ మహావతార్ సినిమాటిక్ యూనివర్స్ (ఎంసియు) కోసం చేతులు కలిపింది. ఈ విజనరీ యానిమేటెడ్ ఫ్రాంచైజీ విష్ణువు దశ అవతారాల పురాణ గాథకు జీవం పోస్తుంది. ఇది అత్యాధునిక యానిమేషన్, భారతీయ పురాణాల బేస్ట్ కంటెంట్‌లో ఇంతకుముందు ఎ న్నడూ ప్రయత్నించని సినిమాటిక్ స్కేల్‌తో అల రించబోతోంది.దర్శకుడు అశ్విన్ కుమార్ దర్శ కత్వంలో శిల్పా ధావన్, కుశాల్ దేశాయ్, చైతన్య దేశాయ్ నిర్మిస్తున్న మహావతార్ నరసింహ, మొదటి భాగం జూలై 25, 2025న ఐదు ప్రధాన భారతీయ భాషలలో అత్యాధునిక 3డి ఫార్మాట్‌లో విడుదల కానుంది. తాజాగా విడుదలైన ప్రోమో ప్రపంచాన్ని గందరగోళంలోకి నెట్టే ప్రమాదం ఉన్న హిరణ్యకశిపుడిని పరిచయం చేస్తుంది. కళ్లు చెదిరే విజువల్స్, అద్భుతమైన సంగీతం, కాలాన్ని ప్రతిధ్వనించే పౌరాణిక వైభవంతో ఈ ప్రోమో అధర్మం రాజ్యమేలుతున్న యుగం యొక్క తీవ్రతను చూపిస్తోంది.

# నటనను వదిలేశానంటూ రూమర్లు

## అలాంటిదేమీ లేదన్న నటి కోమలి ప్రసాద్




లుగు చిత్రసీమలో తనదైన ముద్ర వేసుకుని నటిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది కోమలి ప్రసాద్. ఇటీవల నాని 'హిట్ 3' మూవీలో ముఖ్యపాత్ర పోషించిన ఈ ముద్దుగుమ్మ, త్వరలో 'శశివదనే' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. అయితే ఈ నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా ఆమె గురించి కొన్ని అబద్ధపు పుకార్లు చక్కర్లు కొడుతున్నాయి. నటనకు గుడ్ బై చెబుతూ డాక్టర్ వృత్తిలోకి మారిపోయింది అని పుకార్లు వినిపించడంతో, కోమలి తానే స్వయంగా స్పందించారు.. 'అందరికీ నమస్కారం. ఇటీవల నా గురించి డాక్టర్‌గా మారిపోయానని, నటనను పూర్తిగా వదిలేశానని కొన్ని అసత్య వార్తలు ప్రచారంలో ఉన్నాయి. కొందరు ప్రముఖ మీడియా సంస్థలు కూడా దీనిని నిజమైందన్నట్లుగా ప్రచారం చేయడం బాధాకరం. ఇది పూర్తిగా అసత్యం. నిజానికి ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ సినిమాల్లో నా స్థానం సంపాదించుకున్నాను. ఆ శివుని ఆశీస్సులతో నా నటనా ప్రస్థానం కొనసాగుతోంది. ఈ రకమైన రూమర్లు నాలోను, నా శ్రేయోభిలాషుల్లోను అనవసరంగా ఆందోళన కలిగిస్తున్నాయి. ఇలాంటి తప్పుడు వార్తలు వ్యాప్తి చెందకూడదని మనస్ఫూర్తి వేడుకుంటున్నాను. అందుకే ఈ పోస్ట్ ద్వారా నిజాన్ని మీ అందరితో పంచుకోవాలనుకున్నాను. నటన నాకు ఒక్క ఉద్యోగం మాత్రమే కాదు.. అది నా జీవన విధానం. చివరి శ్వాస వరకు నేను నటనతోనే జీవించాలనుకుంటున్నాను. ప్రస్తుతం కొత్త స్క్రిప్ట్‌లను ఎంతో జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటున్నాను. త్వరలోనే మీ అందరినీ గర్వపడేలా చేసే కొత్త ప్రాజెక్ట్‌ల వివరాలతో మీ ముందుకు వస్తాను. నా ప్రయాణంలో వెన్నెముకలా నిలిచిన నా శ్రేయోభిలాషులకు, నన్ను నమ్మిన ప్రతి ఒక్కరికి నా హృదయపూర్వక ధన్యవాదాలు' అని కోమలి ప్రసాద్ తేల్చిచెప్పింది.

# వార్-2ను తెలుగులో రిలీజ్ చేయనున్న నాగవంశీ



యంగ్ టైగర్ ఎన్టీఆర్ భారీ యాక్షన్ మూవీ వార్ 2. బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్ తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోబోతున్నాడుఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్స్, గ్లిమ్స్ సినిమాపై అంచనాలు భారీగా పెంచేశాయి. ఎన్టీఆర్, హృతిక్ మధ్య వచ్చే యాక్షన్ ఎపిసోడ్స్ ఫ్యాన్స్ కు విజువల్ ఫీస్ట్ ఇస్తాయని యూనిట్ కూడా బలంగా నమ్ముతోంది. యష్ రాజ్ ఫిల్మ్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం ఏడాది ఆగస్టు 14 న ఈ సినిమా వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. ఈ సినిమా తెలుగు రైట్స్ ను సితార ఎంటె÷-టంల్గ÷నమెంట్స్ నాగవంశి సుమారు రూ. 90 కోట్లకు కొనుగులు చేసారు. తెలుగు సినిమా చరిత్రలో ఒక నాన్ తెలుగు సినిమాకు ఈ ధర పలకడం హిస్టరీ. కేవలం ఎన్టీఆర్ నటిస్తుండడంతోనే ఆ రేట్ పలికిందనేది వాస్తవం. అనుగుణంగానే వార్ 2 తెలుగు స్టేట్స్ రిలీజ్ ను అదే స్థాయిలో రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాడు నాగవంశీ. ఆగస్టు 14న తెల్లవారు జామున షోస్ వేసేలా ఎ÷-లాన్ చేస్తున్నాడట. ఇప్పటికే అందుకు అందుకోసం థియేటర్స్ తో చర్చలు కూడా చేస్తున్నారట. భారీ యాక్షన్ ఎంటె÷-టంల్గ÷నర్ గా వస్తున్న వార్ 2 ను తెలుగు రాష్టాల్లో మొదటి రోజు బి÷-గగెస్ట్ నంబర్స్ ఉండబోతున్నాయి. అలాగే తమిళ సుపర్ స్టార్ రజనీకాంత్, లోకేష్ కనకరాజ్ కాంబోలో వస్తున్న పాన్ ఇండియా బి÷-గగెస్ట్ మల్టీస్టారర్ కూలీతో పోటీగా రిలీజ్ అవుతుంది వార్ 2.




# శృతితో విభేదాలు లేవు

## -అడివి శేష్



టాలీవుడ్ హీరో అడివి శేష్ నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'డెకాయిట్' సినిమా నుంచి శృతిహాసన్ తప్పుకోవడంపై వస్తున్న వదంతులకు ఆయన స్వయంగా తెరదించారు. చిత్ర బృందంతో విభేదాల కారణంగానే శృతి ఈ ప్రాజెక్ట్ నుంచి వైదొలిగారంటూ జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని అడివి శేష్ స్పష్టం చేశారు. కేవలం డేట్ల సర్దుబాటు సమస్య వల్లే ఈ మార్పు జరిగిందని ఆయన వివరించారు.ఈ విషయంపై అడివి శేష్ మాట్లాడుతూ, "శృతి హాసన్ మరో ప్రతిష్ఠాత్మక చిత్రం 'కూలీ'లో నటిస్తుండటంతో మా సినిమాకు డేట్స్ కేటాయించడంలో ఇబ్బందులు తలెత్తాయి. రెండు సినిమాల షూటింగ్స్ ఒకేసారి రావడంతో ఆమె 'డెకాయిట్'కు పూర్తిస్థాయిలో సమయం ఇవ్వలేకపోయారు. అందుకే పరస్పర అంగీకారంతోనే ఆమె ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారు. మా మధ్య ఎలాంటి గొడవలు గానీ, మనస్పర్థలు గానీ లేవు" అని తేల్చిచెప్పారు. ఈ ప్రకటనతో గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న ఊహాగానాలకు ముగింపు పలికినట్లయింది.షేనియల్ డియో దర్శకత్వంలో 'డెకాయిట్' సినిమా ఒక ఇంటెన్స్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది. మొదట ఈ చిత్రంలో అడివి శేష్ సరసన శృతి హాసన్‌ను కథానాయికగా ఎంపిక చేసి, కొంత భాగం చిత్రీకరణ కూడా జరిపారు. అయితే అనూహ్యంగా ఆమె తప్పుకోవడంతో, ఆమె స్థానంలో ప్రముఖ నటి మృణాల్ ఠాకూర్‌ను తీసుకున్నారు.ప్రస్తుతం ఈ చిత్రంలో అడివి శేష్, మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ తెరపై ఎలా ఉండబోతుందనే దానిపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. అడివి శేష్ తన గత చిత్రాల మాదిరిగానే ఈ సినిమాతో కూడా ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని అందించడానికి సిద్ధమవుతున్నారు.

